# త్యాగి పే“రిడీ”లు+



## టి.వి.సత్యనారాయణ

ప్రచురణ:

**సరసభారతి**

ఉయ్యూరు, కృష్ణాజిల్లా

**TYAGI PYA"RADEE"LU+**

by

**T.V.Satyanarayana**

First Edition: **MARCH 2015**

Copies: 500

© **Author**

Price. Rs.**80/-**

Cover Design: **Kalasagar**

Writer Address: **Tadimeti Satyanarayana**
1-1-409/1, Manasa Enclave, Mohan Nagar,
Kottapeta, HYDERABAD-500 035
Cell No:9491874377

For Copies: **Gabbita Durga Prasad**
President, "Sarasabharathi"
H.No.2-405, Sivalayam Street,
Near Raja gari kota, Vuyyuru- 521 165
Krishna Dist. Phone:08676- 232797
Cell: 9989066375

Type Setting: **"Ramya Bharathi"** vja

Printed : **Rainbow Graphics,** vijayawada-2

బాపు - రమణలకు

**అంకితం**



## బాపు రమణల సప్తస్వరాలు

ఆ॥ వె॥ జంటకవుల పదము పంటలు పండించ
నాడు దేశమంత నాట్యమాడె;
రెండు భాషలకును మెండైన కవులైరి
వారి అంశ కాదె! బాపురమణ!

ఆ॥ వె॥ గీత ప్రాణపథము రాతలు రమణవి
రాత, గీత బాపు రమణమయ్యె;
చిత్ర(సినిమ) భాషలోన సిరుల ముగ్గులనల్లె
(సినిమ సీమలోన సిరుల ముగ్గులనల్లె)
బాపు రమణ జంట బహు పరాక్కు!

ఆ॥ వె॥ గీత సాక్షి రాత గీటుగా మొదలైన
బాపు, రమణ జంట పయన కీర్తి
"రంగుసీమ"లోన రసగుళికలనిచ్చె
బాపు రమణ జంట బహు పరాక్కు!

ఆ॥ వె॥ తడిసి "ముద్ద" అగుట తరతరాలుగ వచ్చె;
తడిసి "ముద్దు" రమణ తరహ రాత!
తడిసి "హీరోయిన్లు" మడిగట్టు కుందురా?
గీతగీయు బాపు; రాత రాయు రమణ;

ఆ॥ వె॥ మైత్రిలోని విలువ ధాత్రిలో చాటెను
"ఉభయ కవులు" వారు అభయ మిచ్చె
రమణలేని బాపు రసహీనకావ్యంబు
కాదె! రాత లేక లేదు గీత!

ఆ॥ వె॥ సహజముగ "మరణము" సామాన్యు లిలపోవ;
మాన్యు డిలను వీడ అన్యమగును;
మహిమ గాదె హ! అసమాన్యుడు పోవంగ
చేరు కొనెను బాపు చెంతరమణ!

సీ॥ రాసిన రాతకు గీసిన గీతసా
క్షిగ నిల్చి రస సృష్టి యగుట ఘనము;
గీసిన గీతకు రస పుష్టి గల్గుట
వేసిన రంగుకు రాసినట్టు!

"రెండు జడల సీత" రెండు తెలుంగుల
తెరచాటు వెలుగుల తెలుగు బాల!
బాణికి సరిపడ వాణిని పల్కిన
బాపు రమణ లైరి బాసరమణి!

ఆ॥ వె॥ వేయి పల్కనేల? వెలుగు తెల్గులసాక్షి
వెండి తెరకు సాక్షి వేదమగును!
కుంచె బాపు కదల కురిపించెను రమణ
సరస, హాస్య, విలనిర్ఝరు లు మనకు!

**- కల్నల్ సి.వి.ఎల్.ఎన్.రావు**



# ముందుమాట

## హాస్యం పిం(పం)డిన పేరడీలు

**శ్రీ** టి.వి.సత్యనారాయణ గారితో దాదాపు నలభై ఏళ్ళ పరిచయం ఉందినాకు. చతుర సంభాషణ చతురోక్తులతో నవ్వించటం కవిత్వంలో నవ్వును చిందించటమే కాదు, శ్రీకృష్ణునిపై అంతే ఆరాధనతో భక్తినీ కథల్లో ప్రవహింపజేస్తారు. బాపు రమణ అన్నా, శ్రీ రమణ అన్నా వల్లమాలిన అభిమానం ఉన్నవారు. సరసభారతికి ఆత్మీయులలో ఒకరు. తాను రాసిన "శ్రీ కృష్ణ లీలామృతం" కథల పుస్తకాన్ని ముద్రించి 19-11-2012న ఫ్లోరా హైస్కూల్‌లో సరసభారతి 39వ సమావేశంలో ప్రముఖ రచయిత్రి డా॥ శ్రీమతి కే.బి.లక్ష్మిగారి చేత ఆవిష్కరణ జరిపించారు. ఇప్పుడు తన కలం పేరు "త్యాగి" పేరుతో "త్యాగి పేరడీలు" రాసి సరసభారతి ఆధ్వర్యంలో ముద్రణ చేయించారు. ఆ పుస్తకాన్ని సరసభారతి 76వ సమావేశంగా నిర్వహిస్తున్న శ్రీ మన్మథ నామ సంవత్సర ఉగాది వేడుకలలో 15-3-15 ఆదివారం ఆవిష్కరింపజేయటం ముదావహం. సరసభారతి సభలో వారి రచనను ఆవిష్కరించటం ఇది రెండవసారి. మాపై వారికున్న నమ్మకానికి ఉదాహరణ.

ఇందులో పేరడీలు కవితలు, గిరీశం మార్కు హాస్యం, ప్రముఖ రచయితలపై పేరడీలు శ్రీ త్యాగి హాస్యాన్ని చక్కగా వండి వడ్డించారు. హాస్య రచనలు తక్కువగా వస్తున్న కాలంలో ఇది ఆ లోటును కొంత పూరిస్తుంది. ఇంతవరకు నాకు తెలిసినంత వరకు తెలుగులో చక్కని ఆరోగ్యకరమైన హాస్యాన్ని పండించిన బాపు-రమణ జంట మరణానంతరం ఎవరూ వారికి పుస్తకం అంకితం ఇచ్చినట్లు కనబడదు. శ్రీ ముళ్ళపూడి రమణ "గిరీశం లెక్చర్లు" రాసి కొత్త ఒరవడి సృష్టించారని మనకు తెలుసు. ఈ జంటకు ఈ పేరడీలు అంకితం ఇస్తే బాగుంటుంది అని శ్రీ టి.వి.కి సూచించాను. వెంటనే అంగీకరించారు. బాపు రమణలకు "త్యాగి పేరడీలు" అంకితమిచ్చి సరసభారతి ఈ విషయంలో ఆదర్శంగా నిలిచింది.

**- గబ్బిట దుర్గాప్రసాద్, ఉయ్యూరు**

# త్యాగి పే"రెడీ"లు+

పేరడీ సాహిత్యం పద్య కవిత నుంచి ముందుగా పుట్టిందని పెద్దలంటారు. ఉమర్‌ఖయాం రుబాయిలంటే నాకు చాలా ఇష్టం... ఆ గొప్ప సాహితీవేత్తలా నేను రాస్తే...

**ఉమర్‌ఖయాం:**

అసలైన లోహపు మొనకు
సిసలైన డైమండ్ పాయింట్ వేసి (వజ్రపు తునక)
ప్రేమ పాయిజన్‌లో ముంచి
నా గుండెనే గురిగా ఎంచి
కనుబొమవిల్లు వత్తికట్టి
కంటిచూపు తూపు ఎక్కుపెట్టి
జారిపోతున్న పైట మునిపంట నొక్కిపట్టి
తీసింది నా ప్రాణం చెలి తీయగా

నా గుండె గాయపు బాధ
రాయాలంటే అదొక విషాద గాథ
నే తాగిన మధువు కైపు
పొందిన నీ కళ్ళు నావైపు
చూసిన ప్రతిచూపు
నా గాయాన్ని మరీ మరీ రేపు
నీకోసం నా ఆఖరి రక్తపు చుక్క
చాలు! సాకీ ఇది నా ఆఖరి ముక్క. ❁

**గా**లిబ్ కవిత్వం మహోన్నత శిఖరాలను తాకిన రోజులవి!

వాహ్! మత్తులో ఉంటేనేమి, మైకంలో ఉంటేనేమి?
అతని సౌందర్యారాధన! ఎన్ని తరాలు గడిస్తేనేమి?
ఎన్ని యుగాలు నడిస్తే నేమి?
నిత్య నూతనం అతని యవ్వనం; కవిత్వం.

**గాలిబ్:**

ముందు మందివ్వు అంటాను నేను
కాదు, ముద్దివ్వు అంటుంది తాను
మధువులో ఉంది ఎంతో నిషా
ఆమెలో ఇంకా ఉంది, అదే తమాషా
ఏమి చూస్తావు మధుపాత్ర కంపులు
ఆమెకు ఎన్ని ఉన్నాయో చూడు సొంపులు
మధువు పాత్ర నిండా ఉంటే చాలదు
ఆమె తోడు ఉంటే కాని ప్రొద్దువాలదు
ఆమె నింపిన మధుపాత్రలు కమనీయం
ఆమెతో గడిపిన రాత్రులు రమణీయం. ❁



శరత్ సాహిత్యంలో దేవదాసు పాత్రని ఏ ముహూర్తంలో సృష్టించాడో కాని మన సినీరంగంలో ఆ పాత్ర స్ధానం అద్వితీయం.

ఆ పాత్రని పాటల ద్వారా పేరడీ చేస్తే...

శ్రీ దాసరి నారాయణరావుగారు దేవదాసుకి పాట రాస్తే...

పారూ!
నన్ను కాదనీ... కానే కాదనేకొనీ
ఏమీ కాననీ... కానే కాననుకొనీ
వెళ్ళిపోయావు నీవూ...
కుళ్ళిపోయాను నేనూ... ॥పారూ...పారూ॥
నా లేత ప్రాయంలో...
ఈ గుండె గాయంతో
ఎన్ని రక్తపు మళ్ళూ...
తిరుగుతున్నాయి సుళ్ళూ... ॥పారూ...పారూ॥
నా గుండె ప్రేమతో రగిలీ
ముక్కలైపోయింది పగిలీ
ఈ మంటలార్పేది ఒక్కటే... మందూ
పడి ఉంటా జీవచ్ఛవమై నీ... ముందూ. ॥పారూ...పారూ॥

ప్రేమనగర్ సిన్మాలో... ఎవరికోసం... ఎవరికోసం పాటకి...

ఇసుకతో కట్టాను ప్రేమగూడూ
కసితో కాలితో తన్నావు చూడూ...
కూలిపోయింది నా ప్రేమ సౌధం
కాలిపోతుంది నా ప్రేమ రథం ॥ఇసుక॥
నా ఊహల్లో నీవే ప్రతి నిమిషం
అందుకే తాగుతున్నానీ విషం
గూడులేని జీవితం చీకటీ!
ప్రేమ లేని జీవితం ఏమిటీ!! ॥ఇసుక॥

ఈ చెలియలికట్ట తెగిపోనీ
మన ప్రేమ కట్టడం మునిగిపోనీ
కెరటాల నురగతో కలసిపోనీ
మరో లోకాల తీరాలకు చేరుకోనీ
పోనీ... పోనీ... పోనీ. ❁



ఎవ్వరూ రికార్డు చేస్తున్న దాఖలాలు లేవుగానీ...
మన సొసైటిలో ఎన్నో సినిమా పాటలకు, దేవుడి పాటలు
వరుసలు కట్టి పాడుకుంటున్నారు జనం
వాటి సంగతి అలా ఉంచితే... ఈ పాట ఫలానా పాటకి పేరడీ...
అని చెప్తే... అది పేరడీయే కాదు...

బస్సులో - బజారుకెళ్ళి
కూరలు తెచ్చే - కుర్రదానా
బస్సు దిగిరా - బడాయి చాలు
లెక్క చూడూ - చక్కగానూ.
నీకుమల్లే - ఎందరెందరో
బేరాలాడీ - కూరలు తెస్తే
వారికూరలూ - కిలోకి అరకిలో
బరువు ఉంటే - బాధపడకే! ॥బస్సు॥
ఆటోలోన - ఎటోచూస్తూ
మార్కెట్‌కెళ్ళే - మరదలుపిల్లా
రంగు ప్యాకెట్ - పొంగే సరకూ
ఎలానిండెనో - తెలుసుకోవే!
నల్ల మార్కెట్ - శాల్తీలెన్నో
వల్లమాలిన - కల్తీచేసి
రంగు, రుచులూ - రూపురేఖలూ
మార్చి నింపిరీ - మర్చిపోకులే! ॥బస్సు॥
పెళ్ళిలోన - పట్టుచీరతో
మెరిసిపోయే - మరదలు పిల్లా
కంచిపట్టు - కర్మమేమిటో

కొంచెమైనా - తెలుసుకోవే

జరీకాదే - గిరీకాదే
జరీ పేరుతో - జరిమానానే
పదివేలు పోసి - పదిసార్లు కట్టక
బీరువాలో - దాచుకోకే... ॥బస్సు॥

సొంత ఇల్లనీ - కొంత హెచ్చుతో
టెక్కులు పోకె - హైటెక్కు పిల్లా
సొంత ఇంటి - సొదలు ఎన్నో
కొంత వరకూ - తెలుసుకోవే..

జన్మమంతా - జీతమంతా
నడ్డి విరిగే - వడ్డీతోటీ
బేంకులోన - జమలు కట్టి
అసలు తీరని - వెతలు నీవె ॥ బస్సు॥



పేరడీ చెయ్యటానికి పద్యకవితలు కూడా ఎవరికీ అడ్డుకాలేదు. ఎంతోమంది పద్య కవితల్ని పేరడీ చేశారు. వారిలో ఝరుక్ శాస్త్రిగారు ప్రసిద్ధులు.

కీ॥శ॥ ఘంటసాలగారు పాడిన "నేనొక పూలమొక్క కడనిల్చి" సుప్రసిద్ధం. దీనిని కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రిగారు రాశారు. కరుణతో కూడిన పద్యాల్ని కరుణాత్మకంగా నే పేరడీ చెయ్యటం సభ్యత అనిపించి... కరుణాత్మకంగా ఈ పద్యాలు.

బాలకార్మికుడు:

ఉ॥ నేనొక బాలకార్మికుడు - నేనెరుంగన్ సుఖమన్న నెద్దియో
గానుగ ఎద్దుకున్ గలదు - కాస్త సుఖంబు, అదేమి పాపమో
మానక జన్మమెత్తినను - మచ్చుకైనను నాకు లేదయో
నానుదుటన్ చతుర్ముఖుడు - నాస్తి సుఖంబని వ్రాసెనేలనో!

తే॥గీ॥ కడుపు మాడెదు మాపైన కరుణలేక
చిన్న పిల్లలమని సుంతచింతలేక
తిండి పెట్టక నెత్తురు పిండుకినుచు
నరుడు చూపించు మాకిట్లు నరక మిలను.

ఉ॥ ఆగదు కాలమెప్పుడును - ఆగదెన్నడు సృష్టి కార్యమున్
సాగరమందు లేచిపడు - సంఖ్యకు మించిన ఆ తరంగముల్
ఆగకె బాలకార్మికుల నా విధి చేసిన పాపకృత్యముల్
ఆగక పాడు లోకమున - సాగునె కీచక నీచ కృత్యముల్

కవి:

తే॥గీ॥ పుణ్యభారత భూమిని పుట్టిగూడ
చిన్నపిల్లల భవితను చిదిమివేసి
అంధకారము పెంచెడి అధముడెపుడు
మానవుడు కాదు ఆతడె దానవుండు

ఆ॥వె॥ ముద్దులొలుకు చిన్ని మొగ్గలు పిల్లలు
కోయకుండ పూలు పూయనిండు
అందమైన వసుధ నందనవని యౌను
పరిమళించును కోటి విరుల తోడ. ❁

# ఓ ప్రేమ కథాయణం

(ముళ్ళపూడి వెంకటరమణగారు, ఆదివిష్ణుగారు, యర్రంశెట్టి శాయిగారు, చలంగారూ, యండమూరిగారూ కలిసి సరదాగా ఓ ప్రేమకథ వ్రాస్తే ఎలా ఉంటుందన్న ఊహకి ఈ రచన పేరడీ)

| | | |
|---|---|---|
| కథా కాలం | : | 1970 |
| లొకేషన్ | : | భీమవరంలో ఓ కాలేజీ |
| షూటింగ్ స్పాట్ | : | సపోటా 'లాడ్జి'లో ఓ రూమ్ |
| సమయం | : | ఉదయం 10 గం॥ |

"ముందు కథ చెప్పు. మిగతావన్నీ తరవాత" బాధగా మూల్గాడు రాజు.

"రాజు లవ్డ్ సీత ఎట్ ఫస్ట్ సైట్... రాజు తొలిచూపులోనే సీతను ప్రేమించెను" అన్నాడు రాజుకు ప్రేమకథ చెప్తున్న గుర్నాధం.

"తొలిచూపేమిటి నీ బొంద, 'తొలి కానుపు'లాగ... ఫస్ట్‌సైటే బాగుంది అలా ఉంచెయ్..." అంత బాధలోనూ హాస్యరసాన్ని రంగరించాడు రాజు. రాజుకో అనుమానం వచ్చింది. తనింత ఇదిగా ప్రేమిస్తుంటే, రాధ ఏం చేస్తోంది?... ఈ విషయమే అడిగాడు గుర్నాధాన్ని. గుర్నాధం జనాంతికంగా నవ్వాడు. రాజది గమనించలేదు. ఓ ఎక్స్‌ప్రెషన్ వేస్తయిందనుకున్నాడు. దాన్నలా వదిలేసి, "ప్రేమ విషయాల్లో అంతగా ప్రవేశం లేని సీత, అనేక వేల హృదయాల్లో ఒక 'హృది' మరీ ఇంత ఇదిగా లేక 'అది'గా తనకోసం పరితపించిపోతోందన్న సంగతి తెలియక బుద్ధిగా రోజూ కాలేజీకి వెళ్ళివస్తూంది." రిపోర్టు చదివినట్టు చెప్పాడు గుర్నాధం. రాజు హృదయం బాధతో ఘూర్లిల్లింది.

"రాజు మాత్రం కాలేజీ ఎగ్గొట్టి లేజీగా రూమ్‌లో నడుకొని సీతకు 'వీజీ'గా తన ప్రేమ హృదిని కానుకగా ఎలా ఇవ్వాలా! అని, ఉంగరాల జుట్టు తలని బట్టతల చేసుకొనే ప్రయత్నంలో ఉండెను..." గుర్నాధం రిపోర్ట్ ఇంకా పూర్తికాలేదు.

"ప్లీజ్, స్టాప్ దట్ నాన్సెన్స్... నా ప్రేమ నీకు వేళాకోళంలా ఉందే. నా గుండె గాయానికి కట్టుకడతావనుకుంటే... ఇలా ఇంకా కోత నెడతావేంటి? నా

ప్రేమకథని డైరక్ట్ చేసి నూరురోజుల పండుగ జరిపించే నాథుడే లేడా!... లేడా!! లేడా!!!" (... థుడే, లేడా! లేడా! రూమ్ రీసౌండిచ్చింది). "లేకేమి, ఉన్నాడు రాజూ ఉన్నాడు" అంటూ సుడిలేని గాలి లాగా, ఉరుము లేని పిడుగులాగా, పోనీ వెలుగు లేని పిడుగులాగా, అడగ్గానే అప్పిచ్చే వైద్యుడి లాగా, అవసరం లేకపోయినా ఆపరేషన్ చేసే డాక్టరు లాగా, అడక్కుండానే వరాలిచ్చే దేవుడిలాగా, వాడుక కొద్దీ వాగ్దానాలు చేసే మంత్రాలాగా, ధారాళంగా నీళ్ళు కారిపోతున్న వీధి కుళాయి లాగా, మీ కప్పులేని ఆపద్భాందవుడిలాగా ఆ గదిలోకి ప్రవేశించాడు ఓ ఆగంతకుడు. (రాముడు- భీముడు సిన్మాలో ఎన్టీఆర్ (భీముడు) కేరెరక్టర్‌లాగ).

గదిలోకి వచ్చిన ఆగంతకుణ్ణి చూసిన మిత్రులిద్దరూ, అతడెవరో ఎందుకొచ్చాడో తెలియక ఒకరి ముఖాలొకరు చేసుకున్నారు.

"నా పేరు లవకుమార్. నన్నంతా 'లవ్ కుమార్' అంటార్లెండి" అంటూ తనని తాను పరిచయం చేసుకున్నాడతను.

"అయితే ఏంటట?" అన్నట్లు చూశారు మిత్రద్వయం.

"హలో! ఏంటి మాట్లాడరు? హలో అన్నానని అయిదు రూపాయలు అప్పుకోసం వచ్చాననుకుంటున్నారా! లేదండీ, కేవలం లోకోపకారం కోసమే ఇలా వచ్చాను. ఇక్కడ 'రాజు' అనే ఒక 'హార్టు', సీత అనే మరొక 'ఆర్టు' కోసం ప్రేమలేఖల్ని తెగ చించిపారేస్తూ, ఇప్పటికి అయిదోసారో, పదహారో సారో ఫెయిర్ చేసిన కాపీని చదువుకొంటూ నాయర్ హోటల్లో వేడివేడి ఇడ్లీల మీది ఆవిరిలాంటి 'ఉష్ణ' నిట్టూర్పులు వదులుతూ, మధ్య మధ్యలో ముసలి ఆర్టీసి బస్సులా 'తుస్సు' సౌండులు కొడుతున్న సదరు 'రాజు' అనే వ్యక్తికి 'హెల్ప్' చేయడం; వాళ్ళ ప్రేమకథని 'సెక్సెస్' చెయ్యడం అనేది లోకోపకారం చెయ్యడం లాంటిది కాదా... కదా... చెప్పండి" అన్నాడు లవకుమార్ ఆవేశంగా.

రాజు ఇంకా షాక్‌లోనే ఉన్నాడు, తన ప్రేమకథ వీడికెలా లీకయిందా అని గుర్నాథం వెంటనే తేరుకున్నాడు.

'మావాడి లవ్‌స్టోరీలో మీకెందుకంత 'ఇంట్రస్ట్' సూటిగా అడిగి పారేశాడు.

"చెప్పాను కదండీ, 'లోకోపకారం' అనే వస్తువొకటి ఉంది లోకంలో

అని. నేను ఇప్పటికే రెండు మూడు పుంజీలు మందిని తెగ ప్రేమించాను. నా ప్రేమకేసు ఒక్కటి 'సెక్సస్' కాలేదు...

"మీరు మాటిమాటికీ 'సెక్సస్' అంటున్నారు. 'సక్సెస్' అనాలి కదా!"... లవ్‌కుమార్ ఫ్లాష్‌బాక్‌కి అఅడ్డం పడ్డాడు గుర్నాథం.

"చూడండి. మనది ప్యూర్ లవ్‌స్టోరి. కథలో ఎక్కడా సెక్సప్పీల్ లేదు. మన స్టోరీని, అహఁ! మాట వరసకే అనుకోండి ఏ నిర్మాతయినా 'కాపీ' కొడితే 'సెక్సప్పీల్' బొత్తిగా లేదని వదిలేస్తాడు. అందుకని ఆమాట వాడాను. బైదబై నా కేసు ఒక్కటి 'సెక్సస్' కాకపోయినా ఇతరుల లవ్‌స్టోరీజ్‌ని డైరక్ట్ చేసి పెట్టి అర్ధ, శత, వజ్రోత్సవాలు చేయించిన ఘనచరిత్ర నాకుంది. కాబట్టి మీ ప్రేమకథని నా చేతుల్లో పెడితే నిండా నూరేళ్ళాడించే బాధ్యత నాది. చిత్తం. మరి పెళ్ళంటే నూరేళ్ళ పంట కదండీ, అందుకని అలా ఆ మాట వాడానన్న మాట.

సీతతో పెళ్ళి, అనేసరికి రాజుకెక్కడ లేని హుషారొచ్చింది. గుర్నాధానికి ఓ డౌటు వచ్చింది. "మీ కథని మీరే డైరక్ట్ చేసుకోలేని వాళ్ళు ఇతరుల కథల్ని విజయపథంలో నడిపించి పదో, పదహారో మెట్లు ఎలా ఎక్కించగలరు?" సూటిగా ప్రశ్నించాడు లవకుమార్‌ని.

"మీ ఫ్రాంక్నెస్ చూస్తుంటే ముచ్చటేస్తూంది. పెరటిచెట్టు వైద్యానికి పనికిరాదు అంటారు కదండీ. ఎవడి కథ వాడే అచ్చేసుకుంటే మజా ఏముంటుంది. ఎవుడి పెళ్ళి వాడే చేసుకుంటే ప్రజ్ఞేముంది? ఎవుడి తేలుమంత్రం వాడు వేపుకుంటే పని చెయ్యదు చూడండి. అలా అన్నమాట". లవకుమార్ వినయంగా జవాబిచ్చాడు.

గున్నాధానికి అతని మాట వరస చూస్తే ముచ్చటేసింది. అతని సమర్ధత మీద కొంచెం నమ్మకంలాంటిది కలిగింది. అయినా ఎందుకయినా మంచిదని "రాజు ప్రేమ విషయం మీకెలా..."

తెలుసని, అడుగుతారని, ఇప్పుడు కాకపపోయినా కాసేపయాక అయినా అడుగుతారని తెలుసు. అసలామాట కొస్తే సీతను ప్రేమించని హార్ట్ స్టూడెంట్‌గాని, హృదయాన్ని కోసి లోతుల్ని చూడని 'సైన్స్' స్టూడెంట్స్‌గాని, సీత మనసు తాలుకూ

లవ్‌లబ్‌లని లెక్కగట్టి క్రెడిట్, డెబిట్ బేరీజు వేయని కామర్స్ స్టూడెంట్స్‌గాని మన కాలేజీలో లేరు. మళ్ళీ మాటకొస్తే చుట్టుప్రక్కల కాలేజీల్లో కూడా లేరు. కాకపోతే "ఎవరి కాలేజీ బ్యూటీలను వాళ్ళే ప్రేమించుకోవలెను. మరొక కాలేజీ బ్యూటీ జోలికి వెళ్ళరాదు." అనే ఒకే ఒక అంతర్జాతీయ ఒప్పందం మీద ఎవరూ సీత జోలికి రావడం లేదు.

"అవును... ఆ ఒప్పందమే మంచిది... అన్నాడు గుర్నాధం.

అప్పటికే "కళ్ళలో పెళ్ళిపందిరి కనపడసాగె... పల్లకీ లోన ఊరేగే..." పాట డ్రీమ్‌లో పదహారోసారి పాడుకుంటున్న రాజుకి, సీతమాట వినపడి పరంలోంచి ఇహంలోకి వచ్చాడు.

సీత నాదే. ముమ్మాటికీ నాదే" అన్నాడు రాజు జనాంతికంగా.

"సీత నాదే అనుకుంటూ సోలో పాటలు పాడుకుంటూ కూర్చుంటే ఎలా? డ్యూయెట్లు పాడుకోడానిగ్గాను మన ప్రయత్నం మనం చేయాలి. కృషితో నాస్తి దుర్భిక్షమ్ అన్నారు పెద్దలు" దిశా నిర్దేశం చేసేవాడిలా పోజిచ్చాడు లవకుమార్.

"అంటే... ఆ మాటకి అర్థం ఏమిటి?" అడిగాడు రాజు.

"ఏమో, నాకూ తెలియదు. ఓ పావుగంట క్రితం సాంస్క్రిట్ క్లాస్‌వాళ్ళు అనుకుంటూంటే విన్నాను. ఇలాంటి వాటిని కొటేషన్స్ అంటారని, ఇలాంటివి అప్పుడప్పుడూ దప్పళంలో గుమ్మిడికాయ ముక్కల్లాగా, పేకాటలో జోకర్ ముక్కల్లాగా, హరికథలో పిట్టకథలాగా, పెరుగణ్ణంలో పచ్చడిలాగా, యు.యన్.వో.తో చైనావాడి వీటో కార్డులాగా వాడుకోవాలని గిరీశం గారు అంటూ ఉండేవారు."

"ఆయనెవరు?"

ఓమై గాడ్. గిరీశం గారంటే తెలియదా! ఓ గొప్ప హీరోలెండి. నెపోలియన్ ఆఫ్ ది యాంటి నాచ్చి కమ్ ప్రొవిడోలెండి. మహానుభావుడు. ఇప్పుడు నూన్‌షో వేస్తే హండ్రెడ్ డేస్ గ్యారంటీ.

"మీ సినిమా భాష నాకర్థం కావడం లేదు" రాజు కొద్దిగా ఇబ్బంది ఫీలవుతూ నసిగాడు.

"అందుకేగా మీ నథింగ్ బట్ ట్రూ లవ్‌స్టోరీ కనీసం స్క్రిప్ట్ మీద కూర్చునే

స్టేజి కూడా నోచుకోకుండా ఉంది. నా మాటలు మీకర్థం కావాలంటే ఎంతమంది రైటర్స్‌ని జమిలిగా స్టడీ చెయ్యాలో తెల్సా. నా సెల్ఫ్‌డబ్బా వదిలెయ్యండి. సీత, మీది కావాలంటే, మీ వన్‌వే ట్రాఫిక్‌క్కి ఫుల్‌స్టాప్ పెట్టి, మీ ప్రేమను సీత గుర్తించే మార్గం వెదకాలి. ప్రేమ్‌కుమార్ మరోసారి మార్గదర్శిలా పోజిచ్చాడు. రాజది గమనించలేదు. అచ్చమైన హీరోలా నవ్వాడు. నవ్వి,

"అందుకేగా కాలేజి ఎగ్గొట్టి రూంలో కూర్చొని 'లవ్‌లెటర్' వ్రాయడం ప్రాక్టీస్ చేస్తున్నాను" తన తెలివికి తనే మురిసిపోతూ అన్నాడు రాజు.

"మీ అమాయకత్వానికి పడీ పడీ నవ్వాలనిపిస్తోంది" వినయం ఉట్టిపడేలా అన్నాడు లవకుమార్.

"మీ ఉద్దేశ్యం..." అంటూ అర్థోక్తిలో ఆగిపోయాడు గుర్నాథం.

"వేరే ఏమీ లేదండీ. మార్కెట్లో రెడీమేడ్ లవ్‌లెటర్స్ కుప్పలు తెప్పలుగా దొరకుతుంటే రాస్తూ కూచుంటే టైం వేస్ట్ కాదా అని, నా ఉద్దేశ్యం." వివరించాడు లవకుమార్.

'అంటే...' అర్థం కాక అడిగాడు గుర్నాథం.

ఇప్పుడు మనమో సిన్మా పాట రాశాం అనుకోండి. ఎవ్వరికీ నచ్చదు. ఆఖరికి మనక్కూడా. అదే మార్కెట్లో దొరికే పాట. ఎన్నిసార్లు పాడుకున్నా ఎవరూ ఇబ్బంది పడరు, మనల్ని పెట్టరు. ఈరోజుల్లో మన కవిత్వం ఎవరికి కావాలండీ. మీకు తెల్సా. చలంగారని మహానుభావుడు "ప్రేమలేఖలు" అనే పుస్తకమే రాసి పారేశాడు.

"చలంగారా! ఆయనెవరు?" రాజు, గుర్నాథం ఒకేసారి అడిగారు.

మన గురువుగారులెండి. ఆయనేం రాశారన్నది మనకి మోస్టింపార్టెంట్. వినండి... గోదాట్లో ఇసుక తిన్నెల మీద పుచ్చపువ్వు లాంటి వెన్నెల్లో వెల్లకిలా పడుకొని, ప్రియురాలి హృదయం లాంటి మెత్తని ఇసుక గుప్పెట్లోంచి జారిపోతుంటే, నీవన్నావు ఆరోజు జ్ఞాపకముందా నేస్తం! ఈ ఇసుక తిన్నెల మీద పడుకుని, మనరెల్లు పొదరింటి మధ్య మనం చెప్పుకున్న గుసగుసలు... ఆకాశంలో నక్షత్రాల్ని లెక్కపెడుతూ, మబ్బుల చాటునుంచి పారిపోయే చంద్రుణ్ణి పట్టుకొని తేవాలని,

నేను నీ ఒడిలోంచి లేవబోతుంటే... చటుక్కున నా పెదాల మీద ముద్దుపెట్టి...

"కట్... కాట్" అన్నాడు గుర్నాథం.

"ఏంటండీ... గొప్ప రొమాంటిక్ సీను అలా కట్ చేశారు" కొంచెం విచారంగా అన్నాడు లవకుమార్.

"కిస్ ఆన్ లిప్స్. అదే పెదాలమీద ముద్దుకి సెన్సార్ పర్మిషన్ లేదండీ!" నవ్వాడు గుర్నాథం.

"గుడ్! అసిస్టెంట్ డైరక్టర్ అయే లక్షణాలు మీలో పుష్కలంగా ఉన్నాయి. గుర్నాథంగారూ!" లవకుమార్ మెచ్చుకోలుగా అన్నాడు.

"ఆగండి! సీత మీకు తెలుసా!... నా గురించేమైనా..." రాజు మాట పూర్తికాలేదు.

"సీత తెలుసా! సీత... వాహ్... మేను బంగారు పూత. మాట... కోయిల కూత. కాలేజీ కుర్రాళ్ళ గుండె మోత! ఆ చూపు... తీయని రంపం కోత.

ఆ ఆరాధ్య దేవత... సింపుల్‌గా ఒక చేత్తో పుస్తకాలు గుండెలకు హత్తుకుని, మరొక చేత్తో సుతారంగా పరికిణీ కుచ్చిళ్ళు అలా ఒద్దిగ్గా పట్టుకొని... ఆ బంగారు పాదాల తాలూకు వ్రేళ్ళని నేలపై ఆన్చి ఆన్చనట్టు అడుగులో అడుగు వేసుకుంటే... పరికిణీ అంచులు తడవకుండా అలా కొద్దిగా ఒద్దిగ్గా పైకెత్తి పట్టుకొని రాదారి పడవ దిగుతుంటే..."

"మరే బాతు లా..." మధ్యలో అడ్డుపడ్డాడు రాజు.

"కట్... కాట్.. ఖట్ ఖట్... ఏంటిలాంటి సీను కట్ చేయించి పారేశారు నా చేత. ఈ సీన్లో రాదా పడవ దిగే సీత హీరోయిన్... మీరు హీరో. సీత పడవ దిగుతూ మీకు చెయ్యి అందిస్తుంది. మీరా చేతిని అలా పట్టుకొని సీతని పడక దించే సీను చూసి ఆదుర్తి అదరిపోడా. బాపు పైపు త్రాగడం మర్చిపోయి హు ఈజ్ దిస్ ఫెంటాస్టిక్ టాలెంటెడ్ డైరక్టర్ కం హీరో అని ఆలోచించడా... వెరీ శాడ్..."

రాజు పశ్చాత్తాపడ్డాడు. అడ్డెడ్డే సీత చెయ్యి పట్టుకొనే ఛాన్స్ మిస్

అయిందే" అనుకొన్నాడు. మరుక్షణంలో...

"సారీ అండీ... ఇందాక బాతు అన్నా. బాతు కాదండీ... ఏదో పిట్ట పేరు మర్చిపోయా" అన్నాడు ఎంతో బాధగా.

"వదిలెయ్యండి. మీలాంటి యంగ్ డైనమిక్ హీరో ఇలా కాలేజెగ్గొట్టి లవకుశ సిన్మాలో ఎన్టీఆర్ లెవెల్లో అంత:పురం కిటికీలు, స్థంభాలూ పీకుతూ లేదా ప్రేమ్‌నగర్ సిన్మాలో ఎఎన్నార్‌లా మాసిన గెడ్డం, ఖరీదైన శాలువా, విషం సీసాలు, విషాద గీతాలతో కాలక్షేపం చేస్తుంటే అక్కడ సీత ఏమైపోతుంది? చెప్పండి... రాజా.,.. చెప్పండి..."

"ఏమైపోతుంది?" రాజు మొహంలో ఆందోళన స్పష్టంగా కనిపించింది.

"ఏమీ కీదు. చక్కగా డిగ్రీ చదువుకొని, ఆనక రెండు గోల్డ్ మెడల్స్ మంగళసూత్రాలు మోడల్ చేయించుకుని మరికొద్ది రోజుల్లో చంకలో చిన్ని బాబుతో వచ్చి, రాజంకుల్‌కి టాటా చెప్పమ్మా అంటుంది" రాజుకి భయంకరమైన ఫ్యూచర్ సీన్ కనపడిందా క్షణంలో.

గుర్నాధానికి 'తథాస్తు' అనాలనిపించింది. కాని ఇద్దరూ కలిసి తన్తారని ఆ ప్రయత్నం వాయిదా వేసుకున్నాడు.

"మరప్పుడు నా దారి?" వాట్ టు డు? షేక్స్పియర్ పడ్డ అవస్థలో పడ్డాడు రాజు.

"కిం కర్తవ్యమ్!" అన్నాడు గుర్నాధం ఎక్కడో విన్న సాంస్క్రిట్ ముక్క గుర్తుకొచ్చి.

"అలా అడిగారు బావుంది. ఇప్పుడు దారిలోకి వచ్చారు. కనుక మిస్టర్ రాజు మీరిప్పుడర్జంటుగా సెవనో క్లాక్ బ్లేడ్‌తో గెడ్డం గీసుకుని..."

"ఇప్పుడు లెవనో క్లాక్ కదా టైం" అన్నాడు రాజు.

"నో ప్రాబ్లెం. అవసరమైతే 'టైం' ఛేం చేద్దాం. ఇహ నుంచి మీరు 'ట్రిం'గా తయారయి రోజుకి రెండు మూడుసార్లు అవసరాన్ని బట్టి నాల్గు లేక అయిదు ఆరు సార్లు సీతకి కనపడే ప్రయత్నం చేయాలి."

"చేశాక..."

"మీరొక పేద్ధ రచయితగా సీత దృష్టిలో మీ ఇమేజ్ పెంచుకోవాలి."

"వ్వాట్! రచయితగానే, నాకు కథలూ గట్రా రాయడం రాదే..." గాభరాగా అన్నాడు రాజు.

"అదే మీకున్న ఏకైక ఎస్సెట్." అన్నాడు లవకుమార్ నవ్వుతూ. వెంఠనే,

"నేనొక ప్రముఖ నాటిక, నాటక, కథ, నవలా, కవితా రచయితను లెండి. ఇంకా ఈ విషయం ఎవరికీ తెలియదు. నా కవితలన్నీ మీ పేరుతో రాస్తాను. సీత అవి చదివీ... ఎలా ఉందయిడియా..."

"వండర్‌ఫుల్. అయితే నాకింకో ఎక్సలంటయిడియా తట్టింది." అన్నాడు రాజు ఆనందంగా.

గుర్నాధం ఇద్దరి వంకా అయోమయంగా చూశాడు. ఏమనాలో తెలియక.

"ఏమిటో అది..." అన్నాడు లవకుమార్ కాస్త నిరుత్సాహంగా.

"సీతకి క్రికెట్ ఆటంటే చచ్చేంత ఇష్టంట. క్రికెట్ నేర్చుకొని ఆరు సిక్సర్లు, నాల్గు ఫోర్లు కొట్టి పుంజీడు కేచ్‌లు పడితే... రాజా! హాయ్... రేపు మరే... మరే... ఇంగ్లండు టూర్‌కెళ్ళేటప్పుడు నన్ను కూడా తీసికెళ్ళవూ... ప్లీజ్ అంటుంది..." అన్నాడు రాజు ఆనందపడిపోతూ.

"ప్రతాప్... రాణాప్రతాప్ పేరిన్నారా?" విలన్ పోజెట్టి అడిగాడు లవకుమార్.

"రాణాప్రతాప్ కాదు, రాణా... రాణా ప్రతాప్. మన కాలేజి క్రికెట్ టీం కెప్టెన్ కదా" వెంఠనే అన్నాడు గుర్నాధం.

"యస్. ఎగ్జాట్లీ. ఎంపిసీ, బి సెక్షన్ సుబ్బారావు, సీతను ప్రేమిస్తున్నాడని తెలిసి ఒళ్ళు మండి ఓ సిక్సర్ కొట్టాడు. ఆ బాల్ సూటిగా వెళ్ళి గాలరీలో కూర్చుని మేచ్ చేస్తున్న సుబ్బారావు బ్రెయిన్లో ఇరుక్కుపోయింది. అంతేకాదు సుబ్బారావు తలకి పెద్ద గాయమయింది."

"అవున్ట. సీత కూడా గాయపడిందట" అన్నాడు గుర్నాధం.

"సుబ్బారావుకి దెబ్బ తగిల్తే సీతకి ఎందుకు గాయమయింది?" అర్ధం కానట్టు మొహం పెట్టాడు రాజు.

"బాల్ పాడైపోయి మేచ్ ఆగిపోయినందుకు. తర్వాత సీత ప్రతాప్‌కి షేక్‌హేండిచ్చి మరీ కంగ్రాట్స్ చెప్పి, సుబ్బారావు కండొలెన్సు మీటింగ్‌కి ఆరుగంటలాలస్యంగా వెళ్ళింది." చిరునవ్వు నవ్వాడు లవకుమార్.

"పాపం! సుబ్బారావు. సీత అంత లేటుగా ఎందుకెళ్ళింది?" ప్రశ్నించాడు గుర్నాధం.

"ఆణా ప్రతాప్‌దే మరో ఫ్రెండ్లీ మాచ్ చూడ్డానికెళ్ళి వచ్చేసరికి ఆలస్యం అయిపోయింది." విచారంగా మొహం పెట్టి అన్నాడు లవకుమార్.

"అయితే మీ అయిడియానే బ్రెస్ట్ లా ఉంది" అన్నాడు రాజు ఆనందంగా.

"బ్రెస్టా!" నోరు తెరిచాడు లవకుమార్?

"కథలో సెక్సప్పీల్ కోసం అలా వాడాలని మీరే కదా చెప్పారు!" ఏం తప్పా అన్నట్టు చూశాడు రాజు, లవకుమార్ వంక.

"మీరు ముందుగానే సినిమా స్టోరీల లెవెల్లో మొదలు పెట్టరాదు. నేను మీ ప్రేమకథకు స్క్రీన్‌ప్లే గట్రా రాసుకుని ఆనక షూటింగ్ మొదలుపెట్టాక మీకూ కొంత అనుభవం వస్తుంది కదా! అప్పుడు రాద్దురు గాని." లవకుమార్ జ్ఞానబోధ చేశాడు.

"అంతా బాగానే ఉంది గాని కథలో విలనేడి?" అడిగాడు గుర్నాధం.

"నువ్వుండగా ఇంకా విలన్ దేనికి?" జోక్ చేశాడు రాజు.

"హీరో గార్కి సెన్సాఫ్ హ్యూమర్ చాలా ఉందే!" హోరున హాశ్చర్యపోయాడు లవకుమార్; ఆశ్చర్యపోయి మళ్ళీ తనే అందుకున్నాడు.

"గోదాట్లో ప్రేమ పడవలాగా హాయిగా నెమ్మదిగా సాగే ప్రేమకథలో మధ్యలో విలనెందుకు? పానకంలో పుడక లాగ" వెక్కిరింపుగా అన్నాడు లవకుమార్.

గుర్నాధానికి కొంచెం కోపం లాంటిదొచ్చింది.

"లవకుమార్‌గారూ, ఉప్పులేని పప్పు, కాఫీలేని కప్పు, అప్పు లేని జీవితం, తప్పు చేసిన మనిషి, నిప్పులేని పొగ, డప్పులేని మేళం, చెప్పులేని కాలు, తుప్పు పట్టిన ఇనుం, విలన్ లేని కథ రాణించవు అన్నారు పెద్దలు."

"అన్నా సరే! నా స్క్రిప్టులో విలన్ లేదు" అన్నాడు లవకుమార్ మొండిగా.

"మన స్క్రిప్ట్‌లో ఉన్నాడు, వినండి..." అన్నాడు గుర్నాధం గంభీరంగా మొహంపెట్టి.

"చెప్పు చెప్పు..." అంటూ రాజు ఉత్సాహపరిచాడు గుర్నాధాన్ని.

"నీ ప్రేమకథ హిట్టయిపోయి నిండా నూర్రోజుల లేదా నూరేళ్ళ పండగ చేసుకోవటం ఇష్టంలేని మిరియాల్రావ్ డైరక్టర్‌గా నిన్నెదిరించలేక 'కాద్రా'ని ఆశ్రయించాడు.

"కాద్రా, పేరేదో తమాషాగా ఉందే..." అన్నాడు రాజు.

"ష్! కాద్రా అంటే తమాషా కాదు. బస్తర్ జిల్లాలో పేరుమోసిన మంత్రగాడు. కాద్రా మంత్రం వేశాడంటే అడవిలో పిట్టలు నీళ్ళు త్రాగవు. లేళ్ళు, పులులు, సింహాలు... ఎక్సెట్రా ఎక్సెట్రా... డిటో. పాములు బుసలు కొట్టవు. చెట్లు గాలి పీల్చవు. దెయ్యాలు చందమామలో బొమ్మల్లాగా రెండు చేతులూ కట్టుకొని తోకలు పైకి లేపుకొని, గుండు మీది పిలక పైకెగేసుకొని అతని ఆజ్ఞ కోసం ఎదురు చూస్తుంటాయి. బెదురు కళ్ళతో ఎక్క తమను చంపేస్తాడో అన్న భయంతో... దెయ్యం చావడమంటే మనిషిగా పుట్టడం. మనిషై పుట్టి నానా చావు చావడం కంటె దెయ్యంగా బ్రతకడమే మేలు. హాయిగా చచ్చిన కం బ్రతికున్న మనుషుల్ని పీక్కు తినచ్చు. ఈ విషయం దెయ్యాలకి బాగా తెలుసు. తెలియక బ్రతికేస్తున్న రోజుల్లో కాద్రా వాటికా విషయం, విషంలా నూరిపోశాడు. ఇంక అవి ఎవ్వరి మాటా వినవు... కాద్రా చెప్పినా సరే.

నక్కలు శ్మశానంలో ఊళకూత మానేసి కుక్కిన పేనుల్లా పడి ఉన్నాయి. కాద్రా అడుగుల చప్పుడు అవి పసికట్టాయి.

ఆదివారం... శ్మశానానికి శలవు లేదు. అర్ధరాత్రి... అయినా నైట్ షిఫ్ట్ పన్చేస్తూంది. అమావాస్య... మృత్యువుకు తిధిలతో పనేముంది. అక్కడ 'శవం' తన అతిథిగా ఎదురు చూస్తుంది. అవును. వెళ్ళాలి, తను వెళ్ళాలి. కాద్రా నడకలో వేగం పెరిగింది. అడుగులు గబగబా పడుతున్నాయి.

ఆకాశం వికృతంగా అరిచింది. ఎక్కడో పిడుగుపడింది అనుకున్నాడు కాద్రా. గ్రహచారం చాలకపోతే... సామెత గుర్తు కొచ్చింది. అయినా కాద్రాకి

నవ్వు రాలేదు. టప... టప...తప...తాఫా... చినుకులు పడ్డం మొదలు పెట్టాయి. కాద్రా కళ్ళెరుపెక్కాయి. ఎవరో... ఎక్కడో... తన మంత్రానికి విరుగుడు మొదలుపెట్టి ఉంటారు. ఈ ఊహ రాగానే...

అతని ఆవేశం కట్టలు త్రెంచుకొని ఆక్రోశంగా మారింది.

ఆ ఆక్రోశం, ఉక్రోషం అయిన క్షణంలో...

కాద్రా కుడి చేతి పిడికిలి బిగుసుకొని నరాలు జివ్వున పొంగాయి. జంతికలు నలిపినట్టు చేతివ్రేళ్ళు పటపటమన్నాయి. కుడిచేతిలోని ఎముకతో ఎడం చేతిలోని పుర్రె చుట్టూ అప్రదక్షిణంగా మూడుసార్లు తిప్పి గారిగా ఓ మొట్టి(ట్టి)కాయ లాంటిది పుర్రెనడినెత్తిన ఇచ్చాడు. దెబ్బకు దెయ్యం దడిసింది. పుర్రె నోరు తెరచి పళ్ళికిలించింది... బాధతో... కాద్రా దాని నోట్లో నిమ్మకాయ కూరాడు. అప్పుడది నవ్వింది. అచ్చం... హ హ... దెయ్యం నవ్వినట్లే.

ఆ నవ్వు స్మశానంలో రీసౌండిచ్చింది.

ఆకాశం ఏడుపు ఆపింది; అంటే! వాన ఆగింది."

"ఇంక నువ్వాపరా బాబూ..." రాజు గట్టిగా అరిచాడు పిడికిళ్ళు బిగబెట్టి.

లవకుమార్ గదిలో ఓ మూల గజగజా వణుకుతున్నాడు భయంతో... పిచ్చిచూపులు చూస్తూ...

"ఒరే! గుర్నాథం... ఏంటా సీను... ఏంట్రా ఆ కథ చెప్పడం. శుభమా అని ఏదో పెళ్ళి సినిమా తీసుకుందామంటే ఓ ఇలన్నెట్టి ఆడి చేత నాకు చేతబడి చేయించి, సీతని నువ్వు లవ్వాడేద్దామనే. ఫో! రా! నా రూమ్‌లోంచి బయటికి" ఫో! రా! ఆవేశపడ్డాడు రాజు. రూమ్‌లో కూజాలోని నీళ్ళు గ్లాసులో పోసి లవకుమార్ మొహంమీద కొట్టాడు. లవకుమార్ తేరుకున్నాడు.

"చూడండా రాజుగారు. నేనే గొప్ప అనుకుంటే నా కన్న గొప్ప స్క్రీన్‌ప్లే రాసేవాళ్ళున్నారన్న సంగతి నాకిప్పుడే తెలిసింది. అడక్కుండా ఎవ్వరికీ స్టోరీలు చెప్పకూడదు. ఈ అనుభవం చాలు. ఓ సిగరెట్ ఇవ్వండి. ప్లీజ్. కాల్చుకుంటూ వెళ్ళిపోతా!"

రాజు సిగరెట్ పేకెట్ లవకుమార్ చేతిలో పెట్టాడు.

లవకుమార్ సిగరెట్ అంటించుకొని భారంగా అడుగులు వేసుకొంటూ వెళ్ళిపోయాడు.

సిగరెట్ పొగ అతని వెనకాలే వెళ్ళింది, మొనగాళ్ళకు మొనగాడు సిన్మాలో బాలయ్య వెనకాలే వెళ్ళినట్టు గుర్నాథం గదిలోకి వచ్చాడు.

"యూ... ఇడియట్ మళ్ళీ" అంటూ తిట్టబోయాడు రాజు, గుర్నాథాన్ని.

"నువ్వేగా... ఫో... రా!" అన్నావు. పోయాను, వచ్చాను" అన్నాడు అమాయకంగా మొహం పెట్టి గుర్నాథం.

రాజు ఫక్కున నవ్వేశాడు.

"నవ్వేజనా సుఖినో భవంతు" ఇదెక్కడో విన్నట్టుంది కదూ! లేదా కాపీ (ఫ్రీ). ❁



# గిరీశానికి ప్రేమలేఖలు

గురజాడ అప్పారావు పంతులుగారి సుప్రసిద్ధ నాటకం 'కన్యాశుల్కం' ఎవర్‌గ్రీన్. ఆ నాటకంలోని పాత్ర 'గిరీశం' అజరామరం. అంతే గొప్పది మధురవాణి, పూటకూళ్ళమ్మ, బుచ్చెమ్మ పాత్రలు. ఆరోజుల్లో ఈ ముగ్గురూ గిరీశానికి ప్రేమలేఖలు వ్రాస్తే ఎలా ఉంటుందన్న ఊహకి ఈ రచన పేరడీ.

**మధురవాణి ప్రేమలేఖ**

గిరీశం గార్కి:

కుశలం. మీరు కుశలమా!

నేను సానిదాన్నయినా నాకూ ఓ మనసుంటుందని ఎవరూ గమనించరు గదా! నా మనసు నిండా అచ్చు దొరలాగా ఇంగ్లీషు మాట్లాడుతూ హుందాగా, ఠీవిగా, సోగ్గా నిలబడి, నన్ను ఓరకంట చూస్తూ, బొటన వ్రేలూ చూపుడు వ్రేలూ కలిపి, మధ్యలో మీరంటుంటారే దొరలు కాల్చే చుట్టని 'సిగార్' అంటారని దాన్ని నొక్కి పట్టి కొడిగట్టిన ఆ చుట్ట నుసిని మీ చిటికెన వ్రేలితో అలవోకగా రాలుస్తూ, సుతారంగా మీ నోటపెట్టి ఒక్క దమ్ములాగి ఎంతో మనోహరంగా మీ భాషలో రొమాంటిక్‌గా నా మొహం మీదికి ఊదుతారే...

నేను ఛిఛీ... అని ఊరికే అలా అంటానే గాని ఆ వాసన ఎంతో మత్తుగా గమ్మత్తుగా ఉంటుదనుకొన్నారు. మీరూ నేనూ కలిసి మనూరి ఫుటోగరాఫ్ పంతులు దగ్గర తీయించుకొన్న ఫుటో ఎదురుగా పెట్టుకొని డాన్సు చెయ్యాలని నా కోరిక. ఎప్పటికి తీరుతుందో కదా ప్చ్!

నన్ను మద్రాసు తీసికెళ్ళి సినిమాల్లో చేర్పించి వేషాలూ గట్రా వేయిస్తానని ఏమిటండీ అదీ... ఆ... మెరీనా బీచ్‌లో మెల్రీగా పాటలు కూడా పాడుకుందామని ఎన్ని కబుర్లు చెప్పారు? నేను నాలుగింగ్లిషు ముక్కలు మాట్టాడం మీ చలవే కదా!

అయినా నా పిచ్చిగాని ఆ పూటకూళ్ళమ్మ నొదిలి మీరెందుకొస్తార్లెండి. దాన్ని మీరుంచుకోటం కాదట, అదే మిమ్మల్నుంచుకొని కాసిని గంజినీళ్ళు

పోస్తోందిటగా! ఎవరు చెబితే ఏమిలెండి? రామ... రామ. ఘటికులే మీరు. రామప్పపంతులు చెప్పాడని నే చెప్పకుండానే కనిపెట్టేశారే... ఆశ్చర్యం!

అవునూ, పూటకూళ్ళమ్మ కివ్వాల్సిన డబ్బులివ్వలేదని, చీపురు కట్టుచ్చుకొని కొట్టడానికొస్తే మీరు భయపడి నాయింట్లో మంచం క్రింద దూరి దాక్కున్న రామప్ప పంతుల్ని ముందుకి తోసి, ఆ మంచం క్రింద మహానుభావుడితో, మిమ్మల్నడిగితే నాలాంటి మేశ్యల్ని వందమందిని కన్యాదానం చేసేవాణ్ణన్నార్ట. వేశ్యల్ని కూడా 'కన్యాదానం' చెయ్యగల సమర్ధులే మీరు.

మీ దగ్గర నేర్చుకొన్న ఇంగ్లీషు ముక్కల్తో నాకు గొప్ప గౌరవం పెరిగాయిస్మండీ.

అయినా నాలాంటి దాన్నుంచుకుంటే మీకు గొప్ప, గౌరవం రాని ఆ పూటకూళ్ళమ్మ నుంచుకొంటే అవ్వ! అప్రతిష్ట కాదూ. ఎవ్వరెన్ని చెప్పినా నేను నమ్మను గాక నమ్మను.

పోలిశెట్టొచ్చి చెవిలో ఊదినా గిరీశం గారలాంటివారు కాదని తెగేసి చెప్పి మళ్ళీ ఇలాంటి అవాకులూ చెవాకులూ పేల్తే గుమ్మం ఎక్కొద్దని చెప్పానంటే నమ్మండి.

ఏమిటీ, వెంకటేశానికి ప్రవేటు చెప్పే వంకెట్టుకుని అగ్నిహోత్రావధాన్లు గారింట్లో చేరి ఆయన కూతురు బుచ్చెమ్మని విధవరాలయినా ఓ కంట కనిపెట్టుకుంటున్నార్ట. ఇవన్నీ నాకెలా తెలుస్తున్నాయని మీ సందేహమా!

లోకులు కాకులు కదండీ. లోకం కోడై కూసినా, కాకిలా అరచినా కుక్కలా మొరిగినా నేను నమ్మనుగాక నమ్మను.

ఈ మధురం మాటంటే మాటే. ఈ మాట మాసానివాడలో ఎవర్నడిగినా చెబుతారు. అయినా మీకు మాత్రం తెలియదా ఏమిటి? ఒక్కసారి ఎవరికైనా మనసిచ్చినంటే తీసుకోనుగాక తీసుకోను. ఇదేమన్నా చేబదులా! ఇచ్చి పుచ్చుకోడానికి! మనసు. సానిదాన్ననే కదా నలుగురికీ చులకన.

మీకో సలహా! అయినా మీకు సలహా చెప్పే సాటిదాన్ని కాకపోయినా చెప్పక తప్పదు కదా! నా మనిషి కేమయినా అయితే గియితే తట్టుకోలేక

స్మండీ.బుచ్చెమ్మగారు మహాపతివ్రత కోవకి చెందిన మనిషట. ఆమాటకొస్తే మేం మాత్రం కామా ఏమిటి? దేహశుద్ధి లాంటిది జరక్కుండా మీరు క్షేమంగా ఉండాలని వెయ్యి దేముళ్ళకు మొక్కుకున్నా.

మనం మద్రాసెళ్ళి పెళ్ళి చేసుకుందామని చెప్పారు గుర్తుందా. ఇందులో కొన్ని విషయాలు మనం మాట్లాడుకున్నవి ఎవరికీ తెలియవు. ఆఖరికి అప్పారావు పంతులుగార్కి కూడా. మరి మీరొచ్చి మన మద్రాసు ప్రయాణం ఏర్పాట్లు చూసే సుముహూర్తం కోసం ఎదురు చూస్తున్నా!

ఇట్లు
మీ
మధురాతి మధురం
**మధురవాణి.**

**పూటకూళ్ళమ్మ:**

గిరీశానికి,

ఇదిగో నువ్వు గిరీశానివె పరమేశానివో నాకనవసరం.

సంతలో సామాను కొంటానని పట్టికెళ్ళిన పాతిక రూపాయలు నువ్వు డాన్సులాడే పిల్లకి పందారం చేశావని నాకు తెల్సు. ఇలా చాలాసార్లు చేశావు గుర్తుందా. నేనేమైనా ఎప్పుడయినా అన్నానా.

అయినా నీకు డబ్బివ్వాలనిపిస్తే ఏదో వంకపెట్టి అలా ఇస్తానంతే. నీకు మాత్రం సరదాలుండవా ఏమిటి? డబ్బులు పోతే పోయాయిగాని సాయంకాళం పెంద్రాళే ఒటేలుకొచ్చెయి. నీకిష్టమైన కందిపప్పు పచ్చడి చేసి వేడి వేడి చారు తిరగమోతపెట్టి ఉంచా. మిరియాల చారే. జలుబు చేసిందన్నావుగా! అందుకే.

అయ్యో! నా మతిమండా. అసలు విసయమే చెప్పలేదు కదూ! నేను చీపురుకట్ట తిరగేస్తానని భయపడి సందులమ్మట గొందులమ్మట తిరిగేవు. సానివాడలో అందరి కళ్ళూ నీమీదేనటగా. ఎవరు చెబితే ఏమ్లే.

కరకటకో కరటకో ఏదో ఒకట్లే శాస్తుల్లింట్లో ఇబ్బందొచ్చి అతగాడి చెయ్యి కాలిందట. ఇంక మళ్ళీ చెయ్యి కాల్చుకోలేక మన ఒటేల్లో విస్తరేసుకుంటానంటే, అదేమంత భాగ్గెం అలాక్కానియ్యన్నానూ. అన్నానా...

వచ్చినవాడు వచ్చినట్టుండక, పెట్టిందేదో తినిపోక నిన్ను సాపివాడలో మధరమో, మందారమో దానింటో చూశానని కూశాడు. నాకు తిక్కరేగి నీకక్కడేం పనని నాలుగూ కడిగిపారేసి గరిట తిరగేసేసరికి అదే పోతపోయాడు, పంచెగ్గట్టి పిలక ఝూడించుకొంటూ.

అయినా ఆసాన్దిగ్గర మాత్రం ఏముంది. నువ్వే ఓ సారన్నావు గుర్తుందా. దానివన్నీ కపట వేషాలనీ నేను కల్లాకపటం ఎరగని మనిషినని, అది వఠి గాజుపూసని నేనో మేలిమి బంగారమని. నా దగ్గరంటే అన్నావుగాని అందరి దగ్గరా అనేవు నిన్ను బుట్టలో వేసేస్తారు జాగ్రత్త.

అదెప్పుడు జైసినా జేబులో ఉన్న పదో పరకో పడేసి పుచ్చుకుంటుందేకాని ఓపూట విస్తరేసి భోజనం పెట్టిన పాపన పోయిందా! భోజనమంటే జ్ఞాపకమొచ్చింది నీకిష్టమని ముంతనిండా గడ్డ పెరుగు దాచిఉంచా. మిగతా వాళ్ళకి మజ్జిగనీళ్ళు పోశాన్లే.

ఇదిగో ఆ సాన్దాన్తో కల్సి మద్రాసు ఉడాయిద్దామని ముహుర్తమెట్టావంటగా. వెళ్ళండెళ్ళండి. నీకూ దానికీ కూటూ, సాంబారు నీళ్ళు సాపాటే గది. పొద్దుటే గోంగూర పచ్చడి మీగడ పెరగేసుకుని ఎన్నిసార్లు పీక మొయ్యా మెక్కావుకాదు. దద్ధోజనం లొట్టలేసుకుంటూ తిన్లా. ఇదిగో నామాటని వెర్రిమొర్రి వేషాలు వేయక హాయిగా నా దగ్గరే ఉండిపో. నీకంతగా పట్నం మీద మోజుంటే ఇద్దరం కలిసి ఏ విశాకపట్నమో వెళ్ళి ఈ పూటకూళ్ళేవో అక్కడే పెట్టుకుందాం ఏమంటావ్.

వెంకటేశానికి ప్రవేటని వంకెట్టి ఆళ్ళింట్లో తిష్టేశావటగా. నువ్వు చదువులేమిటో నాకు తెలియవా ఏమిటి? ఆ పిల్లాడికి చుట్టముక్కలు కాల్చడం తప్ప నువ్వు నేర్పేదేముండి చచ్చిందిగన్క. ఇదిగో బుచ్చెమోరి అమాయకురాలు. లవ్వు గివ్వు దానికేం తెలియవు. లవ్వు సిగ్గనల్లు బొత్తిగా రావు పాపం. అయినా నువ్వు జేరావుగా మాబాగానే నేర్పుతావులే. నాకు నేర్పలా! అలా!!

రామరామ లవ్వు సిగ్గనల్లా. నీకు తెలియదా! నా చేత చెప్పిద్దామనేగా నీ ఎత్తు. నేను అన్నం వడ్డిస్తుంటే చెయ్యి తాకటం, కూరలు తరుక్కుంటుంటే చెయ్యి పట్టుకొని ఆపి వొఖదానివీ ఏం తరుక్కుంటా వొదినా, నే సాయం సేస్తానని చెయ్యందించి నన్ను కత్తిపీట మీంచి లేపటం, సానులు రుద్దుకొనే సబ్బులు, పూసుకునే పుగడర్లు తెచ్చివ్వటం ఇవేగా. నేను పెద్దగా సతక్కపోయినా ఉత్తరం ముక్క రాసే సతుకేదో సతికాలే.

నిన్న నువ్వింకా రాలేదేమిటి చెప్మా అనుకొంటూ ఆలోచిస్తూ వేడివేడి చారు ఎవడి చేతిమీదో పోసా. వాడు ముం...రం... అంటూ ఒకటే తిట్లు. అయినా నాకు వినిపిస్తేగా. మనసంతా నీమీదే... చూపంతా గుమ్మం మీదే. నువ్వు రాకపోతే నువ్విచ్చిన సబ్బుబిళ్ళ బెంగెట్టుకుంటుంది.

పెందరాళే గూటికి చేరు.

ఇట్లు

అమ్మో! పేరు రాస్తే ఇంకేమైనా ఉందా.

## బుచ్చెమ్మ:

మహారాజశ్రీ గౌరవనీయులైన గిరీశం గార్కి,

మీరు చాలా గొప్పవారని, హైద్రాబాద్‌లో నవాబుగారు ఉద్యోగమిస్తానంటే వద్దు పొమ్మన్నారని, డిప్పేటీ కలటేరుగారు ఎంత బ్రతిబాలినా, తాక్ తెల్లవాడి దగ్గర ఉజ్జోగమేంటని జెప్పి, మా తమ్ముడు చి॥ వెంకటేశానికి ప్రవేటు చెప్పి వాణ్ణి ఆయనెవరో బెంగాలీ బాబంత గొప్పవాణ్ణి చేసే పని మీద మా వూరొచ్చి అందునా మాయింట బసచేయడమంటే అంతా లోకోపకారం కోసమేనటగా! ఏమో నాకేం తెల్సు మా తమ్ముడు అంటే విన్నాను.

అసలు లోకోపకారం అంటే ఏమిటండీ? నేను పెరట్లో నూతి దగ్గర నీళ్ళు తోడుతుంటే చేతిలో చేద లాక్కుని చెయ్యి తగిలించడం, నా మీద జాలికొద్దీ నీళ్ళు తోడిపెట్టటం, మా తమ్ముడికి కాస్త చదువు చెప్పటం, మా నాన్నకి కచేరీ కాయితాలు తర్జుమా చేసి పెట్టడం, ఇవాండి లోకోపకారాలు.

మా చెల్లెలు సుబ్బిని అగ్రహారంలో ఎవరో లుబ్దావధాన్లుట పరమ పిసినిగొట్టు లోభి, ముసలాడూన్ట, వాడికిచ్చి చెయ్యడానికి మా నాన్న మహారాజశ్రీ నులక అగ్నిహోత్రావధాన్లు గారు, తాంబూలాలిచ్చేశా తన్నుకు చావండన్నప్పుడే పెరటి నూతిలో దూకి చావాలనిపించింది. మీరున్నారు కదా, ఏదైనా చక్రం అడ్డు వెయ్యకపోతారా! అనే ఆశతో ఉన్నాను.

మా అమ్మని మీరు నూతిలో దూకి కాపాడ్డం చూసి ఊరు ఊరంతా మీరు గొప్ప సత్యసంధులని అనుకుంటున్నారు. చ పూజా పునస్కారెల్లేక అలా ఉన్నారుగాని నిజానికి కారా ఏమిషి?

మా సుబ్బికి కాటికి కాళ్ళు చాచుకూచున్న ఆ అగ్గురారం ముసలాడితే పెళ్ళి కాకుండా ఆపితే చచ్చి మీ కడుపునుడతా. నేను పడుతున్న బాధలు చాలవా! మా నాన్న చెల్లి గొంతు కోస్తుంటే మీలాంటి లోకోపకారులు చూస్తూ ఊరుకుంటారా చెప్పండి.

నేను జుత్తుకి కాస్త కొబ్బరి నూనె రాసుకుని, తల్లో మల్లెలెట్టుకుని, ముఖానర కాసంత బొట్టు పెట్టుకుంటే అచ్చు వనలక్ష్మిలా ఉంటానని తమ్ముడితో అన్నార్ట. జాగ్రత్త సుమండీ. వాడసలే కోలివెధవ. ఈమాట ఆ నోటా ఈ నోటా బడి మా నాన్న విన్నాడంటే మీ ఆబోరు నా ఆబోరు కూడా దక్కదు.

నాకు మాత్రం అలాంటాశలు ఉండవుటండీ. తలలు బోడులైన తలపులు బోడులూ అన్నారు వేమన్న. ఏమిటి నవ్వుతున్నారు! ఏం మేం చెప్పకూడదా! మీరంటుంటారే, అవే కొటేషన్లు.

మీరన్నట్టు నాకు ఎన్ని ఆశలున్నా, ఎన్ని కోరికలున్నా అవన్ని అడవి కాసిన వెన్నెలే కదా!

అందుకనే మా చెల్లి సుబ్బి జీవితం కూడా నాలా చట్టుబండలు కాకూడదనే రాజమండ్రంలో విధవా కల్యాణ మంటపంలో మనం పెళ్ళి చేసుకుందామంటే ఒప్పుకున్నా.

తమరు ఎలాగైనా చక్రం తిప్పి మా చెల్లి పెళ్ళి జరక్కుండా ఆపారో అంతకన్న ఆనందించదగ్గ విషయం మరోటుండదు. ఏం చేస్తారో ఎలా చేస్తారో

అంతా మీ చేతుల్లో ఉంది. అందరూ పెళ్ళి హడావిడిలో ఉన్నారు. మా నేస్తం అదే మీ కిస్టమయితే మిమ్మల్ని చేసుకుంటానందే... ఆc...ఆ అమ్మాయే ఈ ఉత్తరం వ్రాసి పెట్టింది.

ఆc. ఉంటా... ఎవరో వస్తున్నట్టలికిడి అవుతోంది...

ఉంటా...

ఇట్లు
మీ కాబోయే చరణదాసి.



# ఉత్తరాయణం

**అను**

**(ఉత్తుత్తరాభతం)**

(ఆడువారి మాటలకు అర్థాలే వేరులే! అన్న మాటకు నిజమే నాండీ? అన్న సందేహానికి కొందరు ప్రముఖుల సమాధానాల్ని 'పేరడీ' చేస్తే... అన్న ఊహకు ఈ రూపకల్పన.)

మాలతీ చందూర్‌గారు:

1. వి. వసుంధర

ప్ర॥ మాలతీ చందూర్ గారూ,

"ఆడువారి మాటలకూ అర్థాలు వేరులే! అంటారు నిజమేనాండీ!" - గృహిణి, తెనాలి.

జ॥ అడగండీ చెబుతానంటే అడక్కపోతే చెప్పనని కాదర్థం. అడిగినా అడక్కపోయినా చెబుతాననే! అసలు అర్థం అనే మాటకి అనేక అర్థాలున్నాయి. ఈ మాటకి 'అర్థం' అనే 'అర్థం' కాక 'డబ్బు' అనే అర్థం ఒకటుంది. దీనికోసం అనేక అనర్థాలు జరిగాయి. జరుగుతున్నాయి. ఇప్పుడే ప్రపంచమంతా ఈ 'డబ్బు' అనే అర్థం చుట్టూ తిరుగుతూంది.

అయితే ఈ సంగతి అర్థం కాక ప్రపంచంలోని ఆర్థిక రంగం నిపుణులంతా (ఈ మాట కూడా అర్థం లోంచి వచ్చిందే). తలలు పట్టుక్కూర్చున్నారు. అర్థంతరంగా (చూశారా దీనర్థం వేరు) కుదేలయిన ఆర్థిక రంగాన్ని ఎలా ఒడ్డున పడెయ్యాలా అని సతమతమవుతున్నారు.

అటు మొన్న రష్యా, మొన్నమరికా, నిన్న దుబాయి, ఈరోజు చైనా... రేపు? థౌజండ్ డాలర్స్ క్వచ్చన్; గట్టిగా మాట్లాడితే టెన్ మిలియన్ డాలర్స్ కొచ్చన్.

ఆడువారి మాటలకూ అర్థాలూ వేరులే! అని ఆ సినీకవి రాయడంలెనే ఎంత అర్థం ఉంది. ఇక్కడ డబ్బని కాదు. అసలు ఆడువారినెవరు అర్థం చేసుకోగలిగారు చెప్పండి. అంతా ఆడువారిని 'అర్థం' కోసం చేసుకోడమే గాని సరిగా అర్థం చేసుకునే ప్రయత్నం చెయ్యకపోవటమే సమస్యలన్నిటికీ కారణం. భారతదేశాన్ని నడిపించేది మహిళలే! అయినా ఇంతవరకూ పార్లమెంటులో మహిళాబిల్లు ప్రవేశపెట్టలేదు. ఇదిగో అదుగో అంటున్నారు.

ఆడువారి మాటలకు అర్థం తెలియాలంటే వారి రచనలు చదవాలి. వారి హృదయాంతరంగాల్లోకి ప్రవేశించగలగాలి. పైవాన్‌లో "కిమ్‌జోషి కుషూక" అనే మహిళ "ఉసోషియో ఫాంటసీ ఆన్ విమెన్ విజ్" అనే పుస్తకం రాసింది. వీలుంటే చదవండి. ఆడువారి మాలే కాదు హృదయం కూడా లోతుగా అర్థమవుతుంది. ఇంకా అర్థం కాకపోతే బాగా అధ్యయనం చెయ్యండి.

ఈమె రాసిన ఆ నవలని ఆ దేశంలో నిషేధించారు. అయినా పుస్తకాన్ని ప్రపంచమంతా చదివింది. ఇంకా సమైకాలో ఓ మహిళదో ఇన్నర్ మీనింగ్ అండ్ అవుటర్ కాన్సెప్ట్ ఆఫ్ ఎ లేడీ అని...

2. మల్లాది చన్ద్రశేఖర శాస్త్రిగారు:
పురాణం పురుషోత్తమ రావు

ప్ర॥ ఆడువారి మాటలకు అర్థాలే వేరులే! అన్నారు నిజమేనాండీ?

జ॥ ఆడువారి మాటలకు అర్థాలు వేరులే అన్నారు సరే.

అసలా మాటన్నది ఎవరు? ఒక పురుషుడే కదా! ఆ సంగతలా ఉంచితే...

మహాభారతంలో ద్రౌపది తన్ను సభా ప్రాంగణానికి రమ్మంటున్నారని కబురు తెచ్చిన కంచుకితో, ధర్మరాజు తానోడి నన్నోడెనా, నన్నోడి తానోడెనా! నేను ధర్మ విజతనా, అధర్మ విజతనా అని ప్రశ్నించింది. దాని కామెకు ఏం చెప్పాలో తెలియక సభాస్థలికి వచ్చి అదే ప్రశ్న వేసింది. కొన్ని గ్రంథాల్లో 'కంచుకి'ని వాడు అని రాశారు, కాని అది సరికాదు. భారతం నాటికాలంలో అంటే ద్వాపర యుగం చివరి అంకం లేదా కలియుగం ప్రారంభ

దశ అని చెప్పుకోవచ్చు. నాటి కాలంలో స్త్రీలే అంతఃపుర పరిచారికలుగా ఉండేవారు.

అయితే ఇక్కడ ద్రౌపది వేసిన ప్రశ్నకు సభాస్థలిలోనున్న భీష్మ, ద్రోణ, కృప, విదుర, దుర్యోధన, దుశ్శాసన, కర్ణ, శకుని వంటి దుష్టచతుష్టయమే కాక, పంచపాండవులకు అనగా ధర్మ, భీమ, అర్జున, నకుల, సహదేవాదులు కూడా సంధిగ్ధంలో పడ్డారు. ఆ సమయానికి శ్రీకృష్ణ పరమాత్మ అక్కడ లేరు. బృందావనం, కాదు వ్రేపల్లె, కాదు మధురా నగరని... ఇలా రకరకాలుగా కృష్ణయ్య అక్కడ ఉన్నట్టు రాశారు. ఆ సంగతి అలా ఉంచితే...

రామాయణంలో, సీత రాముడితో అడవికి నేను వస్తానూ! అంది. అంటే వస్తానేమిటి రానని, రాకేమి చేస్తాను వస్తాను అని కూడా అర్థం చేసుకోవచ్చు. అంతకీ రాముడు, సీతకి ఎంతో చెప్పి చూశాడు నయానా, భయానా. సీత విన్లేదు. 'వస్తానూ!' అంటుంది, ఎంతసేపూ.

పురాణాల్లో పిట్ట కథలుగా, ఒకటి చెబితే మీకర్థమవుతుంది. గోదావరి జిల్లాలోని అత్తారింటికి వెళ్ళిన ఒకల్లుడు, మనుగుడు పులయాక, 'ఎల్లొస్తా' నత్తగారూ అన్నాట్ట. 'ఎల్లుండీ' అందటత్తగారు. ఓహో! రెండు రోజులయాక వెళ్ళమంటోకది కావును! అత్తగారు అనుకున్నాట్ట. ఇలా 'ఎల్లొస్తా', 'ఎల్లుండీ' మూడు నాలుగుసార్లయ్యాక, మావఁగారు విసుగొచ్చి 'ఎల్లెహె' బండి దాటిపోద్దనేసరికి అప్పటికర్థమయింది అల్లుడు గారికి, అత్తగారు పొమ్మంటోందని.

మగవారిపైనా, ఆడువారిపైనా మాట అర్థం చేసుకోవడంలో ఉంటుంది అంతా. స్వస్తి.

3. సమరంగారు:

పి.వి.కె.రావు

ప్రః "ఆడువారి మాటలకు అర్థాలు వేరులే అన్నారు. నిజమైన అర్థం ఏమిటండీ?" – ఒక సోదరుడు, తణుకు.

జః మీ ఆవిడకు వాంతులయాయి, ఈ మాట ఎలా అర్థం చేసుకోవాలని అడిగారు. ఇందులో ఆడువారి మాటలకు అర్థాలు వేరనే అర్థం వేరే ఏమీ లేదనే

అర్థమవుతోంది. అసలు వాంతులయితే కంగారు పడాల్సిన పనే లేదు. ఎందుకంటే సదరు అమ్మాయి మీ గర్ల్‌ఫ్రెండ్ కాదు. వాంతులవడానికి అనేక కారణాలుంటాయి. పెళ్ళయిన కొత్తల్లో ఇలాంటివి సహజమే. ఈ విషయం ఆవిడ ఎంతో సిగ్గుపడుతూ చెప్పిందని కూడా రాసారు. ఇదేమీ అంత సిగ్గుపడాల్సిన విషయం కాదు.

సిగ్గా సంగతలా ఉంచితే ఇందులో నిజానిజాలు నిగ్గు తేల్చాల్సిన అవసరం చాలా ఉంది. ముందుగా ఆవిడకి రక్త పరీక్షలు, మూత్రపరీక్షలు చేసి ప్రెగ్నెన్సీని కన్‌ఫర్మ్ చేసుకోవాలి. ఒకవేళ 'అవును' అయితే మీరిద్దరూ హెచ్.ఐ.వి.టెస్ట్‌లు చేయించుకోవాలి. ఒకవేళ 'కాదు' అయితే, మీకు వీర్యకణాలు, ఆవిడకు గర్భసంచీ పరీక్షలు వగైరా చేయించుకోవాల్సి ఉంటుంది. యధావిధిగా రక్తపరీక్షలు క్రమం తప్పకుండా చేయించుకోవాలి. అవసరాన్ని బట్టి మీరు ఓజోమన్ మాత్రలు ఉదయం లేవగానే ఒకటి రాత్రి పడుకున్నాక ఒకటి వేసుకోవాలి.

అసలిప్పుడప్పుడే పిల్లలొద్దనుకుంటే, ఆవిడ గర్భ నిరోధక మాత్రలు మీరు గర్భనిరోధక సాధనాలు వంటివి అంటే 'కండోమ్స్' లాంటివి వాడాల్సుంటుంది.

ఇంకా చాలా పద్ధతులున్నాయి, ఉదా...

4. ప్రియదర్శిని రాం:

గంట్లన్న

ప్ర॥ రాంగారూ,

'ఆడువారి మాటలకు అర్థాలే వేరులే'. నిజమేనా! – నిమ్మతోట, గుడివాడ.

జ॥ అనుమానంగా ఉందా! అలా అయితే ఆ పాటే పాడుకో ఎవరొద్దాన్నారు నిన్ను. కాని అలా పాడుకొనే ముందు ఒక సంగతి, తొందర్లా! తీరిగ్గా ఆలోచించు. మీ అమ్మ, అక్క, వదిన, చెల్లి, పిన్ని వీళ్ళంతా ఎవరు? ఆడవాళ్ళే కదా. మరి వీళ్ళెవరితో మాట్లాడినా మారని అర్థం, ఎదురింటివారితో, పక్కింటి వారితో, గల్లీ చివరింటివారితో ఎలా మారిందబ్బా... అని మనకి చక్కగా అర్థమైపోతుంది. అయినా నువ్వెళ్ళి మాట్లాడితే మారుతోందా, లేదా వాళ్ళొచ్చి మాట్లాడుతూంటే తేడాగా వినిపిస్తోందా. మనం సరిగ్గా వింటే ఏ అర్థమూ మారదు. ఏ అనర్థమా

జరుగదు. ఇంకా వేరేవేరే అర్థాలతో మాట్లాడే ఆడవారెవరబ్బా... ఒకవేళ అలాంటి వారుంటే జాగ్రత్తగా అర్థం చేసుకు మెలగాలి. అసలలాంటివారి జోలికెళ్ళక పోవడమే హెల్త్‌కి మంచిది. అందుకని చక్కగా పుస్తకం దగ్గరెట్టుకొని అర్థాలూ, నానార్థాలు, ద్వందార్థాలు, ప్రతి పదార్థాలు, టీకా తాత్పర్యాలు బాగా చదువుకో ఏం. గుడివాడన్నావుగా, రోజూ గుడికెళ్ళు; నవగ్రహ ప్రదక్షిణాలు చేసి దానాలిచ్చుకుంటే మంచిది.

5. కందాడై రామానుజాచార్యులుగారు:

శ్రీమతి సుమతి

ప్ర|| "ఆడువారి మాటలకు అర్థాలే వేరులే!" అంటారు. నిజమేనా. – గృహిణి, నిడదవోలు.

జ|| ఆడువారి మనసులాగే మాటలు కూడా అర్థం చేసుకోవడం కష్టం. భాగవతంలో సత్యభామ మీరజాలగలడా నా ఆనతి అంది. ఇది కల్పనా చమత్కృతి అయినా ఇందులో అర్థం విశేషార్థం, పరమార్థం ఈ మూడూ త్రిగుణాత్మకంగా ఉన్నాయి, ఒకదానితో నొకటి పెనవేసుకుపోయి; సత్యభామ వేణీబంధనం లాగ. విడదీసి అర్థం చెప్పగల మహానుభావులు ఎందరో! వినేవాడిని బట్టి అర్థం మారిపోతుంది. పచ్చ కామెర్లవాడి సామెతలాగ. సత్యభామ గీతగీసిందా, గీత చెప్పిందా, అనికాక ఆలుమగల అనురాగ దాంపత్యాన్ని అర్థం చేసుకుని వేరే అర్థాలు తీసుకోక శ్రీకృష్ణ ప్రేమతత్వాన్ని అర్థం చేసుకుంటే పరమార్థం. ❋

# కళాఖన్డమ్

(హైద్రాబాద్ శిల్పకళారామంలో... వరద బాధితుల సహాయార్థం మన సినీకళాకారులు గురజాడ అప్పారావు పంతులుగారి సుప్రసిద్ధ 'కన్యాశుల్కం' నాటకంలోని గిరీశం పాత్రని సరదాగా వారి వారి సొంత బాణీలో ప్రదర్శిస్తే ఎలా ఉంటుందన్న ఊహకి ఈ రచన 'పేరడీ'.)

(ప్రవేశం ఉదయభాను)

హలో! హలో! అందరికీ దుమ్మురేపే శుభరాత్రి. నమస్కారం, వణక్కం, నా శాల్యూట్. పూర్వం పౌరాణిక నాటకాల్లో శ్రీకృష్ణ పాత్రని ఒకటో కృష్ణుడు, రెండు కృష్ణుడు, మూడో... ఇలా వేసేవార్ట. అలాగే ఈ కామెడీ స్కిట్లో, ఒకటో గిరీశం, రెండో గిరీశం, మూడో గిరీశం ఇలా వస్తారు వరుసగా. ఒక్కొక్కర్నీ ఒక్కొక్క హాస్యనటులు పరిచయం చేస్తారు.

చూడండి! ఆనందించండి. దుమ్ము... (దులపండి ప్రేక్షకుల కేకలు)

(ప్రవేశం బ్రహ్మానందం)

అందరికీ నా నమస్కారం. మేం కాలేజీలో చదువుకొనే రోజుల్లో కన్యాశుల్కం సినిమా చూశాను. అందులో ఎన్టీఆర్‌గారు గిరీశం వేశారు. శ్రీ ఎఎన్నార్‌గారు వేసుంటే ఎలా ఉండేదని నేను సరదాగా మిమిక్రీ చేసేవాణ్ణి. ఇప్పుడు నిజంగా నాకాదృష్టం కలిగింది. నటనలో మహోన్నత శిఖరాలధిరోహించిన మహానుభావులు వారి గురించి నేను చెప్పడం... కన్న మీరే చూడండి.

ఒకటో గిరీశం: శ్రీ ఎఎన్నార్

(ఎనౌన్సుమెంటు వినిపించి స్పాట్‌లో...)

(సిగరెట్ కాలుస్తూ) శాయాకాలమయింది. పూటకూళ్ళమ్మకి సంతలో సామాను కొనిపెడతానని జెప్పేసి ఒకటా రెండా ఏకంగా ఇరవై... ట్వంటీ రుపీసు తీసుకెళ్ళి డాన్సింగ్ గర్ల్లు క్రింద జోరుగా హుషారుగా అంటూ పాట పాడేశాను. డామిట్, షీర్ నాన్సెన్స్. ఇలా ఎన్నిసార్లు చేస్తే ఊరుకొంది కాదు. బైదబై ఇక్కణ్ణుంచి సెటప్ లేపెయ్యడమే మంచిదిగా తోస్తుంది. వెళ్ళేముందు మధురవాణిని ఒక్కసారి 'టచ్' చేసి చూద్దాం.

ఏడీ నా ప్రియశిష్యుడు వెంకటేశం ఇంకా రాలేదు. (వాచీ చూసుకుని) ఈ కాలం పిల్లలకి టైం సెన్స్ బొత్తిగా లేకుండా పోతూంది. వస్తున్నట్లు చూసి హాయ్! మై డియర్ వెంకటేశం, అదేమిటి మొహం అలా పెట్టావు. ఆరిపోయిన చుట్టపీకలాగ! ఏమిటి నేను సిగరెట్లు కాలుస్తున్నాననా చుట్టలు మానేసి అప్పుడప్పుడు అభిప్రాయాల్తో అంటే ఒపానియన్స్‌తో హేబిట్స్ కూడా మార్చకపోతే పొలిటీషియన్ కాడోయ్. వాట్ నీ ఎగ్జామ్ పోయిందా. నువ్వు ఫెయిల్ కాలేదు. ఎవరె నిన్నే ఫెయిల్ చేసుంటారు. దానికింత వర్రీ ఎందుకు. ఫెయిల్యూర్ ఈజ్ ద ఫస్ట్ స్టెప్ టు సక్సెస్ అన్నాడీ గిరీశం. నాదో అయిడియా చెప్పనా! ఇప్పుడు శలవలిచ్చేశారు కదా! నేను కూడా మీవూరొచ్చి నువ్వు ఆల్ సబ్జెక్ట్స్ డిష్టింషన్లో పాసయ్యావని చెప్తా. నిన్ను నా అంతటివాణ్ణి చేయడానికో, నీకు ట్యూషన్ చెప్పడానికో మీ ఊరు వచ్చానని నువ్వు చెప్పు. అన్నట్లు...

చూడూ! రాత్రి దొంగలబండికి మనూరెళ్ళిపోదాం. హ... హ్హా...హ్హో... చూశావా మరి! ఒక అయిడియా జీవితాన్నే మార్చేస్తే ఒకమ్మాయి అయిడియానే మార్చెయ్యచ్చు. అమ్మాయంటే జ్ఞాపకం వచ్చింది. మధురవాణి నాకోసం 'వెయిట్' చేస్తూ ఉంటుంది. బై... రాత్రి... దొంగలబండి... మర్చిపోకు. (చప్పట్లు)

(ప్రవేశం ఎవియస్)

థేంక్యూ... హేట్సాఫ్ సార్!

చూశాలు కదండీ నెంబల్ వన్ గిలీశాన్ని. ఇప్పుడు లెండో గిలీశంగా లావుగోపాలలావుగాలు; వాలు మన మధ్య లేలు. అయినా మన శివాలెడ్డి ఆ 'నట విలాట్' స్వలూపాన్ని మన ముందుంచే ప్లయత్నం చేస్తాలూ... చూలండీ... చూసి ఆనల్దించండి. సీను: వెంకటేశం, గిలీశం వాల్లూలెల్లాక? అక్కల:

రావుగోపాలరావు: (స్పాట్‌లో 2 గిరీశం)

ఓసోస్! ఇదేనడి మనిల్లు. దీన్సిగదరగా 'ఓల్జైనా' మయా ట్రాంగా ఉంది. అమ్మయ్య ఆవూర్నించి వొచ్చేసరికి గోసీ ఊడి కాసీ ఎల్లినంత పనయింది. ఆ ఒంటొద్దు బండోడికి డబులిచ్చి సామాను లోపలకట్టుకొచ్చెయ్యి.

ఆ... వూ యీజ్ దిస్ బూటిఫుల్ లేడీ. ఓ మీ సిట్రా. సెప్పావు కావు. (వెంకటేశాన్నోటి పీకి) ఆ ముక్క నేనడక్క ముందు సెప్పాల. నీకో యంగండ్, బూటిఫుల్ సిట్రుందని ఇది పల్లెటూరయినా పెద్ద కాంపేన్‌కవకాశముందని నిన్నీ సెప్పద్దూ.

ఏదీ! ఓ సుట్ట పీకందుకో. నిన్న పీకి పీకి ఆర్పేసి జోబీలో దాచుంచమని ఇచ్చానే అదిటియ్యి. అదే లేవో, సొక్కా జోబీలోనే, లాగూ జోబీలో బీడీ ముక్కగదా. ఏటి కొంపదీసి పారేశావా ఏంటి! ఓకే ఒప్పేసుకుంతన్నా నీ బాబు మై రావణుడో, మహిషాసురుడో, అయితే నాకేంటి. సరేస్సరే. కాల్చనులే. ఒక్కోపాలి సిన్నోడు సెప్పినా ఇనాలీ! అన్నాడు మా పెద్దోడు. ఆడెవుడని అడక్కు. సెప్పిందినంతే, సెరిత్రడక్కు.

ఓకె. సైలన్సు ప్లీజ్. ఎంట్రన్స్ ఆఫ్ ది గ్రేట్ అగ్నిహోత్రావధాన్లు. నమస్కారం. తమరేనా పిలక అగ్నిహోత్రావధాన్లుగారు. సిత్తం పిలక్కాదు నులకంఘన్నారా అట్టాగ్గానియండి మన్దేం బోయింది మద్దెన.

ఏంటి మీయింటో లంచి, డిన్నర్ లాంటియి కుదరవా! అందుకే మరి! ఇంజన్లో కాలేది. మన కెపాసిటి, మన లెవల్లేంటో ఇనండి సెప్తాను.

మన సన్నాయి పట్నంలో డిప్పీటీ కలేట్టరుగారు కాళ్ళు... ఏంటిటన్నారా, కాళ్ళు, సేతులు, గెడ్డం... ఒకటేంటి పుచ్చుకోవాల్సియన్నీ పుచ్చుకొని పిసకాల్సినయన్ని పిసికేసి, బాబ్బాబు నాకాడుద్దేగం చేస్కో అంటే, శాస్స్ నేనేటి, నీకాడేటని వద్దుపో అని ఒగ్గేసినా. అదీ మనలెవలు.

మన నేస్తం హైద్రాబాద్ నవాబు సులేమాన్ మహద్దర్‌గారు, మీరు హమేశా మంకొలువులో ఉండి పక్కా, నెలవక్కింటికి వెయ్యిరూపాయలు తీస్కోండన్నారు.

అంతెందుకు మన మేడమ్ అంటే తెల్సా సోనియా నాకు పార్టీ టిక్కెట్టిత్తానంటే ఆనక కబురు సేత్తానన్నా.

సాచ్చాత్తూ సెంద్రబాబా మధ్య సైకిల్ యాత్రలో కనబడి సైకిల్ దిగి స్టాండేసి బెల్లుకొట్టి పిల్చి టిక్కెట్టు సించి జోబీలో ఎట్టబోతే ఇంతా సేసి సైకిలేంటెక్కేదని ఎక్కితే గిక్కితే కారే ఎక్కుతానన్నా!

ఈలోగా మన సిరంజీవి రైలింజనేసుకొచ్చాడు. సాటోడు. కాదంటామాసెప్పు. ఎదురుంగానే ఉన్నాడు అడగండి... ఏంటి ఆయనా లేక మీరూ లేక... పోలిటిక్స్ పడవా... చిత్తం! పోర్షన్ హోల్ మొత్తం సైడ్‌ట్రాక్ అయిందా. అవదు మరీ... ఎలచ్చన్లో తిరిగి... తిరీగీ... నో ప్రాబ్లమ్... డబ్బింగ్‌లో కవరు సేద్దారి. బై... పోర్షన్ పక్కకెళ్ళిందటే ఎళ్ళదూ... ఏంచేత్తాం...(సణుక్కుంటూ వెళ్ళిపోవును.)

(ప్రవేశం అలీ)

థాంక్యూ శివా! అలో బావున్నాలా, అల్లో బావున్నాల్లా! సలోలీ... పలోలీ... చూశారుగా సబ్జెక్ట్‌లోంచి శివారెడ్డి ఎలా పోలిటిక్స్‌లోకెళ్ళిపోయాడో, ఇప్పుడు మన గురుగారు కోటా శ్రీనివాస్‌గారు మూడో గిరీశంగా... ఎంత మూడ్ తెప్పిస్తారో చూడండి. ఆయనికి బుచ్చెమ్మతో డ్యూయట్ ఉందని చెప్పాం. అందుకే వచ్చారు. ఎన్‌జోయ్... కోటా శ్రీనివాస్‌గారు. (స్పాట్‌లో కోటాగారు)

మరీ! మీరు జరా 'బొంకుల్ దిబ్బ' కాడ్ఫా, కన్నాశులకం నాట్కం గీన ఏస్తే, నాకు పట్టు గిరీసం కావాలన్ననని జెప్నానా లేదా. మరీందేంటి 'థర్డ్' గిరీశం ఇచ్చారు. థర్డ్ క్లాస్ లెక్కలోళ్ళలా గనుదు తున్నమా! థూ! నీయవ్వ. గట్నా తంబీ. మరో జెప్నాన్‌గాబట్టి జర మంచిగుంది. లేపాయే గీపాట్ని పిల్క పుచ్చుకోని జర గుత్తి కోసేటి దుండె. ఈ సీన్లా నాకు బుచ్చెమ్మొదిన్తో లవ్ సీను కట్ జేస్తే దూయట్టున్న వంటావ్. జూడెట్టా ఇరగదీస్తానో... రికార్డెయ్యి... తొక్కి తొక్కి అరగదీస్తా.

పాత సైన్మాలో ఎన్టీవోడు ఏం జేసిండూ. యాదుందా! సెట్టెక్కి కూకాని గుట్టముక్క పీకిండు. పాండవ వనవాసంలో గద పిస్కలా, గట్నున్నమాట. అసల్కా పట్టు సీన్లా ఎఎన్నార్ సారు హీరోయిన్నే సూళ్ళా హిఁ..హి..హీ... సెకండ్ సీన్లా రాగోరా అదే రావుసారు వాడు జూసిండు, జస్ట్ గన్లే. టచ్చింగ్ సెయ్లా!

థర్డ్ సీన్లా నేన్జూడు కరగదీస్తా. లవ్వు దూయట్. ఓ ఫైటు బేట్నే పోయవ్. ఇంతకీ హీరోయిన్ రోలికెవర్ని బుక్ చేస్నావ్ తంబీ. సాకలి ఎంకినా! మనూరు సాకలి ఎంకినా! వీరోయిన్ గంటే మరెట్నుండాల! అందుట్నా మనం వీరో

అయ్యో. ఆర్తీ అగర్వాల, నయనతార, బూమికమ్మ! ఈళ్ళుగాదు. మా ముమ్మాయతమ్మ లెక్కనుండాలె.

సరే... సీనేంటి... ఈరోయిన్ నడ్యాలో కుంకోని ఇత్తరాకులు కుట్కుంటే నేనెల్లి, ఇస్... ఇస్.. అనాలా... మరి గంతేనా., ఈపాటి దానికి నేనెందుకూ దాని బోయిఫ్రెండ్ సుబ్బిగాడ్నే ఎయ్యమనకబోయాహ్! ఏసం.

నేజెప్తా ఇన్కో సీను. ఆయమ్మి జర సానంగీనం జేసొచ్చి ఆడొయ్యరంగా నుంచోని దలారబోసుకుంటాదన్న మాట. అది నేజ్సూస్నా. గంతే కళ్ళల్లో స్పార్కు లొచ్చినాయే. ఒళ్ళు వీటెక్కిపోయి ముక్కుల్లోంచీ, సెవుల్లోంచీ వొకటే పొగల్లు. ఇంతట్ల లవ్ బాణాలేత్తాడే ఆడొచ్చి ఫస్టు నా పిల్లమీద ఏత్తాడు. ఇది గ్రాఫిక్స జూపియ్యాల! యాదెట్టుకో. ఆ తర్వాత్న నాకేత్తాడు. ప్రాక్టీస్ గట్రా సరీగ్గా లేక్న దానికేసిన బాణం నాకు, నాకేసింది ఆ పిల్లకి తగులుకుంటాయి.

కట్ చేస్తే, గంతే లవ్వు, డూయెట్టూ. ఓల్డ్ స్టోరీ ఆళ్ళట్నే రాత్తరు. మనం గీసి జర స్క్రిప్ట్ సేంజి చేస్నామంటే... హి...హీ... సూడు లచ్చుల్... లచ్చుల్. ఏంటి కుదర్దా. ఇది క్లాసిక్కా! అయితే నువ్వు సిక్కే, నా కేటి దిక్కు... ఈడెవడండీ బాబో (అంటూ నెత్తిమీద సేతులెట్టుకొని అందరికీ నమస్కారం అంటారు) (చప్పట్ల మోత).

(ప్రవేశం గుండు హనుమంతరావు)

నమస్కారం... అందరికీ నమస్కారం. మీ అందరికీ నమస్కారం... చూశారుగా కోటన్న ఎల్లా ఇరగదీసి, అరగదీసి, కరగదీశారో. ఇప్పుడాయన చెప్పిన స్క్రిప్టే ఓకే చేశారు మన బాలయ్యబాబు. కట్ చేస్తే డ్రీమ్ సీన్లో బాలయ్యబాబు దుష్యంతుడు... బుచ్చెమ్మ శకుంతల... (మరి 'మీరో' ఎవరో అరుస్తారు) నేనా! కణ్వ మహర్షిని బాబూ. కణ్వ మహర్షిని.

(స్పాట్‌లైట్... బాలయ్యబాబు)

బాలయ్యబాబు: (పౌరాణిక వేషంలో) బుచ్చెమ్మకేసి చూసినట్టు చూస్తూ...

ఆహా! ఏమి, ఏమేమి ఏమా సౌందర్యము. అపురూపము, అలౌకికము. కాదు, కారాదందువా! అప్రతి హతము... అమరానందము.

హహ్హోహ్హో.. ఇంథట అపూరూప లావల్యవధికి 'బుచ్చెమ్మ' అని నామమిడిన ఎంత హేయము. ఎంతటి నీచము. ఎంతటి నికృష్టము. ఆ దేర లోకము నందలి యప్సరస్సలు, ఈమె కాలిగోటికి పోలరు. ఈమె ముందు దిగదుడుపు. చివరకు టాలీవుడ్, బాలీవుడ్, కోలీవుడ్ ఆఖకురు హాలీవుడ్ లల్లనామణులైనా ఈమెకు సాటిరారు. రారుగాక! (భంగిమ మార్చి)

రామరామ! ఆమెకు ప్రేమ సంకేత పరిజ్ఞనమిసుమంతయేని లేదు కదా! పోయిన దేమి? నేర్పిచూచెదముగాక...

ద్రౌపదీ... సారీ! బుచ్చెమ్మోదినా! మళ్ళీ సారీ... శకుంతలా! నిన్ను జూసిన అష్టదిక్పాలకులయిన ముచ్చెమ్మటలు ఫోయెవలె.

నీ నామము ఏమది... బుచ్చెమ్మ, అచ్చమ్మ, పిచ్చెమ్మ హ! హహ్హో... ఏదేని యగును గాక! భువనైక సుందరివే. ఆ అప్సరసకాంత కెక్కడిది అపురూప సోయగం. నాట్యము నిట్యమంచు నడుము లూపుటయే కాని, నీ నడకల కులుకు ముందు వారినాట్యమెంత?

అయ్యారే! భళారే! మజ్జారే!!! ఏమదదేమది? మహా మగధీరుడనగు నా మది ఈ కాంతను కాంచినంతనే గతులు తప్పులు, ఆమెయందే లీనమై లగ్నమగుట ఆ బ్రమ్మ ప్రగ్నాపాటవ ప్రాభమమే కాందందునా! ఔనందునా!

ఔనందురేని సరియ. కాదు కానేరందురేని ఆ మదనుని మనో వికార చేష్టకియ్యది పరాకాష్టయౌ నుండనోపు.

ఆధరణ వస్త్రములు ధరించిన ఈమె హిమ శృంగముపై నున్న మానస సరోవరమున విహరించు రాజహంసయా!

శారదనీరదేందమా
ఘనసారమా
పటీరమా!!
మరాళమా
మల్లికా హారమా
తుషారమా

క్షీరసాగర కెరటాలపై 'ఫేన'మా
రజతాచలమా
పైన ప్రకాశించెడి చంద్రమా!
కుందమందారమా,
అందలి మకరందమా!!

ఆమె మోముపై ధవళ కాంతులీను ఆ మేలి ముసుగున నీమె మోము కాల మేఘములిడిచి తెల్లబారినట్లు లేదూ.

ఔరా ఏమి ఆ పద్మాసనుని సృష్టివైచిత్రు. ఆహ్! ఏమది మా అగ్నిహోత్రుల మామ వచ్చుచున్న సవ్వడి అడుచున్నది. ఇదిగో నిష్క్రమించెదగాక!

(చప్పట్లు... ఈలలు...)

(ప్రవేశం కొండవలస)

ఆ కొట్టడమేంటి? ఏంటి? అలా కొట్టేత్తన్నారు చప్పట్లు... ఆ ఈలలేంటి. ఆగండాగండి! ఏంట్రా ఆగదేంటరా! అయితే ఓకే. మద్దెలో నాకేటి? అయితే ఓ ఇసయం ఉండాదిక్కడ. అదేంటో మీకు తెల్సు. అందరికీ తెలియదాన్ని సెప్పి లాబం లేదు. తెల్సిందాన్ని సెప్పీ లాభం లేదు. ఇప్పుడు సూడండి ఎవరొత్తన్నారో... సీనా... ఇందాకటిదే కంటిన్యూ... మా సరోజనీని చూసి... సిరంజీవి కాదా... అయితే ఒకే.

(స్పాట్‌లో చిరంజీవి)

చిరంజీవి: ఓ బుచ్చెమ్మొదినా! నిజం చెప్పాలంటే... మీలాంటి వాళ్ళంటే ఫ్ఢడి ఛస్తాననుకోండి. జస్టెమినిటండీ... ఇదిగో ఈ బీడీ మూడు దమ్ములాగి ఆ నలుగురెదవల మాసాలిరగొట్టి, మరి ఫైటింగ్ జేస్తే లుంగీ జారిపోద్దికదండీ. అందుకని దాన్ని కాస్త పైకి ఎగ్గట్టి... ఆ ఇప్పుడు సెప్పండి! ఏది కాస్త ఆఫీసు రైట్‌కి టర్నింగిచ్చుకోండి. కాదు కాదు లెఫ్ట్‌కి, ఆఁ... అద్దదీ... ఇప్పుడా ఫేసు జూడ్డానికి బ్రహ్మదేవుడి వశం కూడా కాదనుకోండి. ఎందుకంటే అయ్యబాబాయ్ ఫుల్ మూన్ లైట్లా ఇంత బ్రైట్‌గా ఉంది. ఫ్లడ్ లైట్ కూడా ఎందుకూ పనికి రాదంటే బిలీవ్ మీ.

కాస్త ఆ ముడి విప్పి ముడీసుకున్న ఆకురుల్ని అలా ఫ్రీగా వదిలెయ్యండి. జస్ట్! అన్తే... నయాగరా బ్లాక్ వాటర్ లా ఎంత గ్రాండ్‌గా ఉంది? ఈ పొజిషన్లో మిమ్మల్ని జూడ్డానికి 'ఆ ధౌంజండైస్ వాలా' ఎవడండీ వాడు? ఇంద్రుడికైనా సెక్యమా చెప్పండి! ఆఫ్ట్రాల్! నేనెంత.

మనసులో మాట చెప్తున్నా! ఈ స్పాట్‌లో మీతో ఓ డూయెట్ ఏసుకోవాలనుందండీ... బంగారు కోడిపెట్ట... ఓ... నో... బోల్డు కోరస్... హడావిడి... పోనీ మాస్టారూ... మాస్టారూ... రగులుతోంది మొగలిపొద... నో... నా! ఆc... అబ్బనీ తియ్యనీ దెబ్బ... అద్గదీ... అందులో నేను శ్రీదేవిని పీకాను. కాని ఇప్పుడు ఈ సీన్‌లో మీరు నన్ను పీకండి. అడ్డ పీకండి ముందు చెప్తా... అయ్యబాబోయ్ అలా పీకారు. ఇష్టం లేకపోతే చెప్పచ్చుగా. ఉండండి... డాక్టర్ దగ్గరికి... డాక్టర్... ఈలలు చపట్లు గోల డూయట్ పాడాలీ...

(సుమ ప్రవేశం)

సుమ మైకు పుచ్చుకొచ్చి ఏదో చెప్పబోయింది. ఇంతలో... ఉచిత కరెంటు పోయింది.

అయిపోయింది. ❁



# బుడుగు లెచ్చర్

## (పెద్దలకు మాత్రమే)

**హా**లో! రాధా వోసారి ఇలా వచ్చి మా నాన్న గోపాళం చొక్కా ఇటియ్యి. ఈ కళ్ళజోడు కూడా గోపాళందేలే. ముక్కు మీంచి జారిపోతూందిగాని పర్లా. ఈ బూట్సు చూడూ కుంచెం పెద్దిదయినట్టున్నాయి. ఏంటలా చూస్తావ్? నడ్డిమీద చేతులెట్టుకొని. నీ మొగుడి చొక్కా అడిగాననా! అది మా నాన్దేలే, నాకూ తెల్సు. ఎందుకా? అబ్బబ్బ నీతో వేగలేక లేక చస్తున్నా. మీ పెద్దవాళ్ళకి అన్నీ కావాలి. ఇప్పుడు నేను లెచ్చరివ్వాలిగా అందుకనన్నమాట.

అస్సలు లెచ్చర్లివ్వటమంటే మాటలు కాదట తెల్సా. చాలా పెద్దపెద్ద వాళ్ళు అంటే గుండుమీద జుత్తు ఉందే వాళ్ళే ఇవ్వాల్ట, బాబాయి చెప్పాడులే. నన్ను తిరపతి తీసికెళ్ళి గుండు కొట్టించారు కదా! అందుకనిప్పుడు నేనోలెచ్చరివ్వచ్చు. ఇంక నాల్రోజులో ముప్ఫయి రోజులో ఆగితే నెత్తిమీద జుత్తొచ్చి కూచుంటుంది. అప్పుడు నేను లెచ్చరివ్వకూడదని కూకలేస్తారు మీ పెద్దాళ్ళు. అందుకని ఇప్పుడే ఇస్తే పోలా! ఓ పనయిపోతుంది. ఈ మాట నాకు తెలియదులే. మీ పెద్దవాళ్ళనుకుంటుంటే అలా వాడానన్నమాట.

మొన్న మన వీధి చివరి 'డుంబు'గాడు లేడూ వాడు 'జరం' వొచ్చిందని చెప్పి మంచం ఎక్కి ముసుగెట్టి 'అణా' కావాలని అడిగాట్ట. 'అణా' అంటే తెలీదా, ఈజికొల్టు ఆరో ఫ్ఫదో పైసల్లే. ఇంతలో ఈ ఎలచ్చన్ కాళ్ళొచ్చి అమ్మతో చెప్పి మేం ఇప్పిస్తాం అంటే మేం ఇప్పిస్తామని అమ్మ దగ్గరకెళ్ళి డుంబుగాడేమన్నా రూపాయడిగాడా, అణాయే కదా ఇస్తే పోలా జరం తగ్గిపోతుంది అన్నారు ఉత్తిత్తినే. పాపం, వాళ్ళమ్మకేం తెల్సు. నిఝం అనుకొని, ఏడవకు డుంబూ జరం తగ్గగానే ఇస్తా చాక్లెట్లు కొనుక్కుందిగాని అంది. అందా, అప్పుడే ఎలచ్చన్‌వాళ్ళు మేం ఉత్తిత్తినే అలా అన్నాం, నిఝంగా 'అణా' ఇస్తే జరం వచ్చే, వాళ్ళందరకీ ఇవ్వాలికదా, అప్పుడు రూపాయో, డాలరో మార్చాలి, కష్టం అన్నారు; అని గొడవ చేసారు.

అమ్మంటే అందరికీ అమ్మే. అప్పుడమ్మేం జేసిందీ, అందరికీ

అణాలివ్వాలంటే కష్టం. రూపాయి మార్చిస్తా కాస్తాగు డుంబూ అంది. అంతకుముందే 'డుంబూ' ఏం చెప్పాడూ, మనకి అంటే వాడికి లే! అమ్మ అణా ఇస్తే అందరికీ తలా చాక్లెట్ ఇస్తా అన్నాడు. అంతా ఇప్పుడు చాక్లెట్ల కోసం ఏడుపు మొదలు పెట్టారు.

మాకించక్కా బడిలేదు. శలవలిచ్చేశాం తన్నుకు చావండన్నారు. ఛ ఛ ఆడుకోండన్నారు. కొందరేమో క్రికెట్ ఆడుకొంటుంటే కొందరు రైళ్ళాట, బస్సులాటాడుకొంటున్నారు. ఎవరి ఆటలు వారివి, ఏం చేస్తాం! బళ్ళో పాఠాల్జెప్పరు. ఇంటోనే చదూకోవాల్ట అలా అని మా బాబాయి చెప్పాడు. మరంత పెద్దపెద్ద 'బళ్ళు' ఎందుకు కడతారరో తెలియదు. పైగా బోల్డు ఫీజుల్ట. ఏమన్నా అంటే ఏం నీకు కట్టటం లేదా ఫీజులు ఆమాటకొస్తే బాబాయికే తక్కువ కడుతున్నాం అంటారు పెద్దాళ్ళు. ఈ మాట నిజ్మే కాని మాకు బళ్ళో ఎబిచీడీలు చెప్తారు, వాళ్ళ కవీ చెప్పర్ట. మరి ఫీజులు గట్రా ఎందుకో ఈ పెద్దాళ్ళకి తెలియదు గాని నాకు తెల్సు. నేన్జెప్పానని చెప్పకండే. చెప్పారంటే బాబాయి బండెక్కించుకొని నన్ను బళ్ళోపడెయ్యడు; అంటే ఎప్పుడన్నా పడేస్తాడు. అదీ అమ్మ ప్పదిసార్లు చెబితే ఓసారి. ఎందుకంటే సందు చివర రెండు జెళ్ళ సీతనెక్కించుకుని వెళ్ళాలిగా అందుకని. నేనూ పేద్దయ్యాక ఇంచక్కా సీగాన పెసునాంబ నెక్కించుకుంటాలెండి. ఇంతకీ బాబాయి ఫీజు లెందుకంటే బీడీలు కాల్చడానికి, సిన్మాలు చూడ్డానికీ.

మాకు ప్రోగ్రెస్ రిపోర్ట్సు గట్రా ఇంటికి పంపిస్తారు. బాబాయి వాళ్ళకి ఎందుకు పంపరో నాకు తెలీదు. నేనసలెప్పుడూ చూళ్ళా. నా రిపోర్టు చూడగానే మా అమ్మ గుడ్లెర్రజేసి, హన్నా! ఇవేం మార్కులు డాడీ కానీ నీపన్జెప్తా అంటుంది. డాడీ అంటే గోపాళం, ఇందాక చెప్పాగా. పైగా అంటుందీ, ఆ డుంబూ గాడికి చూడు, సీగాన పెసూనాంబకి చూడూ ఎన్ని మార్కులొచ్చాయో అంటుంది.

పాపం! అమ్మకి ఎలచ్చన్ వాడి ఏచ్చన్ రాదు, మాటలూ రావు. ముందస్తుగా 'డుంబూ' వాళ్ళమ్మొచ్చి, బుడుగూ అమ్మా, బుడుగూ అమ్మా మీ బుడుక్కి ఎన్ని మార్కులొచ్చాయీ అంటుంది సాగదీస్తూ. మా అమ్మ పాపం ఎలచ్చన్ వాడి స్టంటు తెలియక నిఝం మార్కులు చెప్పేస్తుంది. అప్పుడు డుంబూ వాళ్ళమ్మ,

ఓసింతేనా, మా దుంబూకి బోల్డు మార్కులొచ్చాయి అని, ఎలక్షన్ వాడు ఓట్లు రాకపోయినా వచ్చాయని చెప్తాడు చూడూ అలా అన్నమాట! అలా చెప్తుంది. అంతే జాటర్ ఢమాల్ మనపనయిపోయింది; మా అమ్మ నడ్డిమీద ప్రవేటు చెప్పేస్తుంది. నీకెందుకురాలేదని. మరీ వెంఠనే కాదు. దుంబూ వాళ్ళమ్మ వెళ్ళిపోయాక వీధి తలుపేసి మరీ.

ఒక్కోసారి నడ్డి కాళీ లేకపోతే, పుస్తకాల సంచీ ముందు పడేసి చదువూ చదువూ అని చెవి'కీ' ఇస్తుంది లేదా పిక్కపాశం పెడుతుంది. ఆనక నాన్నొచ్చి అమ్మని కూకలేస్తాడనుకో! అయినా ప్రవేటు చెప్పించుకోడం తప్పదు కదా! ఎవరి ప్రవేటు కష్టాలు వాళ్ళవి. ఓ! అలా అంటే అర్థం కాలేదా! ఇప్పుడు, అమ్మా నాకు చెప్పిందా, అమ్మకి... నాన్న చెప్తాడు... నాన్నకి తాతయ్య చెప్తాడు... లేదా వాళ్ళ బాస్ చెప్తాడు... బాబాయికి నాన్న చెప్తాడు లేదా రెండు జెళ్ళ సీత చెప్తుంది... మాష్టారికి హెడ్మాష్టార్ చెప్తార్ట... హెడ్మాష్టారి క్కూడా బడివాళ్ళు చెప్తార్ట. నాకు తెలీదు బాబాయి చెప్పాడీ సంగతి; ఆఖరాఖరికి సీగాన పెసూనాంబకి వాళ్ళ బామ్మ చెప్తుందట! హమ్మా! హాడపిల్లలీ, పనిపాటా నేర్చుకోవా అన్జెప్పి.

మనం చిన్నవాళ్ళమనీ చితకవాళ్ళమనీ మనకేం తెలీదనీ పెద్దాళ్ళ ఉద్దేశం. మనం గోడపక్క చీమలు వరుసగా అన్నం ముక్కల్నీ పంచదార ముక్కల్నీ ఎలా లాక్కెళుతున్నాయో చూస్తూ ఉంటాం. అవి ఏం మాట్లాడుకుంటున్నాయో విందామని చూస్తామా, ఊహుఁ! ఈ పెద్దాళ్ళొచ్చి విన్నివ్వరు. చీమలొచ్చి మన్ని కుట్టి చంపేస్తాయని, మన రెక్కుచ్చుకుని ముందే మన్ని నడ్డిమీదో కాలిమీదో చంపేస్తారు. అస్సలు మన్ని చీమలెందుకు కుడ్తాయి? వాటి బంగారపు కన్నంలో వేలుపెడితే కుడ్తాయి గాని. ఆమాత్రం మనకి తెలీదా ఏమిటి? మనమేమన్నా చిన్నవాళ్ళమా, చితకవాళ్ళమా! పాకే పాపాయిలమా! గబుక్కునెళ్ళి కుట్టించుకోడానికి. బామ్మ చెప్పలా, రాజుగారు ఏడు చేపల కథ. కథ చివరాకర్లో పాపకి చీమ కుడుతుందన్న మాట. పాపా! పాపా!! ఎందుకేడుస్తున్నావంటే చీమ కుట్టిందీ అంటుంది. ఇదే సిన్మాలో పాపయితే, పాపంటే మరీ పాప కాదులెండి. రెండు జెళ్ళ సీతంటుంది. అది చీమ... చీమ... కుట్టిందీ అని పాట పాడుతూ డాన్సు ఆడుతుంది.

అస్సలీడవదు తెల్సా. ఈ సంగతులన్నీ సీగాన పెసూనాంబకి నే చెప్తే పెద్ద కళ్ళు చేసుకులిన్ది తెల్సా, ఇవన్నీ నాకెలా తెల్సాని.

ఇంకా మీకు చెప్పాలంటే బోల్డు పాఠాలున్నాయి. పెద్దవాళ్ళు వీటినే పాతాలంటం రాక లెచ్చర్లంటారు. లెచ్చరంటే ఏంటో తెల్సా. మనం చేతులు కట్టుకుని బట్టీ పట్టిన పజ్జాలూ, ఎక్కాలూ అప్పచెప్తామే అలా అన్నమాట. చాలా వీజీ. మరి మనింటికి రాద చుట్టాలో, గోపాళం బందువుతో వచ్చారనుకో... అంటే వీళ్ళు తాతయ్య, మామయ్య, బామ్మ వరసవాళ్ళు కాదు; అంకుల్ ఆంటీ వరసవాళ్ళు... వీళ్ళొస్తే మన పనయిపోయిందనుకో. మన కస్సలు ఏం రాకపోయినా సరే, మమ్మీ ఏమంటుందీ 'మమ్మీ' ఎవరా! అమ్మనే అంకుల్ ఆంటీ వస్తే 'మమ్మీ' అని పిలవాలి. ఉత్తప్పుడయితే 'అమ్మా' అనొచ్చు ఏంపర్లా. గుర్తెట్టుకో. మర్చిపోయావో వీపు విమానం మోతే అనుకో. ఏం, మమ్మీ మా బుడుక్కి డాన్సొచ్చుండీ అచ్చు సిరంజీవీలా చేస్తాదు, మా బుడుక్కి ఎక్కాలు కూడా వచ్చు అంటుంది. కంప్యూటర్ కూడా ఆడేస్తానని చెప్తుంది. వాళ్ళేమో ఆడి చూపించమంటారు.

మనకేమో చచ్చేసిగ్గు. టీవీలో పిల్లలు తెగ ఆడేస్తూ పాడేస్తూ ఉంటార్ట. అలా మనం ఆడేయ్యాలని వీళ్ళ ప్లాను.

అలా ఏంటి? అంతకన్నా బాగా చేస్తాం. కాకపోతే ఎవ్వరూ లేకుండా చూసి బోల్డు చేస్తాం. అవన్నీ వీళ్ళకెందుకు చూపించాలి. పోనీ వాళ్ళింట్లో ఓ బుడుగున్నాడు కదా వాడికి బోల్డు చాక్లెట్లు పట్టికెళ్దాం అనుకోరీ పెద్దాళ్ళు. అస్సలెవ్వరూ తేరనుకో, ఒకేళ తెచ్చినా మమ్మీ ఏమంటుందీ! ఎందుకండివ్వన్నీ అనంటుంది. ఊర్కే! ఎలచ్చన్ మాటన్న మాట. వాళ్ళిది నిఝం అనుకొని తేటం మానేస్తారు. అసలీ పెద్దవాళ్ళవన్నీ ఎలచ్చన్ మాటలే. ఏవి రైటో, ఏవి రాంగో తెలీదు కదా. వీళ్ళతో వేగటం చాలా కష్టం. వీళ్ళతో ఇంటో వేగటం కన్న బళ్ళో టీచరుతో వేగటం చాలా వీజీ అన్నమాట. అదీ ఓ రకంగా కష్టమే.

ఎందుకంటే మనం బళ్ళోకి వెళ్ళాక ఎబిచీడీలే మాట్లాడాల్ట. పొరపాట్న ఆఇఅఈలు మాట్లాడామో మొళ్ళో పలక పడిందే. భుజం నెప్పెట్టినా నడుం

నెప్పెట్టినా అన్ని పూస్తకాలూ మోయాల్సిందే కదా. మా నాన్న, బాబాయి చదూకునేప్పుడూ ఇన్ని పుస్తకాలు వీటినే 'బుక్స్' అంటారు. అన్ని లేవట. ఓ బుక్కు, పలక, బల్పం, పెన్సిలు ముక్కలుట. మరి వాళ్ళంతా ఎబిచీడీలు నేర్చుకొని నిఝం విమానం ఎక్కి అమెరికాకో, ఛన్ద్రుడి దగ్గర్కో వెళ్ళిపోలేదా! మరి మన్నెందుకు ఇన్ని బుక్స్, పుస్తకాల్తో చంపటం. ఇక్కడ బుక్స్ అంటే నోట్సు పుస్తకాలన్న మాట.

అస్సలు తాతయ్యా వాళ్ళూ ఆరో తరగతి వచ్చేదాకా ఎబిచిడిలే చదవలేదట. అయినా స్సరే తాతయ్య ఎడిచిడీలు మాట్లాడితే నాన్నకి బాబాయికి కూడా అర్థ కాదుట. ఎందుకంటే తాతయ్య ఓడెక్కి, ఓడ అంటే 'షిప్'. పెద్ద పడవన్నమాట, ఎంత పెద్దదంటే మనరూంత ఉంటుదిలే. పేద్ధ ఊరెళ్ళి చదూకున్నాట్ట.

మరే చిన్నప్పుడే మా తాతయ్య చెరువులో ఈతలు కొట్టేవాట్ట. ఈతంటే ఇప్పుడే మనం స్విమ్మింగ్ పూల్లో ఈతలు కొట్టం! అదన్నమాట. చెట్లెక్కేవాట్ట. కుస్తీలు పట్టేవాట్ట. అంటే బళ్ళో చొక్కాలు చింపుకుంటామే దానికొన్న గొప్పన్న మాట. చద్దణ్ణం తినేవాట్ట... అంటే ఏమో నే తిన్లే. తేగలు తిన్నాట్ట. ఇంకా... చెగోడీలు... బుణ్ణగుంజులూ అవీ. జాంకాయలయితే చెట్టెక్కి మరీ తినేవాట్ట. వా! గ్రేట్.

నాకూ అలా తినాలనుంటుంది. నాన్ననడిగితే అమ్మకి తెలీకుండా మనూరెళ్ళి తిందాం అంటాడు. అమ్మనడిగితే అవన్నీ కంట్రీ ఫుడ్స్ అంటే ఇప్పుడేగా చెప్పా! అనన్నమాట. అవి కాదు, నువ్వించక్కా ఐస్క్రీం తిను, చాక్లెట్లు తిను, పాప్కార్న్ తిను, కోక్ తాగంటుంది. ఎందకనంటే రేపు పెద్దయ్యాక అమెరికా వెళ్తే అక్కడ ఇవే దొరుకుతాయిట. తాతయ్య పన్ను ఒక్కటీ ఊళ్ళేదు. మొన్న ఐస్క్రీం తింటుంటే నాకో పన్నూడింది. టీవీ వాడు చెప్పిన పేస్టు, బ్రష్ వాడినా సరే! డాట్టర్కి చూపిస్తే మళ్ళీ వస్తుందిలే ఫో అన్జెప్పి బోల్డు రూపాయల్దీసుకున్నాట్ట.

చాలా పెద్ద పాఠం చెప్పా. సీగాన పెసూనాంబ నిద్దరోయింది నేను హోంవర్కు చేసుకోవాలి. ఉంటా బై...

(బాపు, రమణలకు... భక్తి పూర్వకంగా నమస్కరిస్తూ) ❁

# రచనా రీతులు

**సుప్రసిద్ధ రచయితలు, వారి రచనా విధానం ఎలా ఉంటుందన్న ఊహకి ఈ రచన పేరడీ.**

**(సర్వశ్రీ ముళ్ళపూడి వెంకటరమణ, మధుబాబు, మల్లాది వెంకట కృష్ణమూర్తి, గుడిపాటి వెంకటాచలం, యండమూరి వీరేంద్రనాథ్)**

### శ్రీ ముళ్ళపూడి వెంకట రమణ

రైలు పరిగెడుతూంది. సెకండ్ క్లాస్ కంపార్ట్‌మెంట్‌లో బెర్త్ మీద రాధ నిద్రపోతూ ఉంది, లేదా యధాశక్తి నిద్రపోతూన్నట్లు నటిస్తూంది.

గోపాళానికి నిద్ర రావట్లేదు. ఆటోచనలన్నీ రాధ చుట్టూ తిరుగుతూంటే నిద్రెలావస్తుంది? ఏం చేయాలో తోచక కిటికీ దగ్గరకెళ్ళి, కిటికీలోంచి బయటకి చూస్తూ కూర్చున్నాడు.

అబ్బ ఎంత బావుందీ వెన్నెల! అచ్చు రాధ కట్టుకున్న చీరలా, తెల్లగా మెరిసిపోతోందనుకున్నాడు పదహారోసారి. టెలిఫోన్ తీగలపై పిట్టల్లేవు. రాత్రివేళ కదా! బహుశ: గూట్లో వెచ్చగా పడుకొని, కబుర్లు చెప్పుకొని నిద్రపోతూ ఉంటాయి.

రైలు శబ్దం విని చేలో వేసుకున్న గుడిశలోంచి ఎంకీ, నాయుడు బావ బయటికొచ్చారు.

ఎంకి చంకలో పిల్లాడు. ఇద్దరూ చేతులూపుతున్నారు, టా,టా చెబుతున్నట్టు. చంకలో పిల్లాడు నోట్లో వేలేసుకుని చూస్తున్నాడు. గోపాళం కూడా చెయ్యూపాడు... అప్రయత్నంగానే.

గోపాళానికి బెంగెక్కువయింది.

"అసలీ రాధ, అంత అందంగా ఎందుకుండాలి?" అంతరాత్మని ప్రశ్నించాడు గోపాళం.

అంతరాత్మ నవ్వింది.

"ఎందుకలా నవ్వుతావు?" కసిగా ప్రశ్నించాడు గోపాళం.

"నవ్వకేం చెయ్యను. నవ్వితే నవ్వండన్నావ్. రాధా, గోపాళం,

బుదుగు&కో అంటావ్ 'జనతా ఎక్స్‌ప్రెస్' రైలెక్కమంటావ్. ఇప్పుడెక్కేసావు. ఇంక దిగలేవుగా!"

గోపాళానికి కోపం నషాళానికంటింది.

"రాధ! ఇంతందంగా ఎందుకుంది? సమాధానం తెలిస్తే చెప్పు. లేపోతే ఫో!" అన్నాడు విసుగ్గా మొహం పెట్టి.

"కోప్పడకు. చెప్తా విను. బ్రహ్మోసారి గోపాళం అనే అబ్బాయిని సృష్టించేసి భూమ్మీదికి తోలేశాడు. పని హడావిడిలో ఆ విషయమే మర్చిపోయాడు. ఇది జరిగిన అయిదేళ్ళకి. అయిదేళ్ళంటే... సరిగ్గా అంతే అని కాదు సుమారుగా నాలుగేడెనిమిది నెల్లు తక్కువగా సరస్వతీ దేవి గుర్తు చేసింది.

"అరెరె! ఇప్పుడెల్లా?" అనుకొన్నాడు బ్రహ్మ.

"ఏం..." అంది సరస్వతి.

"సృష్టిలోని అందమంతా గోపాళంలో పెట్టేశానే... అడ్డెడ్డే... ఇప్పుడెలా" తల పగులగొట్టుకోటం ప్రారంభించాడు బ్రహ్మ.

"మరీ అంత ఇదిగా బుఱ్ఱ పగల కొట్టుకొని ఆలోచించకండి. ఇప్పటికే నాలుగు మూడయాయి. మూడు రెండయేను. సృష్టిలోని అందాలు, చందాలు కొన్ని పుణికి రాధ బొమ్మలో పొదిగితే సరి!" సరస్వతి బుగ్గ సొట్ట బడేట్టు నవ్వి చెప్పింది.

బ్రహ్మ, సరస్వతి వైపు మెచ్చుకోలుగా చూసి, వెంఠనే పని ప్రారంభించాడు. "పువ్వులలోని మృదుత్వం, మకరందంలోని తీపిదనం, లతల్లోని నాజూకుదనం, మెరుపుతీగలోని చురుకుదనం, శారికల వాచాలత, చక్రవాకాల స్నిగ్ధప్రేమ, శార్దూలాల నిర్భయత్వం, కోయిలల కంఠస్వరం, పారిజాతాల సోయగం, తుమ్మెద రెక్కల్లాంటి కురులు, మలయ వీచికల మనోల్లాసం, చిలుకల వక్షోమార్దనం, సూర్యకిరణాల హర్షోన్మత్తత, గండశిలల కాఠిన్యం, పిల్లనగ్రోవిలోని పిలుపులు...

బ్రహ్మ ఇంకా అందాలు వెదుకుదున్నాడు. అంతరాత్మ చెబుతోంది. గోపాళం ఊ... కొడుతున్నాడు తన్మయత్వంతో...❁

## మధుబాబు

షాడో!... షాడో... గొప్ప డిటెక్టివ్. షాడో... పేరు వింటేనే చాలు. నేర ప్రపంచం గడగడ వణుకుతుంది. అది శీతాకాలం కాకపోయినా సరే. అదే శీతాకాలమైతే... వేరే చెప్పాలా!

ప్రైమ్ మినిస్టర్ నుంచి తనకొచ్చిన కాల్ 'కట్' అయిందీ... అంటే అర్థం... ఇది అండర్‌వరల్డ్ 'డాన్' పనే. తనకొచ్చిన 'కాల్' కట్ చెయ్యగల ధైర్యం, దమ్ములు ఇంకెవరికున్నాయి! షాడో మెదడులో వెయ్యి ఆలోచనలు...

షాడో ఒక నిశ్చయానికొచ్చాడు. అది నిశ్చయమో, నిర్ణయమో తిరుగులేదంతే. చకచక 'రెడీ' అయాడు. డ్రాయర్ సొరుగు తీసి చూశాడు. నల్లగా నిగనిగా మెరుస్తూ కనిపించింది. తనలో తాను ఒక్క క్షణంలో... వెయ్యోవంతు నవ్వుకున్నాడు. ప్రేమగా దాన్ని ఒక్కసారి చేతితో తడిమి ముద్దుపెట్టుకున్నాడు. అది పిస్టల్. ఎందరి ప్రాణాలు తీసిందో... ఇంకెందరి ప్రాణాలు తియ్యబోతోందో... డ్రాయ్ సొరుగు మూసేశాడు.

రెండోది... డాగర్. తను ఎక్కువగా ఇదే వాడతాడు. శతృవుల గుండెల్లో... కస్... శబ్దం రాదు. మెల్లగా... చల్లగా దిగుతుంది. బయటకు తీసి చూశాడు. రూమ్‌లో లైటు లేకపోయినా ఎక్కణ్ణుంచో పడుతున్న వెలుగులో తళుక్కున మెరిసింది. అతని వళ్ళు జలదరించింది. ఒక్కసారిగా ఆవేశం కట్టలు తెంచుకొని ప్రవహించింది. కళ్ళు చింతనొప్పులయాయి.

కంట్రోల్! కంట్రోల్!! సినిమాల్లో విలన్‌లాగా ఛీ! ఏమిటి? ఏమిటీ ఆవేశం. మూడే మూడు క్షణాలు. తొమ్మిది క్షణాల్లో మూడోవంతు 'యోగా' చేశాడు. అంతే మనిషి మామూలయాడు.

అయాక ఇక వెనుదిరిగి చూడలేదు. క్షణాల్లో బయటకొచ్చి పోర్టికోలో ఆగి ఉన్న కారు డోరు తెరచి కూర్చుని టకటక గేర్లు మార్చి చూశాడు. కారు స్టార్టే కాలేదు. ఓ 'షిట్' అనుకొని కారు స్టార్ట్ చేసి టకటకా గేర్లు మార్చి రయ్యన గేటువేపు దూసుకుపోయాడు. వాచ్‌మన్ నిద్రపోతున్నాడు. గేట్ ఆటోమేటిగ్గా

ఓపన్ అయ్యింది. ఆధునిక వసతులన్నీ ఉన్నాయి ఆ కారులో.

డెవిల్... మొరుగుతూ పరిగెట్టుకుంటూ వచ్చింది, గేటు దగ్గరికి. అప్పటికే కారు వెళ్ళిపోవడం, గేటు మూసుకుపోవడం క్షణాల్లో జరిగిపోయాయి. నిస్సహాయంగా గేటు దగ్గరే కూర్చుండిపోయింది. దాని కళ్ళల్లో... ఏదో చూపు... ఆ చూపులో...

చీకటి ప్రపంచంలోని నేరచరిత్రులు వికటాట్టహాసం చేస్తున్నట్లు... వికృతంగా అరుస్తూ నృత్యం చేస్తున్నట్లు... ఆ నృత్యం చాలా డిఫరెంట్‌గా ఉంది... బ్రేక్... షేక్... స్నేక్... ఇవేవీ కావు...

మరణ మృదంగం వాయిస్తున్న మృత్యువు ముంగిట్లోకి ఒంటరిగా... నిస్సహాయుడిగా... కారు, చీకట్లో దూసుకుపోతుండగా... షాడో ఆలోచిస్తున్నాడు... ఏదో అడ్డం వచ్చింది కారుకి. ❀ (మిగతాది... వచ్చేవారం)

## మల్లాది వెంకట కృష్ణమూర్తి

**క**ర్నల్ ఏకలింగం ఆర్మీలో పనిచేసి రిటైరయినాడు. ఆయన ఆర్మీలో పనిచేసినంతకాలం ఇండియా, పాకీస్తాన్ గాని, చైనా, పాకీస్తాన్‌గాని చైనా ఇండియాగాని కలిసికట్టుగా కాని విడివిడిగా కాని ఒకదానితో నొకటి 'ఢీ'కొని సరదాగా కాని యుద్ధాలు చేసుకొన్న పాపాన పోలేదు. ఆఖరికి బంగ్లాదేశ్ శ్రీలంక లాంటి చిన్న చిన్న దేశాలతో కూడా ఇండియా యుద్ధం చేసిన పాపాన పోలేదు.

ఒకే ఒక్కసారి మాత్రం శ్రీలంకకి శాంతి సైన్యంతో వెళ్ళే అవకాశం వచ్చినా అదికాస్తా వెంట్రుక కాసిలో తప్పిపోవడంతో చాలా నిరుత్సాహపడ్డాడు ఏకలింగం.

రిటైరయ్యాక ఏం చెయ్యాలో తోచక తుపాకీ పట్టుకొని తిరిగాడు కొన్నిరోజులు. అందరూ 'పిట్టలదొర' అని పిలవడంతో మానేశాడు. కొంతకాలం గోళ్ళు గిల్లుకున్నాడు. అవి మాత్రం ఎన్ని రోజులు వస్తాయి. అందుకని ఆపనీ

మానేశాడు. తరవాత మీసాలు పెంచడం మొదలు పెట్టాడు. మొదట్లో ఇబ్బందిగా ఫీలైయినా రానురాను అలవాటుపడ్డాడు. ఓరోజు అద్దంలో మొహం చూసుకుంటే తన మొహం బదులు ఓ చైనావాడు మొహం కనిపించింది. తన కళ్ళని తనే నమ్మలేకపోయాడు. మీసాలు గుబురుగా, దుబ్బులాగా పెరగటం మానేసి, బొత్తిగా భూమ్యాకర్షణ శక్తికి లొంగిపోయి, నేలచూపులు చూడ్డం మొదలెట్టి సన్నగా తీగల్లాగా సాగుతున్నాయని గమనించి 'కట్' చేయించి పారేసి త్వరలోనే మిస్టర్ 'క్లీన్ ఎన్ నీట్' అనే పేరు గణించాడు.

"ఏం చెయ్యాలా!' అన్న ప్రాబ్లెమ్ మళ్ళీ మొదటికొచ్చి 'ట్రిలియన్ డాలర్స్' కొచ్చనై కూర్చుంది. ఆలోచించగా ఉన్న జుట్టంతా ఊడి బట్టతలయ్యాక ఓ శుభముహూర్తాన బ్రిలియంటయిడియా తట్టింది.

ఆ దెబ్బతో 'ప్రయివేట్ డిటెక్టివ్ ఏజన్సీ' అన్న బోర్డు పెట్టాడు. ఎందుకైనా మంచిదని 'ఇంటర్నేషనల్' అని కూడా చేర్చాడు. మరింత పెద్ద కంపెనికీ ఓ అసిస్టెంటైనా కావాలి కదా! అలా అని ఓ 'యాడ్' ఇచ్చాడు ఓ చిన్న పత్రికలో.

ఈ యాడ్ ఎవరూ గమనించకో, గమనించీ పట్టించుకోకో, పట్టించుకొని మరీ పెద్ద కంపెనీ అనుకొనే ఒకే ఒక వ్యక్తి అప్లై చేశాడు. అతని పేరు జంబులింగం. ఈపేరు తన పేరుకి బాగా మేచ్ అవుతుందనుకున్నాడు ఏకలింగం. సరే అతన్నే పిలిపించి ఇంటర్వ్యూ చెయ్యడం మొదలు పెట్టాడు ఏకలింగం.

"మీ ఏజ్ ఎక్కువగా ఉంది. మీరింత వరకూ ఏ ఉద్యోగానికీ అప్లై చేయలేదా?" ప్రశ్నించాడు ఏకలింగం.

"చేయకేం చాలా చేశాను. అప్లై, అప్లై... బట్... నో రిప్లై..." అన్నాడు జంబులింగం.

"మీరు వాడే దువ్వెన ఏ కంపెనీది?"

"నాకావసరమే రాలేదు..."

"మీరు వాడే హెయిరాయిల్?"

"అంతవసరమంటారా?..."

"ప్రశ్నకు, ప్రశ్న సమాధానం కాదు... అంటూ జంబులింగాన్ని చూశాడు.

అప్పుడు గమనించాడు జంబులింగానిది శుభ్రమైన బట్టతల అని. నవ్వుకున్నాడు ఏకలింగం. తన ప్రశ్నాపత్రంలోని ఆ రెండు ప్రశ్నలూ కొట్టేశాడు.

"ఆఖరి ప్రశ్న. మీరు, మీ బాస్ అఫ్‌కోర్స్ నేనే అనుకోండి. అడవికి వేటకని వెళ్ళి, మర్నాడు వేటాడదామని టెంటులే వేసుకొని పడుకున్నాం. నాకు అర్ధరాత్రి మెలకువ వచ్చి చూస్తే... పైన చంద్రుడు మబ్బులతో ఆడుకొంటున్నాడు, నక్షత్రాలు మినుకు... మినుకు మంటున్నాయి. వెన్నెలగా ఉంది. గాలి చల్లగా వీస్తోంది... నేను మిమ్మల్ని లేపి... ఈ మనోహరమైన వాతావరణం చూస్తే మీకేమనిపిస్తోంది?... అని అడిగితే మీ సమాధానం?" హుందాగా అడిగాడు ఏకలింగం.

"మనం వేసుకున్న 'టెంట్' దొంగలెత్తుకెళ్ళిపోయారనిపిస్తోంది సర్!" ఠకీమని జవాబిచ్చాడు జంబులింగం.

"గుడ్... యూ ఆర్ సెలక్టెడ్... మీరు చాలా ప్రాక్టికల్. అఫ్‌కోర్స్ ఈ ప్రశ్నలో మీకు దొరికిన 'క్లూ' ఏమిటి?"

"టెంటులో పడుకున్నవాళ్ళు కళ్ళు తెరవగానే ఆకాశం... చంద్రుడు, నక్షత్రాలు కనిపిస్తే... దానర్థం అదేగా...

"గుడ్... వెరీగుడ్..." మెచ్చుకోలుగా అన్నాడు ఏకలింగం. ❋

## గుడిపాటి వెంకట 'చలం'

**డి**యర్... నిన్ను చూసి ఎన్నాళ్ళైందో కదా! రోజూ గుర్తుకొస్తావు నువ్వు. ఒక్క క్షణం నిన్ను మర్చిపోవాలనిపిస్తుంది నాకు... నిన్ను మర్చిపోవడమంటే నేను చచ్చిపోవడమేనేమో కదూ!

గోదారి ఇసుకతిన్నెల్లో వెల్లకిలా పడుకొని ఆకాశంలో నక్షత్రాలు లెక్కపెడుతున్న నువ్వు, నదీ తీరం నుండి వచ్చే చిరుకెరటాలు నీ పాదాలను మృదువుగా ముద్దుపెట్టుకుంటున్నప్పుడు, ఏదో మరీచిక మన హృదయాలను

తాకుతున్నప్పుడు, నువ్వన్నావ్ గుర్తుందా!

మబ్బుల పరదాల మాటు నుండి పరిగెడుతున్న చంద్రుడ్ని తెచ్చిమ్మన్నావు. నా ఒడిలోనున్న నీ తలను ఒక్కక్షణం ప్రక్కకు జరిపి లేవబోతూంటే పకపకా నవ్వావు. అప్పుడు నాకర్థం కాలేదు అలా ఎందుకు నవ్వావో! ఇప్పుడాలోచిస్తుంటే, ఛ! నేనెంత మూర్ఖుణ్ణి? అనిపిస్తోంది. నన్ను నేనే తిట్టుకున్నాను. నిందించుకున్నాను. అలా ఎందుకు తిట్టుకున్నానో నీకీపాటికి అర్ధమయే ఉంటుంది.

'ప్రేమ' అనే పదాన్ని ఎవరూ ఇంతవరకూ సరిగా నిర్వచించలేదు. అసలు వీళ్ళకి జీవితం అంటే ఏమిటో తెలిస్తే 'ప్రేమ' ఏమిటో అర్థం అవుతుంది. జీవితానికర్థం ప్రేమయితే, ఆ ప్రేమకర్థం నువ్వే అంటాను.

"If life means Love- Love means you- only, you!"

ఎక్కడో చదివినట్టు గుర్తు. నీవు లేవు. నీ పాట ఉంది. అచ్చం అలాగే వ్రాద్దామని ప్రయత్నించా. ఆ కాటన్ లేదు... ఆనకట్ట ఉంది. ఛ! పేలవంగా లేదూ. ఏం చెయ్యను. నాకంతకన్నా బాగా వ్రాయటం రాదు. నువ్వు ఎదురుగా లేకుంటే... వ్రాయలేను. ఎందుకో తెల్సా! మనసంతా నీపైనే. వెన్నెల్లో రెల్లుపొదల మధ్య మన కుటీరం జాలిగా నన్ను చూసి నవ్వుతుంది. వెన్నెల వెక్కిరిస్తోంది. గుండె పొరల్లో తెలియని బాధ. గుప్పెట్లోకి తీసుకున్న ఇసుక కాలంలా చేతివ్రేళ్ళ మధ్య నుంచి జారిపోతూంది.

నేనింకా బ్రతికే ఉన్నాను.
నువ్వు మళ్ళీ వస్తావనే ఆశతో...
నీ...

# యండమూరి వీరేంద్రనాథ్

అతను నడుస్తున్నాడు... నోరెండిపోతున్నా... నెత్తి మండిపోతున్నా... ఒంటిమీద గోచీ తప్ప మరే ఆఛ్ఛాదనా లేదు. జుట్టు దువ్వి ఎన్నాళ్ళయిందో... కాదు... ఎన్నేళ్ళయిందో. అతని కళ్ళు చింతనిప్పుల్లా... అందులో ఓ కన్ను మసిపట్టిన చింతనిప్పు కళికే. అతడే కనుక ఆ కన్ను తెరిస్తే... ప్రళయం...

అతడి పేరు కాద్రా... కాద్రా మంత్రం వేస్తే అడవిలో పిట్టలు నీళ్ళు త్రాగవు, లేళ్ళూ, పులులూ... సింహాలూ... అన్నీ అంతే ఏదో మంత్రం వేసినట్టు. దెయ్యాలు అతనికి గులాములు. రోజూ వచ్చి సలాము చేసి మరీ పోతూంటాయి.

ఇంకెంత దూరం... సరిగ్గా అక్కడికా శ్మశానం రెండున్నర మైళ్ళు... ఆ అడవి దారమ్మట నడవాలంటే... మాటలు కాదు. అతని కళ్ళలో పగ, కసి, క్రోధం.. అతని పట్టుదల కెదురులేదు. అతని మంత్రానికి తిరుగులేదు.

ఆదివారం... అమావాస్య... అర్ధరాత్రి... మంత్రగాళ్ళకి పర్వదినం... ఆదివారమయినా శ్మశానానికి శలవులేదు. అయినా చావుకి శలవేమిటి? అమావాస్య. మృత్యువుకు తిథితో పనేమిటి? తప్పదు... చావు తప్పదు... ఆఖరకి తనకు కూడా... ఎప్పుడో ఒకప్పుడు... కాని ముందుగా ఆ ముగ్గురూ... తనని తన మంత్రాన్ని తంత్రాన్ని... కాదు... 'క్షుద్ర శాస్త్రాన్నే' అవమానించారు. క్షుద్రమేమిటి? తన కళ్ళముందే ఆ ముగ్గురి జీవితాలూ 'ఛిద్రం' కాబోతూంటే... ఒక్కటే పరీక్ష మిగిలి వుంది.

నెమ్మదిగా తలపైకెత్తి చూశాడు... ఎడం చేతిని కంటికి అడ్డంగా పెట్టుకొని... సూర్యుడు నడినెత్తి కొచ్చాడు. సమయం పన్నెండూ యాభై నిముషాలు అనుకొన్నాడు. చిన్నగా నవ్వుకొన్నాడు. బాధలోని వ్యక్తి నవ్వడమంటే... శ్మశానంలో కాలుతున్న శవం లేచి వికటాట్టహాసం చేయడమే.

తక్షణం ముఖాన్ని అరవై మూడు డిగ్రీల కోణంలో అడ్డంగా తిప్పి... తన ఎడం కన్ను తెరచి అడ్డుపెట్టిన అరచేతితో ఆ కన్ను మీద చిన్నగా రుద్దాడంతే...

ఎక్కడిదో ఓ సన్నని వెలుగు కిరణం... సూటిగా వెళ్ళి ఎదురుగా ఉన్న ఆ ఎండిపోయిన చెట్టును తాకిన క్షణాన... ఫెటేల్... ఫెటేల్...మని చప్పుడు. ఆ చెట్టు నిలువుగా కాలిపోతూంది.

కాద్రా వికృతంగా అడవి మార్మోగేటట్టు నవ్వుతున్నాడు... దూరంగా ఇది గమనించిన వ్యక్తి చెట్లచాటుకి తప్పుకున్నాడు... కాద్రా అతన్ని గమనించలేదు. ❋

(మిగతా... వచ్చేవారం) పెద్దలందరికీ క్షమాపణలతో - రచయిత

# గిరీశం లెక్చర్-1

### ఆన్ టుబాకో టు వెంకటేశం

వై డియర్, బ్రదరిన్లా వెంకటేశం! కన్యాశుల్క చరిత్రకారుడు ఏమన్నాడోయ్!

'పొగ త్రాగనివాడు దున్నపోతై పుట్టున్' అని కదా అన్నది. తిడితే తిట్టాడుగాని ఎంత బాగా తిట్టాడోయ్. సదరు అప్పారావు పంతులుగారు పెద్దమనిషి కనుక అలా గౌరవంగా తిట్టారు గాని అదే నేనైతే ఏమనేవాణ్ణో తెలుసా! పొగ తాగినవాడు పొలిటీషియన్ అయి పుట్టున్. పాపం శమించుగాక! పుస్తకం తీసి ఒక సరికొత్త, ఐమీన్ బ్రాండ్ న్యూ డెఫినిషన్ రాసుకో!

ఇంగ్లీషు వాడికి నోరు తిరక్క పొలిటీషియన్ అని తేలిగ్గా అనేశాడు గాని, నిజానికి 'పోలీట్రీషియన్' అనాలి. ఎందుకంటే, ఈ పదంలో ఒక ఎలక్ట్రీషియన్, మెజీషియన్, ఒక మ్యుజీషియన్, ఒక ఫిజీషియన్, అంతా కలిసికట్టుగా (జమిలిగా) ఉన్నారు. ఓపికుంటే అర్థాలు వెతుక్కుని, ఎలాగబ్బా అని ఆలోచించు. తత్వం నీకే బోధపడుతుంది. పడలేదో నువ్వు 'పోలీట్రిక్స్'కి పనికిరావు. ఒకవేళ పనికొచ్చినా రాణించలేవు. దశ బాగుండి రాణించినా మంత్రివి కాలేవు. దిశ బాగుండి అయినా ప్రధానివి కాలేవు. ఒకవేళ అయినా నీ చేతిలో పవరుండదు. నెత్తిమీద అధిష్టాన దేవత తిష్టవేసుక్కూచుంటుంది.

చుట్ట కాల్చబట్టే కదా తెల్లవాడు స్టీమింజన్ కనిపెట్టగలిగాడని కదా నానుడి. దీన్నిబట్టి నీకేమర్థమౌతుంది... ఎన్ని చుట్టలు కాలిస్తే అన్ని స్టీమింజన్లు కనిపెట్టవచ్చు.

'ఈ సిగిరెట్టుతోనే ఆంజనేయుడు లంకాదహనం చేశాడూ' అని 'ఎవడో కోతలు కోశాడూ...' ఆవంటాన్జెప్పి సదరు సినీకవే స్వయంగా సెలవిచ్చారు. ఎందుకనగా త్రేతాయుగంలో సిగిరెట్లెక్కడివోయ్! లంక వాసులంతా శుభ్రమైన లంక పుగాకు చుట్టలు కాల్చి చుట్టల్తో పాటు కొంపలంటించుకొన్నారు.

బైదబై బ్రౌన్ దొర 'చుట్టరికం' అనే మాటకు అర్థం కూపీలాగాడోయ్.

ఎలాగంటే... చెప్తా! నువ్వేదైనా కొత్త విషయం కనిపెట్టావనుకో ఈ 'పబ్లిక్' ఉందీ చూశావ్! చస్తే నమ్మదు. పైగా నీ మొహం అని పబ్లీగ్గా అనకపోయినా 'వాడి మొహం' అని చాటుగా అంటుంది. అదే ఈ ముక్క నేన్లేదు, ఓ బ్రౌన్ దొరవారు అన్నారను! ముక్కుమీద వేలేసుకుని 'అష్లాగా!' అంటుంది మీ సిస్టర్ బుచ్చెమ్మలాగా.

ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే, లాంగ్ లాంగ్ ఎగో మన విజ్ఞనగరంలో ఓ ఆచారం ఉండేది. ఎవరైనా బంధుత్వం, అదేనోయ్ 'రిలేషన్‌షిప్' కలుపుకోవాలనుకో... ఓప్పదో... ముప్పైవో చుట్టలు కట్టలుగా కట్టి ఎదుటివారికిచ్చేవారు. అందులోంచి ఇటు మగవారు, అటు ఆడువారు తలో చుట్టా ముట్టించుకొని 'చుట్టరికవ' కలుపుకొనేవారుజ

ఈమాట నే కనిపెట్టానంటే ఎవడు నమ్ముతాడు. వెర్రికుట్టినమ్మాలిగాని. అందుకే బ్రౌన్ దొరవారి నిఘంటువులో స్పష్టంగా రాసుందని ఓ రస్సా వేశామనుకో! పబ్లిక్ చచ్చినట్టు నమ్ముతుంది. ఎలాగంటావా!

మరి అప్పారావు పంతులుగారు... "ఖగరుతి అమృతముతేగా... పొగత్రాగనివాడు దున్నపోతై పుట్టున్" అన్న పద్యం(జ్ఞెం) బృహన్నారదీయం నాలుగో ఆశ్వాసంలో ఉంది అని ఓ రస్సా వేస్తే మనం నమ్మామా లేదూ! ఇదీ అంతేనోయ్ చెవలాయ్!

ఈ చుట్టని దేవభాషలో 'కృష్ణకాష్టం' అంటారు. దీనికి 'కాలకాష్టం' అని మరో నామాంతరం కూడా ఉంది. దరిమిలా దేశ కాలమాన పరిస్థితులు మారి ఈ తెల్లవాళ్ళొచ్చి 'శ్వేతకాష్టాలు' అలవాటు చేశారు. అదేనోయ్... 'సిగోరెట్లు'. తర్వాత కాలంలో రెండు వర్గాలు ఏర్పడ్డాయి. చుట్టలు కాల్చేవారిని కృష్ణకాష్టులు... సిగరెట్లు తాగేవారు శ్వేతకాష్టులనిన్నీ వర్గ విభజన జరిగింది.

తర్వాతి కాలంలో స్పీడు పెరిగింది. గజం పొడవాటి చుట్ట నోట్లో పెట్టుకుని తిన్నదంతా అరిగేదాకా అరుగుమీద కూర్చుని కబుర్లు చెప్పుకునే రోజులు పోయి రెండు మూడు పీకులు పీకి, (పీక) అవతల పడేసే రోజులొచ్చి 'బీడీ'లు కనిపెట్టారు. 'బి, రెడీ' అన్న మాటకు అబ్రివేషన్ 'బిడి'. (చూ॥ ఆక్సుఫర్డ్ డిక్షనరీ) ఓల్డెస్ట్ ఎడిషన్ ఇన్ లండన్ సెంట్రల్ లైబ్రరీ (ఆర్) క్వీనెలిజబెత్ పర్సనల్ లైబ్రరీ (ఇఫ్

నాట్) విలియమ్ షేక్సిపియర్ అండ్ వర్డ్సువర్త్ బ్రదర్స్ డిక్షనరీ ఆఫ్ ఆల్‌టైం అబ్రివేషన్స్.

చుట్టలూ, సిగరెట్లూ, బీడీలు ఇలాగు జమిలిగా పేట్రేగిపోతుంటే... కొంతమంది వీటివల్ల క్షయవ్యాధి, కేన్సర్ లాంటి వ్యాధులొస్తాయని ప్రచారం చేసారు. డాక్టర్ల చేత ప్రభుత్వానికి చెప్పించారు... అంటే ప్రజలకి. చివరికి అంతా చేసి 'పొగ త్రాగుట హానికరం' అని వార్నింగిచ్చారు. పన్నులు పెంచారు. పబ్లిక్ ప్లేసెస్‌లో నిషేధించారు. అయినా త్రాగేవారు... పొగత్రాగుట... హా! సుకరం' అని త్రాగేస్తున్నారు.

కొసమెరుపుగా నీకో ముచ్చట చెప్పాలి. మన విజ్జినగరం రాజావారు... ఆనంద గజపతి మహారాజా వారున్నూ... కవులు, పండితులు విశేషించి హరికథా గానకళాపితామహులు శ్రీ ఆదిభట్ల నారాయణదాసుగారు మంచి మిత్రులు. రాజావారితో దాసుగారికి చెలిమి, చనువు జాస్తి. దాసుగారికి చుట్టకాల్చడం అలవాటు. రాజావారికిది ఇష్టం ఉండేది కాదు. ఒకటి రెండుసార్లు చెప్పి చూసినా దాసుగారు అలవాటు మార్చుకోలేదు.

ఇద్దరూ కలిసి రోజూ కోటదాటి నగరం వెలుపలికి వ్యాహ్యాళికి వెళ్ళడం అలవాటు. ఒకరోజు ఇద్దరూ కలిసి ఊరి బయటికి షికారుగా వెళ్ళారు. ఊరి చివర పుగాకు తోటలున్నాయి. ఎక్కడి నుంచో ఒక గాడిద వచ్చి పుగాకు మొక్కలను వాసన చూసి భరించలేనట్లు ఓండ్ర పెడుతూ పరిగెత్తసాగింది. దీన్ని చూసిన రాజావారికి మెరుపులాంటి ఆలోచన వచ్చింది. ఆయన దాసుగారి కేసిచూసి, "చూశారుగా దాసుగారూ! ఆఖరికి గాడిద కూడా పుగాకు అంటే ఇష్టపట్టంలేదు" అన్నారు హేళనగా. దానికి దాసుగారు స్పందించి, "అందుకే దాన్ని 'గాడిద' అన్నారు ప్రభూ" అని వినయంగా నటిస్తూ జవాబిచ్చేసరికి రాజుగారికి ఛళ్ళున తగిలినట్లనిపించినా, ఆయన హాస్య చతురతకు హాయిగా నవ్వేసి మాట మార్చేశారు.

మరో విషయం ఉందోయ్. లెక్చఅలో పిట్టకథ ఉంటేనే మజా! అందుకే చెప్పా. దరిమిలా ప్రభుత్వం పొగాకుపై నిషేధం విధిస్తే ఎలా అనే మీ మాంస వచ్చింది. దీనిపై పండితులు రాజమహేంద్రంలో చర్చ జరిపి పుగాకును

అగ్నిపునీతం చేసి చూర్ణం చేసి ఆవునెయ్యి చేర్చి ఓ 'చిటికెడు' అటు ఇటు నాసికా రంధ్రాల్లో దట్టిస్తే ఏ ప్రమాదమూ లేదని తీర్మానించారు. దీనిపై పరిశోధనలు ప్రారంభించి ప్రయోగాలు చేసి పద్యాలు, శతకాలు, దండకాలు, పాటలు ఒకటేమిటి అన్ని సాహిత్య ప్రక్రియల్లో 'నశ్యాన్ని' మించింది లేదని 'ఢంకా' బజాయించి చెప్పారు.

నాటి ఒక పుగాకు పాకలో ప్రారంభించబడిన నశ్య ప్రయోగశాల, నేటి మేటి టుబాకో రిసెర్చి ఇనిస్టిట్యూట్‌గా పేరు పొందింది. కాబట్టి నువ్వు కూడా డియర్ వెంకటేశం... నా అంతటి వాడివి కావాలని ఆశీర్వదిస్తున్నా... స్వస్తి ❁

# గిరీశం లెక్చర్-2

## ఆన్ టుబాకో టు మధురవాణి

ఎవడంట? ఆ మాటన్నది. వాడి పిలకుచ్చుకుని మాడు పగిలేటట్టు, ధణుతి అదిరేటట్టు, రెండిచ్చుకోవాలి. నువ్వు సాన్దానివంటే... నో... నేనొప్పుకోనుగాక వప్పుకోను. ఒరిజినల్ వర్జీనియా టుబాకో ఆకులా, వర్జిన్లా, నాజూగ్గా కళకళలాడే మధురవాణిలాంటి ఏంజిల్, ఏదీ ఈ భూప్రపంచకంలో ఉంటే నాకు చూపించు.

ముక్కుపొడుం దట్టించిన మాడిపోయిన మారేడుకాయలాంటి వాళ్ళూ, రెండు చేతులా పట్టి నలిపితే లొడలొడలాడే బీడీకట్టలాంటి వాళ్ళున్నూ... సానులంటే... కాని ఇదేమిటి! సాక్షాత్ వ్యాసమహర్షిలాంటి వాడినే మోపపెట్టిన ఘృతాచిలాంటి నిన్ను పట్టుకొని 'సాన్ది' అంటానికి వాడికి నోరెలా వచ్చింది. సాన్ది అంటే ఆరిపోయిన చుట్టముక్క. మరి నువ్వో చర్చిల్ దొరవారి నోట్లో భుగభుగమని వెలిగే హవానా చుట్టలాంటి దానివి. నీలాంటి వాళ్ళని దేవభాషలో 'అప్సరసలు' అంటారు. అంతేకాని 'సానులు' అని బీప్‌గా మాట్లాడరాదు.

డియర్ మధురవాణీ, నిన్ను పొగడ్డం కాదు కానీ, నిఖార్సయిన లంక పుగాకు చుట్టలాగా నువ్వు కాలిపోతూ, దాని తాలూకు ఫ్రాగ్రెన్సు అంటే సువాసనలు

చుట్టుప్రక్కల వెదజల్లుతూ సమాజానికి ఐమీన్ సొసైటీకి సేవ చేస్తున్నావు చూడు, మైహార్ట్ మెల్ట్స్...

నువ్వొక మాటన్నావ్! మాటా అది ఎ డైలాగ్ విత్ గిల్ట్ లెటర్స్. నాతో, "అయ్యా, గిరీశంగారూ, నేను రామప్ప పంతులుగారితో, రామవరంల ఏచి వెళ్ళిపోవడానికి అంతా సిద్ధమైపోయింది. ఒకనుంచీ మీ రూటుమీది నా రూటు నాది... ఈ లైన్ దాటొచ్చి నన్ను 'టచ్' చెయ్యద్దన్నావే, అదీ... వర్జినిటీ. ఇంతకన్నా పతివ్రతా లక్షణం ఏం కావాలండీ... నీలాంటి పరమ పవిత్రమైన పతివ్రతను 'సాన్ది' అనేవాడిని 'గున్దా', చెరువా! డబల్ బారెల్ గన్‌తో వొళ్ళంతా ధన్‌ధన్‌మని తూట్లు పడేటట్టు కాల్చిపారెయ్యాలి.

అయినా కాల్చిపారేసిన చుట్టముక్కలాంటి మొహంలాంటి ఆ రామప్పపంతులు దొరికాడా. ఓసారి నా దగ్గరకొచ్చి హవానా చుట్ట ముక్క అప్పడిగాడు. ఈ గిరీశం అప్పుచ్చుకుంటాడేగాని, ఎవ్వడికీ ఇవ్వడు కదా! కావాలంటే కాల్చే కాల్చే చుట్ట దానమిస్తా తీస్కో అంటే... అదే మహాప్రసాదంలా పట్టుకుపోయాడు. అదీ వాడి స్టేటస్. ఊరికే మాట వరసకి చెప్పా! ఆ సంగతలా ఉంచితే... నిన్ను చూస్తే జాలేస్తోంది.

నాచ్చి, నాచ్చి అంటారు గాని ఈ సొసైటీలో నాచ్చిని అంటనివాడు, చుట్టను ముట్టనివాడు ఎవడైనా ఉంటే, ఏడీ, నాకు చూపించమను. అరచేయి మందం మీగడ తొరకగట్టిన గడ్డపెరుగేసుకొని సుష్టిగా భోంచేసి వీదరుగు మీద కూర్చుని బొబ్బర్లంక పుగాకు పాయొకటి ముడతలు తీసి, సాపుచేసి, చక్కగా నువ్వ జడేసుకునేప్పుడు తలపాపిట తీస్తావు చూడూ, అలా పుగాక్కాడీనలు తీసి నువ్వు జగపాయలల్లినట్టు గజం పొడుగు చుట్టొకటి చుట్టుకొని, కూర్చున్న అరుగు, అరిగేదాకా కాలుస్తూ కూర్చుంటే, నీ ఒళ్ళో తలెట్టుకుని పడుకున్నంత హాయిగా ఉంటుందనుకో.

మధురవాణి మాటొచ్చినా, పుగాక్కాడ టాపిక్కొచ్చినా సబ్జెక్టు సైడ్ ట్రాక్ పట్టి పోతుందనుకో. నాచ్చి మాటకదూ చెప్తూంట మరి చెప్పవే. ఈ లోకంలో నాచ్చి కానివాడెవడు. చర్చిల్ దొరవారు కాల్చే హవానా చుట్టలాంటి చుట్టకాల్చే

ఈ గిరీశం కాడా! మన డిప్టీకలెక్టర్ కాదా! రామప్పంతులు కాడా! హెడ్ కానిస్టేబుల్ కాడా! పోరిసెట్టి కాడా! ఎవరు కాదు?

పగలంతా యాంటినాచ్చులు. రాత్రయే సరికంతా ప్రోనాచ్చులు. మధురవాణి అందానికి, సరసానికి దాసోహం! కాని దాసుణ్ణి చూపెట్టు... ఈ క్షణం నుంచీ, చర్చిల్ దొరవారు కాల్చే చుట్టకానీ, లంక పుగాకు చుట్టకాని చుట్టనని ప్రమాణం చేస్తున్నాను. ఏమిటీ అలా వెళ్ళిపోతావ్! ఓహ్! అగ్గిపెట్టి కోసమా!... అలాగే... తొందరగా తే... ❀

# గిరీశం లెక్చర్-3

### (ఓ రస్సా టు అగ్నిహోత్రావధాన్లు)

**ఒ**హోహో! తమరేనా, సాక్షాత్ శ్రీమాన్ బ్రహ్మశ్రీ వేదమూర్తులు, త్రిమూర్తుల స్వరూపులు... నులక అగ్నిహోత్రావధాన్లుగారు. క్వయిటనెస్పెక్టడ్ అండ్ వెరీఫార్చ్యునేట్ ఇనఫ్. ఇవాళ లేచి ఏ దివ్యపురుషుడి మొహం చూశానో గాని, తమలాంటి దేవతామూర్తుల దర్శనం అయింది.

ఏమిటి మీ ఇంట్లో భోజనం కుదరదా. ఆ, శభిషం లేం మీ దగ్గర పనికిరావా!

అదేమిటండీ! అలా అంటారు. మద్రాసులో డిప్టీ కలెక్టర్ దొరవారు, తమరి బొబ్బర్లంక భూముల ప్రసక్తి వచ్చినప్పుడల్లా మిమ్మల్నే ఎన్నిక జేసేవారు. మీ లంక పుగాకు ముందు వర్జీనియా టుబాకో క్వాలిటీ అనగా నాణ్యత ఎందుకూ పనికిరానిదనిన్నీ... అన్నట్టు ఆ భూములు దావాలో ఉన్నాయిట. దొరవారు, తమరు చప్పన్న వేదాలూ, శాస్త్రాలు చదివిన సద్బ్రాహ్మణులని, తమకు ఆమ్లేచ్ఛ భాషా పరిజ్ఞానం లేదు అందుకని నన్నిక్కడకు పంపి ఆకాగితాలూ గట్రా తర్జుమా చేసి దొరవారికి నివేదవించమని శలవిస్తే వచ్చానుగాని లేదంటే మీ లంక పుగాకుకో, పురుగువణ్ణానికో ఆశపడి వచ్చాననుకున్నారా?

నాట్రయినింగులో అనగా శిక్షణలో మీ అబ్బాయి ఏడిప్టీ కలెక్టరో,

తాసిల్దారో, పోలీసో పరీక్షలు పాసయి, ఈ అష్టూరారం భూములన్నీ కొనేసి... అహ! కాస్సేపు మాటవరస కనుకోండి, పైవేజు తాలుకు ఆ డబ్బులన్నీ తెచ్చి మీ దోసిట్లో పోస్తే... మీరు రొంటిన దోపుకుంటారో... ఇనప్పెట్లో వేస్తారో తెలియదు గాని ఎర్రని ఏగాని నా ఖాతాకి దఖలు చెయ్యరుగదా!

శ్రీమాన్ మహారాజ... రాజ... రాజశ్రీశ్రీశ్రీ నులక అగ్నిహోత్రావధాన్లు గారంటే... నిప్పు. నిప్పులాంటివారని, ఉపనిషత్తులన్నీ ఔపోసనపట్టిన వారనిన్నీ... ఏవో ఇబ్బందుల్లో ఉన్నారని ఆభూములు దావా నుంచి విడిపించి, శ్రేష్ఠమైన నెంబర్ వన్ లం టుబాకో పండించి మద్రాసుకు తోలీసి ఓడల కెత్తించి తెల్లవాడికి, ఓరి! చెవలాయీ లంక పొగాకంటే ఇదిరా అన్జెప్పి వాడు తెల్లమొహం వేసేట్టు చేయకపోతే... తమరి ఆ బోరు... ఏమౌతుంది చెప్పండి. తమరి మాట అటుంచి డిప్టీ కలెక్టుగారి ఆబోరు... మాటేమిటి?

డామిట్... నన్నిలా ఇన్సల్ట్ చేస్తే ఆ అవమానం నాది కాదు. దొరవారిది.

అయ్యో! ఎంతమాట. అయామ్ సో సారీ! ఫరవాలేవు. పడ్డవాడెప్పుడూ చెడ్డవాడు కాదని మీలాంటి పెద్దలే శలవిచ్చారు. మీకు ప్రధమ కోపమని... సజ్జనుల కోసం తాటాకు మంటలా ఘుప్పున వెలిగి చప్పున చల్లారిపోతుందని సుమతకారుడు చప్పనే చెప్పాడు కదండీ.

నో! నాక్కావల్సిన బెస్ట్ క్వాలిటీ టుబాకో సెలక్టు చేసుకుని సిగార్లు చుట్టుకోమంటారా! ఆ చేత్తో మీ శ్రేష్ఠమైన 'నశ్యం' చేసి పెట్టమంటారా! ఆ విషయంలో నాది అందెవేసిన చెయ్యి సుమండీ...

చిత్తం ఆ కాయితాలు గట్రా నా ముఖానపడేస్తే తెల్లారేసరికల్లా తర్జుమా చేసి తమకి నఖలు పరుస్తా. చిత్తం తమకి సంధ్యావందనానికి వేళయినట్టుంది. నేనవన్నీ దోవలో కానిచ్చేశాన్లెండి. నూద్దగర కాళ్ళు చేతులు కడుక్కొచ్చేస్తా!... త్వరగా కానీండి... ఆలస్యం అమృతం విషం...

చూశావా వెంకటేశం... మనతస్సా ఎలా పారిందో! అందుకే కొత్త ప్లేస్‌కి వెళ్ళేముందు నాలుగు విషయాలు ముందే భోగట్టా చేసి అట్టే పెట్టుకోవాలి. నోట్ బుక్ తీసి రాసుకో... ❀

# గిరీశం లెక్చర్-4

## టు లాబ్దావధాన్లు ఆఫ్ మేరేజ్

హలో! మైడియర్ ఎల్డర్ బ్రదర్ హౌ ఆర్ యు. చాలాకాలమయింది కదూ! నన్ను చూసి, అందుకే కొంచెం గుర్తుపట్టడం కష్టం అయి ఉండొచ్చు.

సెవెంటీ ప్లస్‌లో అంటే కాటికి కాళ్ళు జాచుకున్న వయస్సులో తమరు మళ్ళీ పెళ్ళి... అదే వివాహ ప్రయత్నంలో ఉన్నారని తెలిసి సాక్షాత్ వేదమూర్తులైన తమవంటి పెద్దలు 'పునర్వివాహం' తలపెడితే... వరుసకు తమ్ముణ్ణి కదా దగ్గరుండి అన్నీ పన్లూ చూసకోబోతే నలుగురూ 'గ్రాస్' అరగా గడ్డి పెట్టరూ.

మేరేజెస్ ఆర్ మేడిన్ హెవెన్ అన్నారు. అందునా అగ్నిహోత్రావధాన్లుగారి రెండోకుమార్తెను తమబోటి పెద్దలు వివాహ మాడబోతున్నందుకు అమందానందకందళిత హృదయారవిందుడనైతిని, అనుకోండి.

ఇలాంటి ఆనందకరమైన, మధురాతి మధురమైన ఘట్టాల్ని తట్టుకోలేక మీరు కాస్తా 'పుటుక్కు' జరజర డుబుక్కు 'ఢాం' అన్నారనుకోండి. అమంగళం ప్రతిహతమౌంగాక! కీడెంచి మేలెంచకున్నట్లు ఏదో మాటవౌరసకి... దగ్గరుండి అన్నీ చూసుకోవల్సినవాణ్ణి నేనేకదా!

మీలాంటివారికి వరుసకి తమ్ముడిగా పుట్టినందుకు నా జన్మసార్థకమయిందని మద్రాసులో డిప్టీ కలెక్టరుగారు తరచు నాతో అన్డం చాత మనసుండబట్టలేక దొరవారిని శలవడిగి మరీ చక్కా వచ్చాను. ఈ పరగణాలో ఏమాటకామాట చెప్పుకోవాలంటే... మీరంటే గిట్టని వాళ్ళు చాలామందే ఉన్నారు. నాలుగు డబ్బులు వెనకేసుకున్న మీలాంటివారంటే పైకి 'ఓహో' అన్నా లోపల కుళ్ళే కదా అన్నగారూ! మీలాంటి పరమ నీచనికృష్ట, దగుల్బాజీ... కుత్తే కమీనేగాడు మరొకడు లేడని ఎవరన్నా అంటే మనం ఆమాటలు గణించకూడదు. ఏమిటి వింటున్నారా!

ఊరికేవస్తే ఎంగిలి చుట్టా, అప్పనంగా వొచ్చిందని ఆరిపోయిన బీడీ... తేరగా వొచ్చిందని ముక్కుపొడుం పట్టు కూడా వొదలని పరమ పీనాసి చరితులని

ఎన్ననుకున్నా మనం లెక్కచేయకూడదు స్మండీ. మనకి వంబిడీ మిగిలిందా లేదా అన్నది చూసుకోవాలిగాని... వాడిముల్లేం పోయింది. నరం లేని నాలుక ఎన్నైనా అంటుంది. ఏమిటి భేష్ బాగా చెప్పానంఛారా! ఏదో మీ అభిమానం.

తీరా భోగట్టా చేసేసరికి ఆ రామప్పంతులు, తమకి నులక అగ్నిహోత్రావధాన్లు చిన్నకూతురు 'వెంకమ్మ'తో సంబంధం ఖాయం చేశాడని తెలిసింది. తాంబూలాలు కూడా ఇచ్చాక ఇంక ఎంత తన్నుకు ఛస్తే మాత్రం ప్రయోజనం ఏముంటుంది చెప్పండి.

ఆ రామప్పంతులో జాకాల్. అనగా గుంటనక్క. వాడే సంబంధం విషయంలో... అనగా మేచ్ ఫిక్సింగ్‌లో బాగా నొక్కేశాడని లోకం కోడై కూస్తోంది. ఉభయ కర్చులూ వాళ్ళవే అన్నాడా! ఆ పిల్లకి కంటో, కడియమో పెట్టాల్ట. అంతేకాదు పట్టు పరికిణీలు, పట్టులంగాలు... తడిసి... పుట్టె మునుగుతుంది. ఆ పిల్లకి మీది నాలుగో సంబంధం... ఇంతకుముందు ముగ్గురు తాంబూలాలు ఇవ్వకుండానే 'హెల్' అనగా నరకానికి నడక మొదలు పెట్టారు. అలాంటి పుండాకోర్లకి... స్వర్గంలో పడకలు ఏర్పాటు చేస్తారా!

అలాగే... అలాగే... ఎవరికి తప్పినా నాకు తప్పదుకదా! వేదమూర్తులైన తమ దగ్గర ఆంగ్ల ముక్కలు రాకుండా జాగ్రత్త పడ్డా. ఆభారం... ఏది గుంటూరు శాస్తులు పిల్ల. సంబంధం... కుదిర్చే పూచీ నాదీ... ఏది దోవకర్చులరో పాతికో... పోనీ పరకో(పదమూడు) పడెయ్యండి. ఏమిటీ ఇది చెడిపోయి అది కుదిరాక ఇస్తారా! చిత్తం... మీ మాట వేదవాక్కు కదండీ.

(తనలో) ఓరి త్రాష్టుడా! నిన్నడిగాను చూడూ! నన్ను... నేను చెప్పుచ్చుకొట్టుకోవాలి. కూరగాయల బండీ వాడిని, ఇస్త్రీ పెట్టి బండి వాడిని, ఐస్‌ఫ్రూట్ బండివాడిని, చెత్త తోలుకెళ్ళే ట్రాక్టరువాడినీ, చెత్త కాయితాలు ఇనపముక్కలు ఏరుకునేవాడిని,... ఆఖరికి శవాన్ని మోసేవాళ్ళతో... బాబ్బాబు... శవం మీద కూర్చోబెట్టి అక్కడిదాకా తీసికెళ్ళండని 'లిఫ్ట్' అడిగేవాడి మొహం... నువ్వా...

(పైకి) సరే! వస్తా అన్నగారూ... పొద్దెక్కింది. పక్కింటో కాసిని మంచినీళ్ళు తాగి వెళతా! ఉంటా! ❁

# గిరీశం లెక్చర్-5

## (అప్పీల్ టు సౌజన్మారావు పంతులు)

నమస్కారం! తమలాంటి పెద్దల్ని ఈరకంగానైనా కలుసుకోగలగడం చాలా హేపీగా ఉంది. రియల్లీ, ప్రామిస్. చిత్తం తమరంపించిన సమన్లు అందే ఉంటాయిలెండి. అయినా ఇంత చిన్న విషయానికి కోర్టులు, సమన్లు దాకా ఎందుకండీ! తమరా మాటే మా బోంట్లకు శిలాక్షరమున్ను, శిరోధార్యమున్నూ.

సమస్యల్ని సమన్లతో కాక మ్యూచువల్ అండర్ స్టాండింగ్‌తో చర్చిల్ దొరకారు లండన్లో శలవిచ్చారు కదండీ. యస్, మిలార్డ్ అండ్ జంటిల్మన్ ఆఫ్ ద జ్యూరీ, ఒప్పుకుంటున్నాను. నేను ఊళ్ళో పబ్లిక్కి లంక పుగాకు చుట్టలు బాకీపడిన మాట నిజం. చిత్తం! నన్ను నెపోలియనాఫ్ ద యాంటి నాచ్చుని, చర్చిలాఫ్ ద వర్జీనీయా టుబాకో అనీ, జార్జి వాషింగ్‌టన్ ఆఫ ద హవానా సిగార్, అని తమబోటి పెద్దలు ఎన్నిక చేస్తుంటారు.

తమరెలాగైనా గట్టిగా వాదించి నాలుగు వాయిదాలిప్పిస్తే ఎవరి చుట్టల బాకీ వారికి తీర్చేసి ఋణ విముక్తుణ్ణవుతాను. లేదంటే, ఋణ విమోచన అంగారకం గ్రహం స్తోత్రం చదువుతూ జైల్లో కూర్చుంటాను. మీ మాట తీరు చూస్తుంటే, నా మీద మీకెవరో లేనిపోని చాడీలు చెప్పినట్టు తోస్తూంది. అగ్నిహోత్రావధాన్లుగారితో చుట్టలు మానేసి, నశ్యం పీల్చినందుకు కోపగిస్తున్నారా! చిత్తం, ఏదో వారి బాధ పడలేక అలా చేసినా, చాటుగా చుట్టలే కాల్చేవాణ్ణిస్మండీ! దీనికి మైడియర్ బ్రదరిన్లా వెంకటేశం. గం.భా. సమానురాలు మా బుచ్చిమ్మ వొదినగారూ అవసరమైతే బోనెక్కి సాక్ష్యం చెప్పగలరు సుమండీ! (స్మండీ)

ఓహ్! గం భాసా బుచ్చెమ్మొదినగార్ని లేవదీసుకొచ్చానని మీ అభియోగమో! క్వయిటన్‌ఫార్చునేట్! మిలార్డ్! నో! నో! వాట్ ద గాడ్ ఈజ్ డూయింగ్ ఇన్ ద హెల్ ఆర్ హెవెన్?

ద గాడ్ మస్ట్ బి క్రేజీ. ఈ మాట మీనోట విన్నా కాబట్టి సరిపోయింది. ఇదే మరోడూ, మరోడయితే డబుల్ బేరల్ గన్నెట్టి వరొసగా వొళ్ళంతా తూట్లు

తూట్లు పడేట్టు కాల్చి ఉండేవాణ్ణి. లేవదీసుకురావడమన్నా, కిడ్నాపన్నా పెద్ద డిఫరెన్సే ముందిలెండి. ఇంతమాట పడ్డాక, పుగాకులో నికోటిన్ విషం ఉంటుందట. అలాంటి విషంలో చుట్టొకటి ముంచి కాల్చిపారేసి, గిరీశం ద గ్రేట్ కిక్కెడ్ ద బకట్ లాస్ట్ నైట్ అని బిబిసిలో హెడ్‌లైన్స్‌లో చెప్తుంటే యావదాంధ్ర దేశం విషాదంలో మునిగిపోతే, మీరు, అయ్యో ఎంతపని జరిగింది. ఈ హేండ్‌సమ్ యంగ్‌మాన్‌ని అనవసరంగా సస్పెక్ట్ చేశానే! అని తెగ ఫీలయినా ప్రయోజనం శూన్యం... బిగ్ జీరో కదా!

ప్రామిస్ యువరానర్! ఆన్‌మై ఆనెస్టీ అని ఎవడన్నా అంటే నమ్మితీరాలి. హియర్ మి మిలార్డ్ అండ్ జంటిల్మన్ ఆఫ్ ద జ్యూరీ... పరమ పవిత్రమైన బుచ్చెమ్మొదినగారి మెప్పించి, ఒప్పించి, రాణ్మహేంద్రవరం విధవా కల్యాణ పంటపంలో అంగరంగ వైభవంగా విధవా వివాహం చేసుకుని (అటు శాశ్వతమైన కీర్తి, ఇటు ప్రభుత్వం వారిచ్చే గ్రాంటు పుచ్చుకుని) మీలాంటి పెద్దలచే అమోఘమైన ఆశీస్సులు, శాశ్వతమైన యశస్సు పొందుదామని మీ చెంతకొస్తే మీరు నన్నిలా ఇన్సల్ట్ చేయడం వరిజనల్ వర్జీనియా టుబాకో లాంటి నన్ను, గుంటూరు మెట్టపుగాకు కాడతో పోల్చడం మీ విజ్ఞతంకో ఛాలెంజ్.

ఏమిటి నాలో కలిగిన ఈ రిఫార్మటీకి తమకు ఎంతో హేపీ ఫీలవుతున్నారా! ట్రూ రిపెండెన్సీకి ఒన్ మినిట్ చాల్దుటండీ. థాంక్ గాడ్... మీరైనా నన్నర్థం చేసుకున్నారు... ఈ గుడ్ న్యూస్ కాస్త మధురవాణి చెవిని వేసి వస్తా! ఓ! సారీ... 'బుద్ధి' చూశారూ ఎలా కప్పదాటు వేసి మన చేత గంతులేయిస్తుందో. అసలు ఇన్నాళ్ళూ నెపోలియన్ ఆఫ్ ది యాంటినాచ్చనిపించుకొన్న నేను, సైతానుకు వొంగిపోయి... ఒకానొక బేడ్ టైంలో దాని వల్లో పడి యాస్‌ను గూస్‌ను అయిపోతిని కదా! తల్చుకుంటే నాకే ఆశ్చర్యంగా ఉంది. పొరపాట్న హవానా చుట్టనుకొని, లంకపుగాకు చుట్ట కాల్చినట్లయింది గదా. మేన్ మేక్స్ ది మిస్టేక్ అన్నాడొక ఆంగ్లకవి. బట్ ఈ గిరీశం సింపుల్‌గా మేన్ కాదే! 'హీమాన్'! ఇలాంటి గిరీశమే తప్పు చేస్తే కామన్‌మేన్ చెయ్యడం నో వండర్ ఎటాల్.

తప్పు చెయ్యడం తప్పుకాదు. దేముడు మన తప్పుల్ని క్షమించాలంటే...

మనమేం చెయ్యాలి. మొదటగా తప్పు చెయ్యాలి. మనల్ని క్షమించి పారేసే ఛాన్స్ దేముడుకివ్వాలి గదా! బట్ చేసిన తప్పు రిపీట్ చేసి కన్‌ఫెషన్ కెళ్ళడం తప్పు అన్నాడు ఫాదర్ మేత్యూస్. దట్స్ ద రియల్ రిఫార్మిటీ అని కూడా అన్నాడు.

కనుక ఫ్రం టుమారో ఆన్‌వర్డ్స్... సారీ ఫ్రంటుడే ఆన్‌వర్డ్స్, అగైన్ సారీ ఫ్రం నౌ ఆన్‌వర్డ్స్... ఫ్రం దిస్ మొమెంట్ అయామ్ ట్రూ లవర్ ఆఫ్ బుచ్చెమ్మ అండ్ ట్రూ నెపోలియన్ ఆఫ్ యాంటి నాచ్చి, ఆన్ మై ఆనెస్టీ ఐ ప్రామిస్ యువరానర్. ❁



# న్యామ్యూజింగ్స్

నీకు ఆకలేసింది. నన్ను పిలిచావు. నేను వినబడనట్టు నటించాను. కఠినమైన నేలను దున్ని, దూరాన్నించి నీటిని తెచ్చి, విత్తులు వేసి పంటకోసి దంచి ఆహారం వండుకు తిని ఆకలి తీర్చుకొన్నావు.

నా గురించి అడగాలనిపిస్తే, కాస్త ఆలోచించు, పెద్దవాళ్ళు చెబితే అర్థం కావడం లేదా! అక్షరాలు నేర్చుకో... పుస్తకాలు చదువు. దీపం వెలిగించి చూడు నేను కనపడతానేమో.

ఆకలి కోసం అంత కష్టపడ్డవాడివి, 'జ్ఞానం' కోసం కాస్త ఇష్టపడు. ఒకటి కడుపు నింపితే, వె(ర్రివాడా! రెండోది మనసు నింపుతుంది. కాకపోతే ఆ రెండోది నీకు ఉండాలి!

“నీకా పరిమళం, ఆ నునులేతదనం, ఆ రంగులు, అంతటి చక్కదనం ఎందుకు?” అడిగాను ఆ పువ్వును పలుకరిస్తూ...”

“ఇవన్నీ లేకపోతే, నువ్వు / మీరు నన్ను గుర్తించి స్వామి పాదాల చెంతకు / వద్దకు చేర్చరు గదా!” అన్నదా పువ్వు నవ్వుతూ.

❁ “అద్దంలో చూసుకొంటే నీకు నువ్వు కనపడతావు–

❁ మనసులోకి చూసుకుంటే నువ్వు వెతికే వాడికి, నువ్వు కనపడతావు.”

❁ నేనేడిస్తే పాలిచ్చింది, అన్నం పెట్టింది... అక్షరాలు నేర్పించి అన్ని చేస్తూ, తానందుకే పుట్టానంది. మరి నేను...

ఆ అమృతమూర్తికి తలకొరివి పెట్టాను.

❁ ఓ రోజు రాధ కనపడి, “నా కన్నయ్య ఎక్కడన్నా కనిపించాడా!” అని అడిగింది. “నేను, ఆ కోనేటి నీటిలో ఆ నీలి కలువను, నీలాకాశాన్ని, ఓరగా పింఛాన్ని ఆరవేసుకుంటున్న నెమలిని చూపించాను.

రాధ, ఆనందంతో గంతులు వేసుకొంటూ వెళ్ళిపోయింది.

❁ ఎవరో అడిగారు, మీకెప్పుడయినా కృష్ణ పరమాత్మ మురళీగానం

వినిపించిందా అని!

నా గుండె చప్పుడు వారికి వినిపించాను.

భగవంతుడు కరుణామయుడు. నిజం!

❀ ఆ సాగర'ఘోష' పెడుతూనే ఉంది... యుగాల నుంచీ.

నేను పుట్టగానే ఏడిస్తే... నాకో అమ్మనిచ్చాడు.

❀ "ఎందుకమ్మా! ఆ పొయ్యిలోపడి అంత భగభగా మండుతున్నావు ఎంతో ఉత్సాహంగా – అడిగాను ఆ మండుతున్న కట్టెను.

"మరి కాసేపట్లో ఆ ఉడికిన అన్నంతో నా బిడ్డల ఆకలి తీరుతుందిగా – అన్నదా కట్టెపుల్ల.

❀ ఒకసారి నది దగ్గర దాహం తీర్చుకొంటుంటే, ఆ దయామయుడు వచ్చాడు.

"ఇంత నీరు నాకెందుకిచ్చావు?" అని ప్రశ్నించాను.

"నీ దాహం తీర్చుకోడానికి అన్నాడాయన.

"నాకు గుక్కెడు చాలు కదా! మరీన్ని నీళ్ళు..."

"తోటివారి దాహం తీర్చు. అన్నట్లు నీకిచ్చిన సంపదా అందుకే..." అంటూ నవ్వుతూ వెళ్ళిపోయాడు.

❀ "ప్రభూ! నీ చేయూత నాకు కావాలి!" అన్నాను ఎంతో వినయంతో ఆ ప్రభువుకి రెండు చేతులూ నమస్కరిస్తూ.

"ముందు నీ చెయ్యి నాకందివ్వు" అన్నాడు ప్రభువు నవ్వుతూ.

అప్పటికీ స్ఫురించలేదు నాకు, సాయంకోరేవాడు, సాయం అందించాలని.

❀ దేముడు కనిపించి ఏం కావాలో కోరుకో అన్నాడు.

"స్వర్గ సుఖాలు" అన్నాను తడుముకోకుండా.

"అవన్నీ ఎప్పుడో ఇచ్చాను" అన్నాడు దేవుడు ప్రశాంతంగా.

సందేహంగా చూశాను దేముని వైపు.

పిచ్చివాడా! నీ తల్లి ఒడిలో... అన్నాడు దేముడు.

నేను అవాక్కయ్యాను. దేముడు మాయమయాడు.

❀ దేవుడు నవ్వుకొంటున్నాడు.

"దేవా! మీ చిరునవ్వుకు అర్థం ఏమిటి అడిగింది దేవేరా.

"వాళ్ళకేం కావాలో వాళ్ళకి తెలియదు. నేనిస్తాగా, సమయంవస్తే వాళ్ళకి కావాల్సినవి!" అన్నాడు దేముడు.

"పాపం! పిచ్చివాళ్ళు" అంది దేవేరి జాలిపడుతూ.

"కాదు. నా భక్తులు..." అన్నాడు దేవుడు నవ్వుతూ.

❀ "ఓ చెట్టూ ఎందుకేడుస్తున్నావ్!" ఆ కన్నీళ్ళెందుకు–

ఏడుపు కాదు. మీ ముత్తాతగారు వచ్చినా నీడలో సేద తీరేవారు. మీ తాతగారు నా నీడలో కూర్చుని పళ్ళు ఏరుకుని తినేవారు. మీ తండ్రిగారు వ్యవసాయానికి నా చేతులు, వరికి కర్ర కలపగా వాడుకున్నారు. నీవు నా "మూలాన్నే" కాల్చి బొగ్గు బూడిద చేస్తున్నావు. ఈ బూడిద నుంచి నన్ను మళ్ళీ పుట్టించమని నీళ్ళులేవుగా, అందుకని నా కన్నీళ్ళతో ఆ ప్రభువుని ప్రార్ధిస్తున్నానందా చెట్టు తల్లి.

❀ "నాకు అందకూ ఒక్కటే, రండి నా 'నీడ'లో సేద తీరండి. మీరు నావారు; నా ఆత్మీయులు" అంటూ తన చేతులూపి దీవనలు దీస్తూ– అన్నట్టు దాని పేరు చెట్టు.

నాకు ఎవ్వరూ లురు. నా 'మేడ'లో మీకు స్థానం లేదు. తల్లి, తండ్రి, బంధువులు అంటూ తన మనసు తలుపులు మూస్తున్నాడు– అన్నట్లు, వాడి పేరు మనిషి.

❀ "ఓ దేవుడా ఎక్కడున్నావ్! ఒక్కసారి కనపడు"

"ఇక్కడే నీ పక్కనే, నీ ఎదురుగా..."

"కనపడవేం?"

"నీకు దాహం వేస్తే దోసలి పట్టి అడిగావు – గుర్తుందా
నీకు ఆకలి వేస్తే పిడికెడు అన్నం మెతుకులు అడిగావు – జ్ఞాపకం లేదా
చీకటి 'భయం' అంటే వెలుగునిచ్చాను – మర్చిపోయావా!
నీకేం కావాలంటే అది ఇచ్చాను... ఇస్తున్నా... గుర్తు తెచ్చుకో!
నువ్వు కళ్ళు మూసుకుని నేను కనపడటం లేదంటే..."

❀ ఒంటరిగా మా వూరి చెరువు గట్టు మీద కూర్చున్నా ఆ సాయంకాలం.

చాలా ఏళ్ళయింది! పలుకరించింది చెరువు.

ఏమిటి విశేషాలు - అన్యమనస్కంగా అడిగా!

"చాలా పెద్దవాడివయావు. చిన్నప్పుడు నా గట్టుమీద ఆడేవాడివి. ఈతలు కొట్టేవాడివి. నీకు కలువ పూలు, ఇచ్చేదాన్ని... ఎన్నో పక్షులు నా ఇంట్లో కాపురమున్నాయి. చేపలు, తాబూళ్ళు అన్నీ... నామీద నుంచి వీచే చల్లగాలితో మీరంతా వెన్నెల్లో హాయిగా నిద్రపోయేవారు. మీ ఆడవారంతా చక్కగా రోజే ఉదయం సాయంత్రం నా నీళ్ళు తాగి పనీపాటలు చేసుకొనేవారు. కరెంట్ తెచ్చుకుని ఇంటికే నీళ్ళు తెచ్చుకొని నన్ను మరిచిపోయారు. నా గట్టుమీద ఆ చెట్టును - నేనిచ్చే పువ్వుల్ని వద్దని... రసాయనాలు కలిపి చేపల్ని పెంచారు. ఇప్పుడు నా నీరంతా కుళ్ళిపోయింది. నన్ను పూడ్చి 'బస్టాండ్' కడతారటగా."

"అవును..." అన్నాను నిర్లిప్తంగా...

"మీ కొంపలు అంటుకొంటే నీళ్ళెవరిస్తారు బాబూ!" అడిగింది ఆ చెరువు.

నా గుండెలో గులకరాయి పడింది! చిన్నప్పుడు నే చెరువులో విసిరిన రాయిలా.

❋ ఆమె నల్లగా ఉంది. చల్లగా ఉంది. వర్షించే కరుణలా ఉంది.

ఎవరు నువ్వు?

నేను మేఘాన్ని.

ఏమిస్తావు నాకు?

నీరిస్తాను. నీ దాహం తీరుస్తాను.

ఆమె పచ్చగా ఉంది. అందంగానూ ఉంది. రంగు రంగుల పువ్వులు, పళ్ళు అలంకరించుకొని ఆప్యాయంగా అన్నం పెట్టే అమ్మలా ఉంది.

ఎవరు నువ్వు?

నేను వృక్షాన్ని.

ఏమిస్తావు నాకు?

నీడనిస్తాను. ఆకలి తీరుస్తాను.

అంతేనా! ఇంకేమీ ఇవ్వలేవా.

అంతే బాబూ! నిరాశగా జవాబు చెప్పాయి.

ఆమె ధగధగలాడిపోతోంది. మనోహరంగా ఉంది. గర్వం, డాబు, దర్పం, ఠీవి, పొగరు, నిర్లక్ష్యంతో ఒక వర్ణించలేని రూపంతో ఉంది.

ఎవరు నువ్వు? నీళ్ళు నములుతూ నెమ్మదిగా అడిగాను.

నా పేరు 'డబ్బు'. నన్ను ధనం అంటారు.

ఏమిస్తావు నాకు. ఆశగా అడిగాను.

నువ్వు కోరినవన్నీ...

అంటే...

అంటే... నువ్వు ఏది అడిగితే... అది...

అయితే నువ్వురా! మీరు పొండి. నీటిని, చెట్టుని తరిమేశాను.

కొన్నాళ్ళకి ఆమె ఇంకా మెరిసిపోతోంది పిచ్చి అందంతో, యవ్వనంతో, కోరికలతో...

నన్ను నేను చేసుకుంటే, నా యవ్వనం, నా రక్తం, రూపం, నా బలం అన్నీ పోయాయి.

"నన్ను నువ్వు తినేస్తున్నావు" అన్నానొకరోజు ఆమె పాదాలమీద పడి.

"నేను బతకాలంటే... నిన్ను తినాలిగా" అంది; నిర్లక్ష్యంగా నన్ను ఒక తన్ను తన్ని. ❁



# నా ఎమ్యూజింగ్స్

## నవరతనాలు

1) గొప్పోడు ఎంత అప్పు చేస్తే అంత గొప్ప
బీదోడు ఎంత అప్పు చేస్తే అంత తప్పు

2) గొప్పోడు కల్లు తాగినా పాలు అంటారు
బీదోడు పాలు తాగినా కల్లు అంటారు

3) గొప్పోడు ఆడితే సరదా
బీదోడు ఆడితే దురద

4) గొప్పోడు పచ్చగడ్డి తిన్నా ఆరోగ్యమే
బీదోడు పరమాన్నం తిన్నా ఆ అనారోగ్యమే

5) గొప్పోడు వేట కెడితే ఆట
బీదోడు వేట కెడితే గడవడానికి పూట

6) గొప్పోడు సినిమాలు తీస్తాడు
బీదోడు సినిమాలు చూస్తాడు

7) గొప్పోడు సినిమాల్లో నటిస్తాడు
బీదోడు సినిమాల్తో జీవిస్తాడు

8) గొప్పోడు జోకితే నవ్వుతారు
బీదోడు జోకితే నవ్విపోతారు

9) గొప్పోడు ఎప్పుడూ కారులో వెడతాడు
బీదోడు ఎప్పుడయినా షికారు కెడతాడు

1) పైకం
వదిలింది
మైకం
పట్టుకుంది

2) అర్ధ రూపాయి
అర్ధం రూపాయి
అనర్ధం రూపాయి
పరమార్ధం రూపాయి
ఇహపరమార్ధం రూపాయి

3) పుడుతూ ఏడుస్తారు
పోయాక ఏడుస్తారు
ఏడుపుల జీవితాలకి
వేడుకలు ఎందుకో!

4) ముద్దు తాగిన
అధరం మధురం
పొద్దు మూగిన
అంబరం రుధిరం

5) మరుడికి అయిదు,
వింటి తూపులు
మధువకు ఒకటే
ఆమె కంటిచూపు

6) శివుని జయింప
మరుడు దగ్ధమయాడు
శివుని జయించి
మగువ 'అర్ధ' అయింది

7) భగవత్‌గీత దాటితే సుఖం
భగవద్గీత చదివితే మోక్షం

8) మధువు తాగినా
మగువ తాకినా
మగాడు చిత్తు

9) ఏడు రంగులున్నా
ఇంద్రధనస్సు క్షణ కాలం
మూడురంగులే ఉన్నా
జాతి పతాకం కలకాలం

10) గోతిన పడినా
నాతిని తాకినా
పైకి లేవడం
ఎంతకష్టం!

11) ఆ బాణా సురుడికి వేయి చేతులు
నా భార్యామణికి వేయిరీతులు

12) ఓ! అన్నా
ఓ! అన్నొ
నేనున్నా అంటే
దేముడే

13) రెప్పపాటు
ప్రయాణానికి
కప్పదాటు
పయనానికి
చెప్పలేనన్ని తిప్పలు
చెప్పుకోలేనన్ని తప్పులు

14) ఆనందానికైనా
విషాదానికైనా
కన్నీటి చుక్కలే
కొలమానం!

15) చలినీ కొలుస్తారు
చీకటినీ కొలుస్తారు
భార్యాభర్తల 'ప్రేమ'కి
కొలమానం ఎవిటిట?!
"చిలకల తాంబూలం"

16) కాలానికి
కాళ్ళు
గడియారంలో
ముళ్ళు
కాలానికి
కళ్ళు
పగలు
రాత్రి

17) కళ్ళు
కెమెరా
మనసు
ఆల్బం
జ్ఞాపకాలు
ఫోటోలు

18) అందరికి
అద్దం
చెబుతుంది
అబద్ధం

19) మూగమనసున
మాట ఊరదు
చెవిటి చెవులకు
మాట చేరదు

20) కన్నీటి పొంగుకి
ఆనకట్ట చెంగు

21) ఇంతి కన్నులు
ఇంతింత
పెదవి మధువింత
తాగినంత!

22) జీవితం
గుడి
భర్త
దేముడు
భార్య
పూజారి
ఆడపిల్లలు
మణిదీపాలు
మగపిల్లలు
గుడిగంటలు
బంధువులు
భక్తులు
నైవేద్యం/ ప్రసాదం
నెల జీతం

23) ఎన్ని
బోధలు విన్నా
మనిషి మారడు
ఎన్ని
బాధలు పడినా
ఆశ చావదు

24) ఎవరన్నారు
ప్రియురాలు
తీపి అని!
నా కన్నీటిని
తాగి చూడు
ఎంత ఉప్పనో!

25) ప్రేమ
వికసించినా
వికటించినా
ప్రేమికుడు
సార్థక నామధేయుడే!

26) వ్యసనాలు
ఏడు
ఒకటి
చాలు
మనిషిని
ముంచడానికి

27) ప్రేమ
సుఖాంతం
దు:ఖాంతం అంటారు
ప్రేమకు
అంతముందా!

28) శివునికి చేస్తే
అభిషేకం
శవానికి చేస్తే
స్నానం

29) చిన్నప్పుడు
నేర్చిన
గోడకుర్చీ
వెస్ట్రన్‌కి
పనికొచ్చింది

30) రాత్రి
ముద్దలింతలు
పొద్దుటే
ఆవలింతలు

31) నేను
ఎ.కె ఫార్టీ సెవెన్
ఆరడుగుల బుల్లెట్
అర టన్ను ఆటం బాబు
అయినా!
నీ కంటి చూపుకే
కూలిపోతాను
మగువా!

32) రోగం
కుదిరితే
రాగం
ముదిరితే
వైరాగ్యం
మంచిదే
వైకుంఠం

33) కోడి
పండగొచ్చిందని
సంబర పడి
కొప్పెక్కి కూసింది
అల్లుడొచ్చాడన్న
ఆనందంతో
కుర్మా కూరయింది.

34) ఆనందంతో మందు
పరమానందో పదిమందితో
మహదానందో మహామందితో
అమితానందో అందరితో

35) ఆమె
పెదవులు ఎంత
తీపి!
తిట్టినా
తియ్యగా
ముద్దు
పెట్టినా

తీపిగా
అందుకే
నాకు
తొందరగా
షుగరు
వచ్చింది

36) యవ్వనం వృద్ధాప్యం

1. యవ్వనం ఉరకలు వేస్తుంది
వృద్ధాప్యం గురకలు పెడుతుంది
2. యవ్వనంలో తీపి మూలుగు
వృద్ధాప్యంలో నడ్డి నీలుగు
3. యవ్వనం ఎగసిపడే అల
వృద్ధాప్యం చెదిరిన కల
4. యవ్వనం ఎవరినీ లెక్కచేయదు
వృద్ధాప్యంలో ఎవరూ
లెక్కచేయరు
5. యవ్వనంలో ఆమె రాగమయి
వృద్ధాప్యంలో ఆమే
రోగమయి
6. యవ్వనంలో పాలగ్లాసు
వృద్ధాప్యంలో మందు గ్లాసు
7. యవ్వనంలో చూస్తారు చంద్రుని వంక
వృద్ధాప్యంలో చెబుతారు ఏదో వంక
8. యవ్వనంలో చెప్పుకొనే గుసగుసలు
వృద్ధాప్యంలో చెప్పకనే రుసరుసలు
9. యవ్వనంలో వస్తారు వృద్ధిలోకి
వృద్ధాస్యంలో వెళ్తారు సిద్ధిలోకి
10. యవ్వనంలో పుట్టిన పిల్లలు
వృద్ధాస్యంలో పేరుస్తారు పుల్లలు

37) ఉదయ సంధ్య
సూర్య కిరణాలు
బంగారు జలవారు
చీర అల్లితే
సాయం సంధ్య
ఆ చీరకి నక్షత్రాలు అద్ది
సింగారించుకొని
చందమామ కోసం
ఎదురు చూసింది

కవి కళ్ళతో
చూడలేనప్పుడు
కవి కళ్ళు లేకున్నా
చూడగలడు

ఓ స్త్రీ!
కార్యేషు శక్తీ
విద్యేషు వాణీ
ధనేషు లక్ష్మి
రూపేషు రంభ
క్రోధేషు అగ్ని
కామ్యేషు సురభి
పుత్రేషు మాత:
కరుణేషు మేఘ
ఫలేషు వృక్ష
భోద్యేషు మిత:
లాస్యేషు శశి:
భోగేషు నారీ
కుచేషు కుంభ:
సహమేషు పృధ్వీ
సేవేషు ముక్త:
వివిధేషు శత:

## ఓ స్త్రీ!

కార్యేషు శక్తి
విద్యేషు వాణీ
ధనేషు లక్ష్మి
రూపేషు రంభ
క్రోధేషు అగ్ని
కామ్యేషు సురభి
పుత్రేషు మాతః
కరుణేషు మేఘం
ఫలేషు వృక్షి
భోద్యేషు మతః
లాస్యేషు శశిః
భోగేషు నారీ
కుచేషు కుంభః
సహవేషు పృధ్వీ
శీలేషు ముక్తిః
వివిధేషు శతః

**ఆ**కాశం
నీలంగా ఉంది
నారాయుడిలా
నక్షత్రాలు
పాలకడలి చిందిని
చినుకులు

**మ**రువలేని స్నేహాలు
మరుగున ఎడకుండ
జ్ఞాపకాల ఫలకాలు
ఇరుగున ఉంటాయి
వెగిరి పోదులే స్నేహక్షీరం
వెలుగుతూనే ఉండు
నీ 'తోడు'గా కమ్మని
మీగడల తరగలుగా...

# వృద్ధాప్యం వచ్చినట్లే..

1. రామా కి
రమ్యకృష్ణ
రామాకృష్ణా
అనుకొంటే... వృద్ధాప్యం

2. పురాణం సీత
అమ్మాయి అనుకొని
ఫోన్ చేసి
కంగారు పడితే... వృద్ధాప్యం

3. పార్కులో కూచొని
పడుచు పిల్లని
పలకరించాలని
ఆరాటపడితే... వృద్ధాప్యం

4. రూలింగ్ పార్టీ
రేట్లు పెంచిందని
అప్పొజిషన్ని
అప్పు అడుగుతానంటే...
వృద్ధాప్యం

5. ఇంట్లో ఎవరూ
పట్టించుకోక
ఫస్ట్ డ్రిఫరెన్సే పోటు
లాస్ట్ డ్రిఫరెన్స్ కొస్తే...
వృద్ధాప్యం

6. ఇంట్లో ఎవరికేదేనా
చెబితే మీకు తెలియదు
మీరూరుకోండి అంటే...
వృద్ధాప్యం

7. క్రికెట్ ఆటలే
వికెట్ పడిందని
ఆలి మీద అలిగి
కాఫీ మానేస్తే...
వృద్ధాప్యం

8. కొత్తవాటి కన్నా
పాతపాటే మిన్న
కొత్త పాటే మిన్న
కొత్త వరాన్ని, ఐక
కత్తిరించినీ ఊవం- అంటే...
వృద్ధాప్యం

9. చీటికి మాటికి
చిట్టీ! కాస్త కాఫీ
వంటింట్లో ఇల్లాలిని
నట్టింట్లోకి పిలిస్తే...



10. పార్కులో కూచుని
పొద్దుట పేపర్లో
విషయాలన్నీ
ఏకరువు పెడుతుంటే...

11. అమ్మాయి వేసుకున్న
డ్రెస్సు చూసీ చూడక
అబ్బాయి నీకోసం
మీ ఫ్రెండ్ వచ్చాడ్రా అంటే...
వృద్ధాప్యం



12. కంప్యూటర్ ముందు
కంగారు పడుతూ
ఒకటి నొక్కబోయి
మరొక్కటి నొక్కితే...
నిర్ఘుంగా...



# ఈ గిరీశం లెక్చర్ ఆన్ ఆస్సెం! అను బాపు - రమణ

**అ**ల్లోవల్లో జస్టెమినిట్.. ఎంటల్లా అయిరానా పడుతూ రన్నింగ్ చేత్తే హెల్త్ దోబ్బ తింటది. దాంతో వెల్త్ కూడానూ. ఓ పాలి అలా ఆకాసంలోకి లుక్కేసుకుంటే సెందురుడు మాంచి గ్లాస్కో పంచి లాంచీ వేసుకుని సుక్కల ఏటకి బయలుదేరినట్టు లేదూ. పశువులే కళాపోసణ సేత్తంటే మనుసుల మాయాక మనమాపాటి సెయ్యేద్దూ... ఇదొక వొరస! ఇది ఎవరి స్టైల్ అంటే ఇట్టే చెప్పచ్చు. నేను చెప్పటం దేనికి.

ఇదిగో బుచ్చెమ్మనో కాసింత నా మాట ఇనాకోపోతే నామీదొట్టే ఆఁ... ఏలుకున్నావో... ఆ గిరీశం ఉన్నాడే ఆడియన్నీ వొట్టి బూటకం మాటలు నమ్మమోక. నమ్మావో నట్టేట్లో ముంచుతాడు. అసలియన్నీ నీకు నేను చెప్పాల్సినొవసరం ఏటి అంటావా? బలే దానివే వొదినా మనం మనం సుట్టాలం. నీ బాగోగులు నాక్కాపోతే ఎవరికి సెప్పు. నిన్నిట్టా సూత్తంటే నా గుండె తరిగిపోతాంది. నువ్వు కాంత ముకాన బొట్టెట్టుకుని వోయిల్ సీర వొంటికి సుట్టుకున్నావనుకో వచ్చం సినీస్టార్‌లా ఉంటావ్. ఇంకా ఆడొచ్చి వొరగబెడతాడనె కలలు కంటా కూకున్నావేవో.

ఏంటి... ఎవరు సెప్పారంటావా! లోకం కొక్కొరొకో అని కోడి.. కోడై కూత్తంది వొదినా! నీకెలా చెప్పాలో దేవుడోయ్!

ఇది ఎవరి స్టైల్;

దేర్‌ఫోర్ పైన చెప్పిన రెండు ఎగ్జాంపిల్స్ వల్లా మనకర్థమయింది ఏమిటంటే నటించే మనిషిని బట్టి డైలాగ్స్ రాయటం. అంటే ఒరిజన్ పాటకి ట్యూన్ కట్టడం. రెండో పద్ధతి ఒరిజినల్ డైలాగ్ ఉన్నది ఉన్నట్లు చెప్పడం.

అసలు "హ్యూమర్" అంటే హేమర్ అనగా సుత్తి కొట్టడం అనుకొనే బా మహానుభాగులు ఎందరో! అందరికీ వోల్‌సేల్‌గా సేల్యూట్.

వదిలెయ్! పోతే మీరు విన్నా వినకపోయినా ఒక్క విషయం మనవి

చెయ్యాలి.

ఒక్క లెక్చరిచ్చి మిమ్మల్ని నవ్వించటం ఇంపాసిబుల్. ఎందుకనగా మనిషి నవ్వుకోటానికి ఐ మీన్ మనిషిలో సెన్సాఫ్ హ్యూమర్ చచ్చిపోతోంది. మీ బాస్ మీదకు జోక్ కట్ చేశారనుకోండి అది ఖచ్చితంగా మిస్ ఫైర్ అవుతుంది. వాడు దాన్ని డైజస్ట్ చేసుకోడు. నామీదో ఎంత జోక్ కట్ చేశాడు? వీడి సెన్సాఫ్ హ్యూమర్ మండిపోనూ అనుకొని హాయిగా నవ్వటం లేదూ. కుతకుతలాడిపోయి మీకపకారం తలపెట్టకపోతే ఒట్టు. ప్రామిస్. కమింగ్ టు ద పాయింట్!

మనందరి బాపు – రమణ; ఒకరు కార్టూన్ – ఒకరు జోక్.

ఆంధ్రవేశానికి 'ఆస్సెం' అంటే ఇక చెవలాయిల్లారా అని చెప్పారు.

బాపు కార్టునొక్కటే బాపురే అనిపించు
రమణ కేప్షనొకటి – రమణీయ మౌను
స్వాతి వాడు మెచ్చి – ఖ్యాతి గనినాడు
ఇంటింటి పత్రికై – ఇంతింత పెరిగె.

మిస్టేర్ గిరీశం డిఫైన్ కామెడీలో హ్యూమర్ అని డిప్టీ కలెక్టర్ దొరవారు నాకు ఓసారి ఆర్డర్ వేశారు. నేను సింపుల్‌గా బాపు–రమణ అని రిప్లై ఇచ్చా! వాట్ అని దొరవారు ఆశ్చర్యపోయారనుకో.

అప్పుడు బాపు కార్టున్లు ఓ డజను రమణ పుస్తకాలు ఓ అర డజనుడు వారి ముందు పడేసి చదవండి అన్నారు. దొరవారు నాకేసి అనుమానంగా చూశారు. అప్పుడు వారికి నేను ఇంగ్లీషులోకి ట్రాన్స్‌లేట్ చేసి వినిపించా. ఏమిటి నమ్మట్లేదా ఇట్స్ ట్రూత్. అగ్నిహోత్రావధాన్లుగారి కచేరి కాయితాలు తర్జుమా చేసినవాడ్ని... మహత్తరమైన పుస్తకాలు తర్జుమా చెయ్యలేనా! నన్నడిగితే ఈ పుస్తకాలు కార్టూన్లు కథలు సినిమాలు అన్ని భాషల్లోకి తర్జుమా చేస్తే ప్రజల్లో సెన్సాఫ్ హ్యూమర్ పెరిగి ఆరోగ్యం బాగుపడి హ్యూమర్ క్లబ్ పేరుకు బాపు – రమణ అని మెయిన్ హెడ్డింగ్ పెట్టుకోవచ్చు.

సగటు తెలుగు జీవితానికి సగటు తెలుగు ఆస్సానికి బాపు రమణ తార్కాణం. గోదావరి ఓవనది తెలుగు జీవినం జీవితం అయితే బాపు రమణ టు

దేంక్స్ ఆఫ్ దట్ రివర్. ఆ నదికి రోడ్డు కం రైలు బ్రిడ్జిలా వారు గీత – రాత.

మా గ్రాండ్ ఫాదర్స్ ప్రోపర్టీ డజన్ట్
జరా ఇటిజీ లిటరేచర్ ఎంబడీడ్ విత్ హ్యూమర్
దోజ్ హు ఆర్ రీడ్ ఆర్ రెడ్ ఇట్ విల్ నెవ్వర్ డై డై హ్యూమన్!

అన్జెప్పి డిప్టీ కలెక్టర్ వారికి ఓ పోయమ్ డిక్టేట్ చేసేసరికి ఆయన దంగైపోయి గోదావరి (లంక పుగాకు) పాయొకటి ప్రజంట్ చేశారు. ఏమిటి నవ్వుతావు. లంక పుగాకు పాయండీ... మధురవాణి జడలా మెత్తగా ఒత్తుగా మొగలి పొత్తులా మత్తుగా గుండెలకు హత్తుకునేలా ఉంటుంది. సారీ సబ్జెక్ట్ డైవర్ట్ అయింది. బాపుగారికి చెప్పానోయ్ బంగారు పిచ్చిక మళ్ళీ తియ్యద్దు కన్యాశుల్కం తీద్దామండీ కావలిస్తే నేను ఫైనాన్స్ చేస్తానన్నా. ఆయన సబ్జెక్ట్ అవుటాఫ్ డేట్ అన్నారు. రమణగారికి చెప్పా ఆయన విన్లేదు. ఇద్దరూ నవ్వుకున్నారు. టు ఎర్ర్ ఈజ్ హ్యూమన్ అని అది ఫ్రెండ్షిప్. దాన్ని రమణగారు ఓ సిన్మా ప్రేమించి చూడులో చెప్పారు. "మిత్రమా! కల్యాణమైనా కారాగారమైనా కలిసే?" ఎంత పవర్‌ఫుల్ ఫ్రెండ్షిప్. నాలిక పీకేస్తోంది. ఓ సిగార్ పడెల్సు! సిగార్ మీద ఓ పొటుత్రే నోట్‌బుక్ తీసి రాసుకో! ఇది నేను కాలేజీ డేస్‌లో రాశా!

"లెట్ మి లిట్ ఎ సిగార్
జస్ట్ లైట్ దట్ ఇన్ ఏ కోల్డ్ వెదర్
ఫీల్ ద వామ్త్నెస్ మా ఓ ఇట్ గివ్
రీల్ ది మెమొరీస్ యాజ్ డై లైవ్"

పొయిత్రీలో మిస్టేక్స్ ఉన్నాయా కరెక్ట్ చేసుకోవోయ్!

బాపు రమణలు గోదావరి నదీమ తల్లికి రెండు గట్లు, ఆ ఓవనది నీరు తాగినా అన్నం తిన్నా గాలి పీల్చినా వాళ్ళలో ఓ ఉత్సాహం, ఓ సరదా, ఓ వేళాకోళం, ఓ వెక్కిరింత, ఓ చక్కలిగింత, ఓ గిలిగింత, కొంచెం శృంగారం, కొంచెం నయగారం, రవ్వంత మమకారం, కొండంత ఉపకారం ఇవన్నీ కలిస్తే ఓ గోదావరి జిల్లా వాడు! ఆమె కూడా!

నేను కృష్ణా అయినా నాకు గోదావరి వాసులంటే అభిమానం. అందుకే

గోదా"వరి" అన్నం భాగ్యం

గోదావరి నీళ్ళు ఆరోగ్యం

గోదా"వరి" గాలి భోగ్యం

ఇదీ! గోదావరి వాళ్ళ సౌభాగ్యం.

అది ఆ జిల్లావాసుల పూర్వ పుణ్యఫలం. శ్రీకృష్ణ పరమాత్మ పుట్టింది ఒకచోట. వెలిగింది మరొక చోటులా! నేను పుట్టింది కృష్ణా అయినా పెరిగింది పెంచింది గోదావరి. అందుకే నాకా యాసన్నా, ఆ బాసన్నా అంత యావ.

నేను అమెరికాలో ఉండగా మా ఇంటికి పేరంటానికొచ్చిన ఓ అమ్మాయి మాటని బట్టి ఆ అమ్మాయిది గోదావరి జిల్లా అని తెలుసుకొన్నా. ఆ అమ్మాయి ఇంతకీ నా ప్రాణ స్నేహితుడి కోడలు అని తెలిసి ఆనందపడ్డా.

గోదావరి నది కళా స్వరూపం అనుకుంటే ఆ నది రెండు చేతులు బాపు రమణ. ఆ నది కళా స్వరూపాన్ని ఆనందించిన నేను ధన్యుణ్ణి. ఆ కళామ తల్లి ముద్దు బిడ్డలకు నేనిచ్చే అక్షర లక్షలు.❀



# గిరీశం లెక్చర్
## (టెన్ పాయింట్స్ ఆన్ పెజాసేవ)

ఏందోయ్ వెంకటేశం కనిపించడమే మానేశావ్!

ఆగు! అట్టే ఆగు గుఱ్ఱాన్ని కాస్త కట్టేసెయ్! ఎప్పుడూ గూటిబిళ్ళలు బచ్చాలేనా. కూసింత కళాసేవో పెజాసేవో చేసుకోబోతే రేపు పొలిటియన్‌వి ఎలా అవుతావ్. పెద్దాయన పోయాక ఆ స్టైల్లో లెక్చరిచ్చే వాళ్ళే కరువైపోయారనుకో! నాదేమన్నా అల్లాటప్పా లెక్చరనుకున్నావా! లేకపోతే మన పొలిటీషన్లు ఇచ్చే లెక్చరనుకున్నావా! అసలు నా లెక్చర్‌కు పొలిటీషియన్ లెక్చరుకు పోలికేమిటోయ్! ఎక్కడన్నా కంపేరిజన్ ఉందా! ఉంటే గింటే కాంట్రాస్టే గాని. తింటే పూటకూళ్ళమ్మ చేతి గారెలే తినాలి. వింటే గిరీశం ది గ్రేట్ లెక్చరే వినాలి అని పబ్లిక్ టాక్. నువ్వెప్పుడూ వినలేదుటోయ్! నా లెక్చర్ మీ సిస్టర్ బుచ్చెమ్మలా ప్యూర్ డైమండ్. మరి పొలిటీషియన్ లెక్చరో మధురవాణిలా వట్టిగాజు పూస. డైమండ్‌కీ గాజుపూసకీ పోలికా ఠాఠ్! ఇది బాగుంది ఇంకోటి చెప్మంటావా! ఓ! దానికే భాగ్గెం ధొంజడ్ చెబుతాను. శాంపిల్‌కి ఇంకోటి. నా లెక్చర్ చర్చిల్ దొరవారి నోట్లో హవానా సిగార్ లాంటిది. మరి మన పొలిటీషన్ లెక్చరో ఘుప్పు ఘుప్పుమని బొగ్గింజన్లా పొగే కాని ఆ కమ్మదనపు చాయ మెర్క్యురీ లాంప్ వేసి వెదికినా కనపడదనుకో. ఏమిటి నువ్వెప్పుడూ హవానా చుట్టలు కాల్చలేదా! ఓ వాటే షేమ్! నీక్కాదోయ్ నాకు. ఈసారి చర్చిల్ దొరవారికి చెప్పి రిటర్న్ స్టీమర్లో రెండు మూడు బాక్సులు పంపమని చెప్తాలే డోన్ట్ వర్రీ.

ఇదీ బాగుంది ఇంకోటి చెప్మంటావా! అయితే విను. నా లెక్చర్ చర్చిల్ దొరవారి నెత్తిపై హేట్ లాంటిది. ఆ మాటకొస్తే క్వీన్ ఎలిజబెత్ క్రౌన్ లాంటిది. మరి మన పొలిటీషియన్ లెక్చరో, మన పూటకూళ్ళమ్మ నెత్తిమీద ముసుగే. ఇది మరీ బాగుందంటావా. నీ బుఱ్ఱ షార్ప్‌నెస్ చూస్తుంటే నువ్వీ పాటికే క్రిమినల్ 'లా'లో కానిస్టేబుల్ ఎగ్జామ్ పాసయిపోయి ఉండాలే. ఇంకోటి చెప్తా నోట్‌బుక్ తీసి రాసుకో. నైన్టీ సెవెన్టీలో అనుకుంట మన తెలుగు లిటరేచర్ మీద డియన్నార్

కాలేజి భీమారం వాళ్ళు ముచ్చట పడి కాళ్ళావేళ్ళా పడితే ఓ లెక్చరిచ్చా. ఆ దెబ్బతో డియన్నార్ కాలేజి డంగైపోయిన విషయం ఆ కాలేజి మేగజైన్లో రాశారు. చూళ్ళే! పోన్లే ప్రిన్సిపాల్‌కి ఫోన్‌చేసి ఓ కాపీ తెప్పిస్తా. మన పొలిటీషియన్లా ఊరికే పెజాసేవ పెజాసేవ అని అరిస్తే పెజాసేవ అయిపోయినట్టేనా? నో నో! నో. కాస్తో కూస్తో ఎనకో ముందో నాలుగు రాళ్ళు వేసుకుంటేనే నిజమైన పెజాసేవ చేసినట్టు.

ఎందుకంటే రేపు ఏ పార్టీ అన్నా ఈసారి మా పార్టీలో జెండా భుజానికెత్తుకోండీ అందనుకో! ఏమిటట్లా నవ్వుతావ్. మనకి ఏ పార్టీ టికెట్ ఇస్తుందనా, సిల్లీ పాయింట్. సందుకో పార్టీ కుక్కగొడుగుల్లా ఐమీన్ మష్రూమ్స్‌లా పుట్టుకొచ్చి గంగతో కలిసిపోతున్నాయి.

గంగలో కలపటానికి అంత దూరం ఎందుకు? ఏ గోదాట్లోనో, కృష్ణలోనో, ఉస్సేన్ సాగర్‌లోనో కలపొచ్చు కదా అంటావా! గంగ పొల్యూట్ అయినంతగా మన దేశవాళీ రివర్సు అంత పొల్యూట్ కాలా.

నా మట్టుకు నేను ఏ పార్టీ జెండా లేకుండానే రియల్ పెజాసేవ చేస్తున్నాను కదా. ఇంతవరకు ఎవరైనా గుర్తించారా! లేదే. ఏమిటి? ఏం చేశాననా! ఎంత మాటన్నావ్. యు టూ బ్రూటస్. అదే ఎవటన్నా అని ఉంటే మాడు పగలగొట్టేవాడిని. నన్ను గుర్తించేవారు లేక ఇలా బూజుపట్టి పునస్కారాలు మెళ్ళో దండలా భుజాలపై భుజకీర్తులు కండువాలు కిరీటాలు నెత్తిపై టోపీలు లేక ఇలా ఉన్నాగాని, ఎవరైనా గుర్తిస్తే ఈ పాటికి సెంట్రల్లో చక్రం తిప్పక పోదునా.

ఏమిటి నే జేసే పెజాసేవ అని కదూ నీడౌట్. నిజమైన ట్రూ పెజాసేవకుడికి ఏ పార్టీతో పన్లేదు. సరే సరే చెప్తా విను. నెంబర్ వన్. హైద్రాబాద్ నవాబుగారు మంత్రిగిరీ ఇస్తానంటే వద్దుపొమ్మని నీకు ట్యూషన్ చెప్పటం పెజాసేవ కాదా! నెంబర్ టు. సానివాడలో మధురవాణి లాంటి వాళ్ళని చూసి హార్ట్ మెల్టయి ఇంగ్లీషు పాఠాలు చెప్పి వాళ్ళని ఉద్ధరించటం పెజాసేవ కాదా! నా దగ్గర సిగార్స్ కే కొటర్స్ లేవు. కావాల్సినంత కరెన్సీ ఉంటేనా అక్కడొక ఇంగ్లీషు మీడియం స్కూల్ పెట్టక పోదునా. త్రీ. మీ నాన్నకి కచేరీ కాయితాలు ఫ్రీగా

ట్రాన్స్‌లేటీ చేసి పెడుతున్నానా. ఫోర్ ఆర్ టుసే మీర్. మీ సిస్టర్ బుచ్చెమ్మ లేత తమలపాకు లాంటి చేతులు కందిపోతాయని ఆవిడ చేతిలో చాంతాడు లాక్కుని రెక్కలు ముక్కలయేటట్లు ఎన్ని నీళ్ళు తోడి పోస్తున్నా! ఇది పెజాసేవ కాదూ! ఆ మర్చిపోయా నెంబర్ ఫైవ్ అంటే గుర్తొచ్చింది. రమణగారి రుణానందలహరి. మొన్నోసారి ప్రాణం మీదికొచ్చి మీ నాన్నని ఓ ఫైవ్ అప్పడిగా. ఎప్పటికి కావాలన్నాడు. నిన్నటికి అన్నా. మొన్నటికైనా సరే నా దగ్గర ఈడ్చి తంతే దంబిడీ లేదన్నాడు. పల్లెటూళ్ళో జోకులు పేలవోయ్.

ఇది పెజాసేవంటే అని ఎక్కడైనా బోర్డు రాసుంటుందీ. ఉండదు. ఎందుకంటే మనం ఏది చేస్తే అది పెజాసేవ. అంతెందుకు. నువ్వు జాం చెట్టెక్కి కాళ్ళు చేతులు విరకొట్టుకుంటావని నేనే నీకు జాంకాయలు కోసేస్తున్నానా. ఇది పెజాసేవ లేదా బాలసేవ కిందకి వస్తుంది. బాలానాం బ్రహ్మ అన్నారు. అనగా పిల్లలు దేముడు అన్నమాట. అనగా పిల్లలకి జాం కాయలూ అదీ కోసిపెడితే దేముడు సంతోషిస్తాడు.

నెంబర్ సెక్సు. ఎందుకు అలా నవ్వుతావ్! సెక్సు కాదు సిక్సు అనాలనా! రమణగారు రాజకీయ భేతాళం... రాస్తూ ఇందులో సెక్సప్పీల్ బొత్తిగా ఉండదు కను సెక్సప్పీల్ కోసం కథలు చదివే వారి సౌకర్యం కోసం బాపు ఒక 'బొమ్మ' వేశారు. క్లాసిక్ హ్యూమర్‌కు మెచ్చుతునక.

బాపుగారి అమ్మాయి బొమ్మలు చూసి హాలీవుడ్‌లో మార్లిన్ మన్రో రీటాయేవర్ల్ సోఫియా లారెన్స్ గుండెలు బాదుకున్నారు. టెలుగూస్ నేటివిటీలో ఇంత బ్యూటీ ఉందా అని. ఎక్కడున్నాం...ఆ....

పెజాసేవ నెం సెవెన్. (మిలట్రీ లోనో పోలీసుల్లోనో గొప్పగా సేవ చేసిన వారికి మెడల్స్ ఇస్తారొయ్! మరి పొలిటిక్స్‌లో అలాంటి సేవలు చేసేవాళ్ళకి ఏమిచ్చి గౌరవిద్దామంటావా! చెప్తా విను. వీళ్ళు ఐ మీన్ ఈ పొలిటీషియన్లు ఎన్ని శిలాఫలకాలు ఆవిష్కరిస్తే అంత పెజాసేవ చేసినట్టు. అందుకని ఆళ్ళ సిమెంటు బొమ్మలు సెంటర్లో పెట్టుకొని గౌరవిస్తాం. లేకపోతే రోడ్డకి పేరెట్టుకుని ఆ రోడ్డమ్మట వెళ్ళలేనంతగా చెత్తా చెదారం పారేస్తాం) పూటకూళ్ళమ్మకి సంతలో

సామాను కొనిపెట్టడం పెజాసేవ కాదా! పరోపకారం ఇదం శరీరం అన్నారు. ఇతరులకు ఉపకారం చెయ్యటమే ఈ బాడీ మెయిన్ డ్యూటీ. పోతే నెంబర్ ఎయిట్. మీ అమ్మగారు నూతిలో పడిపోతే ప్రాణాలకు తెగించి రక్షించానా లేదా. గట్టిగా రికమెంట్ చేసేవాళ్ళు లేకగానీ దీనిగ్గాను ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా బ్రేవరీ రివార్డో అవార్డో ఏదో ఒకటి వచ్చి ఉండాలి. ఇలాంటి పనులు పెజాసేవ కిందకి వస్తాయా దేశ సేవ కిందకి వస్తాయా అన్నపాయింట్ పార్లమెంట్‌లో చర్చకు పెట్టి బిల్ పాస్ చేయించాలి. నైన్ యస్ ఇట్స్ ఫైన్. సాచ్చిలను సంస్కరించుట అనగా వాళ్ళ వ్యాపారం మీద పన్ను వేయుట. నెంబర్ టెన్ యస్ ఇట్సేడన్. మీ యంగెస్ట్ సిస్టర్ మారేజి చెడగొట్టటానికి నేనొక మాస్టర్ ప్లాన్ రెడీ చేశా! గంట నుంచీ లెక్చరిస్తున్నా! లంక పుగాకైనా ఫర్లాఔ నోరు పీకేస్తోంది. ఏమిటి కాల్చి పడేసింది ఉందంటావా! ఐతే అవుట్ ఎనీ స్టైటెస్ట్ అబ్‌జెక్షన్... ఏమిటి అలా వెళ్ళిపోతావు. డామిట్ లెక్చర్ అడ్డం తిరిగిందా! బోర్ కొట్టిందా! షేక్స్పియర్ పడ్డ అవస్థలో పడ్డాం... ఎవరో వస్తున్న...ట్టు..న్నా...రు. ❁

**(బాపు-రమణలకు అశ్రునయనాలతో.. అంకితం)**



# బాపు- బాపూజీ

1) బాపు తెరస్మరణీయుడు
బాపూజీ చిరస్మరణీయుడు

2) బాపు కొంటెనవ్వుల గని
బాపూజీ బోసినవ్వుల ఖని

3) బాపు చిత్రాలను తిరిగి తీశారు
బాపు చరిత్రలు తిరగ రాశారు

4) బాపు రంగుల కుంచ పట్టారు
బాపూజీ ఖద్దరు పంచె కట్టారు

5) బాపు బొమ్మకు ప్రాణం పోశారు
బాపు జాతికి జీవం పోశారు

6) బాపూ రమణలు గీత-రాత
బాపు ఒక్కరే జాతి పిత

7) బాపు గీతకు పురస్కారాలు
బాపూజీ భగవద్గీతకు నమస్కారాలు

8) బాపు సినీ దర్శకుడు
బాపూజీ దేశానికి దార్శనికుడు

9) బాపు బొమ్మల్లో కొలువై ఉన్నారు
బాపు గుండెల్లో నెలవై ఉన్నారు

10) బాపు గీతలు రమణీయం
బాపూజీ చేతలు చిరస్మరణీయం **- వి.వి.యస్.యస్.రాఘవరావు**

# బాపు- రమణ- నేను

**నా** చిన్ననాటి స్నేహితులు బాపు రమణ. నా చిన్నతనంలో మా నాన్నగారు "ఆంధ్రపత్రిక" వీక్లీ చదివేవారు. నేనప్పుడు అయిదో తరగతి చదివేవాడిని జమిందారుగారి వీధరు బళ్ళో. ఓసారి ఏ అదృష్ట దేవత కరుణించిందో ఆ పత్రిక తీసి చూస్తే అందులో నన్ను ఆకర్షించినది బుడుగు. వాడిలో నన్ను ఊహించుకుంటూ ఉండేవాడిని. బి బుడుగు అంటే భూలోకం బుడుగు. సి. బుడుగు అంటే చంద్ర లోకం బుడుగు అని రమణగారు చమత్కారంగా రాసేవారు. అప్పట్లో దీపావళి పండక్కి స్పెషల్ ఎడిషన్స్ వచ్చేవి. అందులో బాపు కార్టూన్ క్లిప్స్ ఉండేవి. కార్టూన్ స్టోరీస్. అవంటే నాకెంత ఇష్టమో.

బుడుగు ఇంకొంచం పెద్దాడయితే అంటే నయిన్త్ క్లాస్‌లోకి వస్తే టాం సాయర్ అవుతాడు. టాం సాయర్ (మార్కెట్విన్) చదివా. "జెక్" కోసం టాం త్యాగాలు అంటే ఆ పిల్ల కోసం తను దెబ్బలు తినటం లాంటిది నాకెంతో నచ్చింది. తర్వాత ఇంగ్లీషు ట్రాన్సిలేషన్స్ చాలా చదివా మా నాన్నగారి దయవల్ల. ఆయన ఆ పుస్తకాలు చాలా భద్రంగా దాచుకొన్నారు.

ఓ రోజు మా స్కూల్ దగ్గర్లో ఉన్న పబ్లిక్ లైబ్రరీలో కన్యాశుల్కం నాటకం చదివా. అందులో గిరీశం పాత్ర నాకెంతో నచ్చింది. రేడియోలో కీ॥శే॥ శ్రీ కె. వెంకటేశ్వరరావుగారి "కాన్యశుల్కం" నాటకం వస్తే అదీ విన్నా. అప్పటినుంచి ఆ పాత్ర నభియించడం నేర్చుకున్నా. అలా మాట్లాడుతూ డిగ్రీలో చదివే రోజుల్లో గిరీశం పాత్రని మోనో యాక్షన్ చేశా. నా క్లాస్‌మేట్స్ "గిరీశం" అని నిక్‌నేమ్ పెట్టారు. గర్ల్‌ఫ్రెండ్స్ కూడా అలాగే పిల్చేవాళ్ళు.

ఈ సందర్భంగా చిన్న కోట్ మనవి చెయ్యాలి.

కన్యాశుల్కం నాటకంలో "నాతో మాట్లాడడమే ఎడ్యుకేషన్" అంటాడు గిరీశం, శిష్యుడు వెంకటేశంతో.

దాన్నే ముళ్ళపూడి వెంకటరమణగారు చక్కగా పారడీ చేసీ,

"కొందరితో మాట్లాడకపోవడమే ఎడ్యుకేషన్" అన్నారు. ఆ డైలాగ్‌ని పేరడీ చేసి "కొందరితో మాట్లాడటం కో-ఎడ్యుకేషన్" అన్నా. అంటే దీన్నిబట్టి రమణగారు నాలో ఎంత జీర్ణించుకుపోయారో తమరు అర్థం చేసుకోవాలి.

ఇదంతా ఎందుకు చెప్పాల్సి వచ్చిందంటే, ఓ కన్యాశుల్కం నాటకం రమణగారికి ఎంత ప్రభావితం చేసిందో, ఆయన సృష్టించిన పాత్రలు చెబుతాయి. ఆ పాత్రలకు రూపమిచ్చిన బాపు వాహ్!

గిరీశం పాత్రకి రూపమిచ్చిన బాపు. బుడుగు పాత్రకు రూపమిచ్చిన బాపు. రెండు జెళ్ళ సీత బాబాయి, ఓ పక్కింటి పిన్నిగారు ఆవిడ మొగుడు (మొగుడు కాదు)

వంగి వంగి దణ్ణం పెట్టే రాజకీయ నాయకుడు అప్పుల అప్పారావు. ఇద్దరమ్మాయిలు, ముగ్గురబ్బాయిలు సగటు తెలుగు గ్రామ వాతావరణం ఇవన్నీ సృష్టించే సగటు మనిషి జీవితాల్ని చిరు నగవుల మయం చేశారంటే - అది తెలుగువాళ్ళు చేసుకున్న పుణ్యం.

ఆరోజుల్లో పిల్లలకు బుడుగు పేరు పెట్టుకునేవారు. ఆడపిల్లలయితే బుడిగి అని పేర్లు.

మేం చదువుకొనే రోజుల్లో సాహిత్యం గురించి ఎక్కువగా చర్చలు జరిగేవి. కాలేజి గ్రౌండ్స్‌లో కూర్చుని సాహిత్యం గురించి రాత్రి తెల్లవార్లూ చర్చించేవాళ్ళం. మా చర్చల్లో (ఎక్కువ భాగం) అనగా 'సింహ శాతం' బాపు - రమణలే. వాళ్ళు (వే)రాసిన పుస్తకాలు బహుమతులుగా ఇచ్చుకోవటం ఓ సంప్రదాయం అయింది మాకు. బాపు-రమణలు మా జీవితాలలో ఓ భాగమైపోయారు.

వాళ్ళు మా పెద్దమ్మ కొడుకులయినట్టు నిత్యం వాళ్ళనే స్మరించేవాళ్ళం. నేను కాలేజి మేగ్‌జైన్‌కి "గిరీశం సాహిత్యోపన్యాసం" అని ఒక లెక్చర్ రాశాను. దానిని డి.వి.పి. రాఘవ అనే మిత్రుడు తీసుకొని, నాకు "ఆధునిక శకుంతల" అనే కథ ఏదో ఒకటి ఇచ్చి నా పేరు మీద అచ్చయింది. ఇలా కథలు మార్చుకొనేవాళ్ళం. అప్పట్లో ఇప్పటి ప్రఖ్యాత రచయిత మల్లాది వెంకట కృష్ణమూర్తిగారి చిన్నకథ "చందమామ" పత్రికలో వచ్చింది. ఆయన్ని అభినందిస్తూ చందమామకి ఒక ఉత్తరం రాశా.

అయిందా, నేను ఉయ్యూరు రావడం జరిగింది. శ్రీ దుర్గాప్రసాద్ మాష్టారుతో పరిచయం. ఆయన నన్ను బాగా ప్రోత్సహించేవారు. నా కథ "రుక్మిణీ అడిగింది" స్వాతి సాహితీ మాసపత్రికలో వస్తే ఆ కథ ముళ్ళపూడి వారి "మురళీ" కథ అంత బాగుందని ఓ కార్డు రాశారు. ఆ కథ ముళ్ళపూడి వారికి పంపితే కథలో వర్ణన, చమత్కారం బాగున్నాయి అంటూ ఆయన తెలుగు సమాధానం రాశారు. ఆ ఉత్తరం నేను తరువాత కథా సంకలనం బ్యాక్ పేజీలో వేసుకొన్నా.

సాహితీ పరంగా, నాటకాల పరంగా ఉయ్యూరులో నే గడిపిన రోజులు స్వర్ణయుగం. గబ్బిట దుర్గాప్రసాద్‌గారు శ్రీకృష్ణుడయితే, నేను అర్జునుణ్ణి. మా అనుబంధం ఏనాటి పూర్వపుణ్యమో!

ఇలా పుస్తక రూపం రావటం అది మా అభిమాన రచయిత, చిత్రకారులకు అంకిత రూపంలో రావటం ఆయన ప్రోత్సాహం ఎంత చెప్పలేను.

ఓ చిత్రకారుని, రచయితని తమ అభిమానులుగా కాక కుటుంబ సభ్యులుగా వారి ఫోటోల్ని ఇంట్లో దాచుకోక గోడలకు తగిలించాము అంటే ... ఓ చిన్న సంఘటన చెప్పాలి.

మా యింట్లో ఓసారి ఉన్నవారి ఫోటోలు చూసి మా బంధువు వీరిని ఎక్కడో చూసినట్లు ఉందండీ అన్నారు. నేను అది మా అన్నయ్యల ఫోటోలు అన్నా. ఆయనకి అర్థం కాలా! అప్పుడు చెప్పా వాళ్ళకి, నాకూ ఉన్న రిలేషన్. ఆయన 'హోరున'

ఆశ్చర్యపోయి "హౌరా" అని ముక్కున వేలేసుకున్నాడు.

ఆయన రాసిన ప్రతి అక్షరం నా హృదయంతో చదివా! బాపు గీసిన గీత నా హృదయంలో భద్రపరిచా. ఇక్కడ బాపూని ప్రశంసిస్తూ కవి ఆరుద్ర రాసిన 'కూనలమ్మ పదం' జ్ఞాపకం చేసుకోవాలి.

కొంటె బొమ్మల బాపు
కొన్ని తరముల నీపు
గుండె మాయల తాపు
ఓ కోయిలమ్మా

మూడు వేదాల్ని నాలుగు చేసిన వ్యాసునిలా, సమగ్ర ఆంధ్ర సాహిత్యాన్నీ ఔపోసన పట్టిన ఆరుద్ర ప్రశంస పొందిన మా పెద్దన్నయ్య బాపూ నీకివే మా జోహార్లు. ఇంతటి అదృష్టం ఎవరికి పట్టింది.

నన్ను ఓసారి మా ఫ్రెండ్ అడిగింది. రమణాగారి గురించీ మీరు ఇంతగా మాట్లాడతారు కదా! ఆయనపై ఆశువుగా ఓ సరదా కవిత చెప్పండి అందీ. నన్నెవరన్నా ఛాలెంజ్ చేస్తే నాకు భలే సరదా! సరదాగా అడిగింది కదా అని సరదాగా చెప్పానిలా! ఆశువుగా. ఇది నా మొదటి ఆశు కవిత. ఇంగ్లీషులో దీన్ని "ఏస్ పోయట్రీ" అంటారు బుడిగీ హియర్ మి.

రమణ రచనల హాస్యం
పెదవులపై ఆడించు లాస్యం
చదవాలి మీరు అవస్యం
చదవండి! ఎందుకాలస్యం?

అన్నం తినేటప్పుడు బెద్దలు వొచ్చాయని అన్నం పారేస్తామా! అన్నం - పరబ్రహ్మ స్వరూపం అన్నారు. సో వాటీజ్ పోయట్రీ. సరస్వతీ స్వరూపం కదా! అన్నంలో బెద్దలు ఏరుకొన్నట్టే పోయట్రీలో మిస్టేక్స్ కరెక్ట్ చేసుకోవాలి.

మైక్ చేతిలో ఉంటే ఎన్ని గంటలైనా లెక్చరివ్వగలను వినేవాడికి ఓపికుంటే!

బాపు-రమణ అంటే ఓ డెబ్బై ఎనభై ఏళ్ళ హిస్టరీని ఏడు.. ఎనిమిది నిముషాల్లో మాట్లాడమంటే ఈస్ దేర్ ఎనీ మీనింగ్! ఈస్ దేర్ ఎనీ రీజనింగ్... నో... సో బాపు-రమణ అంటే... దే ఆర్ ట్రెండ్ సెట్టర్స్. ఎవరో అన్నారు ఈ మధ్య వాళ్ళు డెడ్ దైర్ బోడీస్ మే డై. బట్ దైర్ సోల్స్ ఆర్ నాట్ దైర్ లిటరేచర్ స్టోరీస్, కార్టూన్స్, పిక్చర్స్, డైలాగ్స్, వాట్‌నాట్... దే లివ్ లాంగ్... యాస్ లాంగ్ సో లాంగ్... యాస్ లాంగ్. యాజ్ తెలుగు లిటరేచర్ లివ్స్ లాంగ్. గుడ్ బై మై ఫ్రెండ్స్... మై బ్రదర్స్. మిలార్డ్స్. ఐ యామ్ యువర్ డివోటీ... యువర్ బ్రదర్. యువర్ ఫ్రెండ్... ది ఎండ్...❀ **(హాస్యం కోసం ఇందులో కొందరు ప్రముఖ రచయితల పేర్లు వాడుకోవడం జరిగింది. వారికి క్షమాపణలతో... -రచయిత)**